సాహితీ
గత వారంలోని పుస్తకాల పై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada,Visakhapatnam, Hyderabad,Rajahmundry,Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-6-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 129 పేజీలు: 12 వెల: 6.50

హార్ముజ్‌ను తెరుస్తాం.. కానీ ఫీజు తప్పదు: ఇరాన్

కాల్పులు ఆపండి.. ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక

9లో



సోమవారం విశాఖ స్టీల్ కర్మాగారంలోని ఎస్ఎంఎస్1లో లిక్విడ్ స్టీల్ దూసుకొచ్చి భగ్గుమన్న ప్లాంట్

# స్టీల్ ప్లాంట్‌లో ఘోరకలి

**లిక్విడ్ స్టీల్ తరలిస్తుండగా భారీ పేలుడు**

**మరుగుతున్న స్టీల్ పడడంతో 9మంది సజీవ దహనం**

విశాఖ కర్మాగారంలో అంతా హృదయ విదారక దృశ్యాలు

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు

డి.సిఎం పవన్, మంత్రి లోకేశ్ ప్రగాఢ సానుభూతి

మృతుల కుటుంబాలకు రూ.2లక్షల సాయం ప్రకటించిన ప్రధాని



క్షతగాత్రులను తరలిస్తున్న సిబ్బంది

**విశాఖపట్నం(గాజువాక),జూన్ 8,ప్రభాతవార్త:** విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్1) విభాగంలో జరిగిన భారీ పేలుడు కారణంగా తొమ్మిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉండడంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని తెలుస్తోంది.సోమవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఎస్ఎం ఎస్1లోని సీసీడీ2 వద్ద కార్మికులు విధుల్లో ఉన్నారు. ఎల్ అండ్ డి మీద లాడిల్ ఉంచి, స్లైడ్ గేట్ ఓపెన్ చేసిన వెంటనే సాంకేతిక లోపంతో 1600 డిగ్రీల వేడితో కూడిన ద్రవరూప ఉక్కు (లిక్విడ్ స్టీల్) ఒక్కసారిగా బయటకు దూసుకొచ్చింది. దీంతో అక్కడ భారీ పేలుడు సంభవించి, మంటలు వ్యాపించాయి. అక్కడ పనిచేస్తున్న 14 మంది కార్మికులపై ఆ వేడి ద్రవం పడిపోవడంతో ఎనిమిది మంది అక్కడికక్కడే గుర్తు పట్టలేనంతగా కాలిపోయి మరణించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు కన్నుమూశారు. **మృతుల వివరాలు: ఉక్కు ఉద్యోగులు:** గోల్డ్ కుమార్ (మేనేజర్ మెషిన్2 ఇంచార్జ్), గొంతిన భానుకుమార్ (టెక్నీషియన్), జి.వి. అప్పారావు (టెక్నీషియన్), ఎం.కృష్ణ నాగు (టెక్నీషియన్), కే.ప్రభాకర్ (జనరల్ ఫైర్ మెన్). **కాంట్రాక్ట్ కార్మికులు:** రమణ, త్రినాథ్, ఎం.అప్పలరాజు, (మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది). పమాదం జరిగిన వెంటనే ఉక్కు రక్షణ సిబ్బంది రంగంలోకి దిగి మృతదేహాలను వెలికితీశారు. తీవ్రంగా గాయపడిన మిగతా వారిని అత్యవసరంగా నగరంలోని వివిధ ప్రైవేట్

>>2



ప్లాంట్‌లో మంటలను ఆర్పుతున్న సిబ్బంది



సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వనిత రాణికి రాజ్యసభ నామినేషన్లు దాఖలు చేస్తున్న చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీష్

## టిడిపి అభ్యర్థుల నామినేషన్లు

**చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ, సానా సతీష్‌లు రాజ్యసభకు ఏకగ్రీవమయ్యే అవకాశం**

**విజయవాడ,జూన్8,ప్రభాతవార్తప్రతినిధి:** రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరుపున సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లు నామినేషన్‌లు దాఖలు చేశారు. సోమవారం అమరావతి అసెంబ్లీ భవనంలో సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్‌లు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్‌అధికారి ఆర్.వనితా రాణికి అందచేశారు. ఈ నామినేషన్ల దాఖలు ప్రక్రియలో కూటమి పార్టీ నేతలు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు.రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా సానా సతీష్ రెండు సెట్‌ల నామినేషన్‌లను సమర్పించారు. ప్రతిపాదకులుగా చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీ నారాయణ, పంతం వెంకటేశ్వరరావు(నానాజీ), తంగిరాల సౌమ్య సంతకాలు చేశారు. రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా బాష్యం రామకృష్ణ రెండు సెట్‌ల నామినేషన్‌లను సమర్పించారు. ప్రతిపాదకులుగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బి.రామాంజనేయులు,కొలిశెట్టి శ్రీనివాస్, శ్రీరాం తాతయ్యలు సంతకాలుచేశారు. రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా చింతకాయల విజయ్ రెండు

>>2

# 2027కు భూ రికార్డులు క్లీన్

**ఆచంట, జూన్ 8 ప్రభాతవార్త:** 2027 నాటికి రాష్ట్రంలో భూ రికార్డులను ప్రక్షాళన చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత పాలకులు పశ్చిమగోదావరిజిల్లా లాంటి పచ్చని ప్రాంతంలోనూ భూ చిచ్చు పెట్టారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. గజం భూమిని కూడా సద్వినియోగం చేసుకునే రైతులనూ గత ప్రభుత్వం వదిలి పెట్టలేదని తీవ్రస్థాయిలో ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో 'మీ భూమి మీ హక్కు' పేరిట రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. దుర్మార్గమైన గత పాలకుల నిర్వాకంతో రికార్డులన్నీ గందరగోళంగా తయారయ్యాయని ప్రజలకు చెందిన భూముల విషయంలో సమస్యలు సృష్టించారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూ రికార్డులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసి యాజమాన్య హక్కుల్ని రక్షిం ంచామని వివరించారు. క్యూ ఆర్ కోడ్ సహా కరెన్సీ నోట్ల తరహా లోనే అత్యంత పటిష్టమైన భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు చేసిన అవకతవకల కారణంగా భూమి రికార్డుల ప్రక్షాళ నకు 3ఏళ్ల సమయం పడుతుందని సిఎం అన్నారు. దేశం లోనే తొలిసారి బ్లాక్ చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తు న్నామని వెల్లడించారు. ప్రతీ యూనిట్‌కు శాశ్వతమైన బ్లాక్ చైన్ ఐడిలు ఇస్తున్నామని,దీని ద్వారా రికార్డులను ట్యాంపరింగ్ చేసేం దుకు అవకాశం ఉండదని తెలిపారు. ప్రజల ఆస్తి పత్రాలపై ఫొటో లు ముద్రించుకున్నారని, పొలం సరిహద్దు రాళ్లపై బొమ్మల కోసం రూ.800 కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. ప్రస్తుతం భూ ముల రీసర్వేప్రక్రియలో రైతులను కూడా భాగస్వాములను చేస్తు న్నామని, ఇకెవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 6688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూమి రికార్డులను అప్డేట్ చేశామని అన్నారు. 26.46 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 67.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 2027 నాటికి రాష్ట్రంలో ప్రతీ రైతు వద్దా తప్పుల్లేని పాస్

>>2





సోమవారం సిద్ధాంతం సభలో పాస్ పుస్తకాలు అందచేస్తున్న సిఎం చంద్రబాబు

పూర్తి ప్రక్షాళనకు మూడేళ్ల సమయం

కరెన్సీ నోట్ల తరహాలో పాస్ పుస్తకాలకు భద్రతా ఫీచర్లు

రాష్ట్రంలో రాజకీయం చేసే అర్హత గొడ్డలి పార్టీకి ఎక్కడిది?

ప్రజలకు, నిరుద్యోగులకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలి

సిద్ధాంతంలో 'మీ భూమి మీ హక్కు' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

స్వచ్ఛ గోదావరి -పవిత్ర పుష్కరాలు లక్ష్యంగా

# సమగ్ర కార్యాచరణ



గోదావరిలో కాలుష్యాన్ని వదులుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలి: డి.సిఎం పవన్ ఆదేశం

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు సైతం నోటీసులు ఇవ్వాలి

**విజయవాడ,జూన్ 8,ప్రభాతవార్తప్రతినిధి:** గోదావరిలో కాలుష్యాన్ని వదులుతున్న అంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు.గోదావరి ఇంత బహిరంగంగా కాలుష్యానికి గురవుతుంటే అధికారులు ఏం చేస్తున్నారు,మీన మీసాలు లెక్కిస్తున్నారా అంటూ మండిపడ్డారు.నదీ కాలుష్యానికి కారకులేవ్వరైనా కఠినంగా వ్యవహరించాలన్నారు. గోదావరి జలాల పవిత్రను కాపాడుతూ పుష్కరాలు నిర్వహిద్దామన్నారు. స్వచ్ఛ గోదావరి–పవిత్ర పుష్కరాలు లక్ష్యంగా ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించామన్నారు.గోదావరి పరివాహక ప్రాంతంలోని 6 జిల్లాల్లో గల 262 పుష్కర పంచాయతీలను గుర్తించి, వాటిని మురుగు రహిత పంచాయతీలుగా మార్చాలని స్పష్టం చేశారు. మురుగు నీరు నేరుగా జీవనదిలో కలవకుండా మున్సిపాలిటీల సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి ప్లాంట్ల (ఎస్‌టీపీ) నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ కాలుష్య నివారణ పనుల కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (పీసీబీ) మంజూరు చేసిన రూ.100 కోట్ల నిధులను వినియోగించాలని ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాడు సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరం వచ్చిన నివేదికలన పవన్ పరిశీలించారు. ఈ నివేదికలలో పొందుపర్చిన అంశాల ఆధారంగా సోమవారం డీసీఎం పవన్ కల్యాణ్ తన కార్యాలయం నుంచి రాజమహేంద్రవరం జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకు ఒకసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు.

>>2

ఎపి బస్సుకు బీహార్‌లో

# ఘోర ప్రమాదం



ముగ్గురు దుర్మరణం

మరో 15మందికి తీవ్రగాయాలు

మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు, గాయపడిన వారికి రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ/సంగం జూన్8, ప్రభాతవార్తప్రతినిధి:**బీహార్ రాష్ట్రంలో నెల్లూరు జిల్లా యాత్రికులతో ప్రయాణిస్తున్న ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురైన ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు, గాయపడిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. అదేవిధంగా తీవ్రంగా గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.2లక్షలు, స్వల్ప గాయాలపాలైన వారికి ఒక్కొక్కరికి రూ.1లక్ష చొప్పున సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీన నెల్లూరు జిల్లా

>>2



## బ్రిడ్జిని ఢీకొని ప్రైవేట్ బస్సు బోల్తా

ఖమ్మం జిల్లా సత్తుపల్లి వద్ద దుర్ఘటన

ఏలూరు జిల్లా నుంచి వెళ్తున్న బస్సు

12 మందికి తీవ్ర గాయాలు

**సత్తుపల్లి జూన్ 8 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా ధర్మాజీ గూడెం నుంచి హైదరాబాద్ వెళుతున్న కె.వి.ఆర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఖమ్మం జిల్లా సత్తుపల్లి సమీప కొత్తలంకపల్లి రైల్వే బ్రిడ్జి సమీపానికి చేరగానే ముందుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్టేక్ చేయబోయి రైల్వే బ్రిడ్జిని ఢీకొట్టి బోల్తా కొట్టిన సంఘటన ఆదివారం రాత్రి 12గంటల సమయంలో జరిగింది. బస్సులో దాదాపు 36 మంది ప్రయాణికులు ఉండగా ఈ ప్రమాదంలో 12మందికి గాయాలవుగా అందులో నలుగురికి కాళ్లు చేతులు విరిగి తీవ్ర గాయాలు అవటంతో సత్తుపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగతా ఎనిమిది మంది స్వల్పగాయాలు అవటంతో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేసి అనంతరం పంపించారు. వీరంతా

>>2





# ఎన్డీయేపై 'ఇండియా' ఐక్యపోరు

**సర్, ఎన్నికల అక్రమాలపై సిజెఐకి లేఖ**

**విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్**

**ధరల పెరుగుదలపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి**

**ఇండియా కూటమి భేటీలో 5 కీలక నిర్ణయాలు**

**మీడియాకు వెల్లడించిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే**

**న్యూఢిల్లీ, జూన్ 8:** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డియే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటం చేయాలని ఇండియా కూటమి పక్షాలు నిర్ణయించాయి. అలాగే ఎన్నికల, రాజకీయ వ్యూహాలను పునఃరూపకల్పన చేయడంపై విస్తృత ఏకాభిప్రాయం కుదిరింది. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), పేపర్ లీక్‌లు, నిరుద్యోగం, దేశంలో నెలకొన్న ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితులతో సహా అనేక కీలకఅంశాలపై ఎన్‌డియే ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి తమ ప్రచారాన్ని, వ్యూహాన్ని పదును పెట్టేందుకు కూటమి మిత్రపక్షాలు ఐదు కీలక నిర్ణయాలను ఖరారు చేశాయి. కీలక నిర్ణయాలలో భాగంగా, ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓటర్ల జాబితాల సవరణలో ఆరోపించబడుతున్న అవకతవకలు, ఎన్నికల నిష్పాక్షికతపై ఉన్న తీవ్ర ఆందోళనల గురించి భారత ప్రధాన

>>2

9-6pg2exHMNWJQE.qxdo/p:9-6pg2exHMNWJQE.qxd 1/1/02 6:57 AM Page 1





సోమవారం సిద్ధాంతం సభలో పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు

# 2027కు భూ రికార్డులు క్లీన్

>> పుస్తకం ఉంటుందని అన్నారు.

**రెవెన్యూ శాఖలో సమూల మార్పులు:** రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని, రీసర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. విక్రయం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ తెచ్చామని తెలిపారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశామని, రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామని స్పష్టం చేశారు. 1బి, అడంగల్, డికెటి, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టామని అన్నారు. 80శాతం ఇకెవైసి పూర్తయిన తర్వాతే గ్రామాలను వెబ్ ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామని అన్నారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కల్పించామన్నారు. రాష్ట్రంలోని 1.37 లక్షల ఎకరాల ఇనామ్ భూములను 22 ఏ నుంచి తప్పించామని తెలిపారు. తిరుపతి జిల్లాలో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామ భూములను పరిష్కరించి వారికి అప్పగించామన్నారు. ఆక్వా రైతులకు అండగా నిలబడామని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో పాటు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఆక్వా ఫీడ్ రేట్లు పెరగడంతో రైతులు ఇబ్బంది పడు తున్నారని రాయితీలు ఇవ్వాలని సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరామన్నారు. పశ్చిమ గోదావరి లాంటి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంపై దృష్టి పెట్టామని సిఎం వివరించారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలు కాలుష్య సమస్యగా మారకుండా న్యూట్రాసూటికల్ ఔషధాల తయారీ చేసుకునే అవకాశం ఉందన్నారు.

**రెండేళ్లుగా సమపాళ్లలో సంక్షేమం అభివృద్ధి**

కూటమి ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్నామని, సంక్షేమం-అభివృద్ధి- సుపరిపాలన అందిస్తున్నామని సిఎం చంద్రబాబు వివరించారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా తిరుపతి, అమరావతి, విశాఖలో మూడు ప్రాంతాల్లో మూడు సభలు నిర్వహిస్తున్నామని సిఎం తెలిపారు. అభివృద్ధిని ట్రాక్‌లో పెట్టామని, పెట్టుబడులు ఉద్యోగాల కల్పన జరుగుతోందని అన్నారు. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం అని వివరించారు. సూపర్ సిక్స్‌లో చెప్పినవాటికంటే అదనంగా ఇస్తున్నామని తెలిపారు. పెన్షన్, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్లు, మత్స్యకారులు ఇలా అందరికీ సంక్షేమం అందిస్తున్నామని చంద్రబాబు వివరించారు.

**గొడ్డలి పార్టీది ఓర్వలేనితనం**

డిఎస్సీ ద్వారా దాదాపుగా 16 వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని, పరీక్షల అంటే తెలీని వ్యక్తులు, రిజర్వేషన్ల గురించి అవగాహన లేని వాళ్లు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని సిఎం చంద్రబాబు ఆరోపించారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని దగా చేశారని.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉద్యోగాలు ఇచ్చి జాబ్ కేలండర్ విడుదల చేశామన్నారు. దీన్ని చూసి ఓర్వలేకే నేరాలు ఘోరాలు చేసి ఎదుటివారిపై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. గొడ్డలి పార్టీ చరిత్ర రాష్ట్రంలో అందరికీ తెలుసని, నేరాలు చేసి ఎదుటి వాళ్లపై నెట్టేస్తుందని ఆక్షేపించారు. చేసిన ప్రతీ ఆరోపణకూ మంత్రులు అధికారులు పూర్తిగా వివరణ ఇవ్వాలని.. దీనికి ఆ వైపు నుంచి సమాధానం లేదని అన్నారు. అసలు రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత ఆ పార్టీకి లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు గొడ్డలి పార్టీ నేతలు క్షమాపణలు కోరాలన్నారు. ప్రజల్ని క్షమాపణ కోరకుండా రాజకీయాలు చేసేందుకు గొడ్డలి పార్టీకి అర్హత లేదన్నారు. ప్రజలకు రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నందుకు తాను సంతోషిస్తున్నానని, కాని వైసిపి నేతలు రాష్ట్రంలో భూ కబ్జాలు చేశారని రికార్డులు తారుమారు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వెళ్లి అక్కడి ఎమ్మార్వో, జెసి సంతకాలు ఫోర్జరీ చేసి రికార్డులు తారుమారు చేశారన్నారు. ఈ నేరంలో రూ.1500 కోట్ల అక్రమాలు జరిగాయన్నారు. ఇంత నేరం జరిగితే గొడ్డలి పార్టీ అధ్యక్షుడు.. వినుకొండ మాజీ ఎమ్మెల్యేను ఎందుకు సస్పెండ్ చేయలేదని సిఎం చంద్రబాబు ప్రశ్నించారు. గొడ్డలి పట్టుకునే చేతులకు నాగలి పట్టే రైతులు గుర్తుకు రారని, కోడి కత్తి డ్రామాలు ఆడేవారికి పరిశోధనలు ఎలా తెలుస్తాయని సిఎం వ్యాఖ్యానించారు. గంజాయి బ్యాచ్‌లను ఓదార్చేవారికి పంటలు సాగు ఎలా తెలుస్తుందని అన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలంటే గొడ్డలి పార్టీ వ్యక్తులను దూరంగా పెట్టాలని సిఎం వ్యాఖ్యానించారు.

**అందరి ఆరోగ్యం కోసం యోగాంధ్ర**

అనంతరం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పై జిల్లా నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందించే వివిధ పౌరసేవలను మెరుగ్గా అందించటంలో కృషి చేస్తున్న అధికారులను అభినందించారు. ఆగస్టు 15 లోగా రాష్ట్రవ్యాప్తంగా సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకు రానున్నట్టు వివరించారు. ప్రివెంటివ్, ప్రెడిక్టివ్, క్యూరేటివ్ విధానాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. జూన్ 21 తేదీన రాష్ట్రంలో కోటి మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. 2047 సంపన్నమైన, ఆనందకరమైన ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేయటమే లక్ష్యమని వివరించారు. అనంతరం సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను సిఎం సందర్శించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఉత్పత్తి అవుతున్న కోకో ద్వారా తయారైన చాక్లెట్లను, కొబ్బరి, పామాయిల్ ఉత్పత్తుల ప్రదర్శనల్ని పరిశీలించారు. వరి ఊక, గడ్డి ద్వారా తయారైన వివిధ ఉత్పత్తులు, గుర్రపు డెక్క ద్వారా తయారైన వస్త్ర ఉత్పత్తులను సిఎం పరిశీలించారు. ఆక్వా వ్యర్థాల ద్వారా తయారైన ఉప ఉత్పత్తులను పరిశీలించి తయారీ దారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

# స్టీల్ ప్లాంట్‌లో ఘోరకలి

>> ఆసుపత్రులకు స్టీల్ ప్లాంట్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదానికి గల కారణాలపై ఉక్కు యాజమాన్యం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సాంకేతిక లోపమా లేక నిర్వహణలో నిర్లక్ష్యమా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద వార్తతో ఉక్కునగరంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

**ప్రధాని సాయం**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదంపై ప్రధాని మోదీ సంతాపం తెలియజేశారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపిన ప్రధాని మోదీ మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు పరిహారాన్ని ప్రకటించారు. అదే విధంగా క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి**

విజయవాడ,జూన్ 8,ప్రభాతవార్తప్రతినిధి: విశాఖ స్టీల్ ప్లాంట్ లో చోటు చేసుకున్న ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. ప్రమాదం గురించి తెలిసిన విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. స్టీల్ ప్లాంట్ లో చేపట్టిన సహాయ చర్యలపై ఆరా తీశారు. ఈ క్రమంలో విశాఖలో ఘటనా స్థలానికి డీసీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం బయలుదేరి వెళ్తున్నారు.

**తీరని విషాదం: మంత్రి లోకేష్**

విశాఖ స్టీల్ ప్లాంటు ప్రమాదంలో కార్మికులు మృతిచెందటం తీరని విషాదమని విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారుజ మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ప్రభుత్వ యంత్రాంగం క్షతగాత్రులకు వైద్యం, ప్రమాద స్థలంలో సహాయకచర్యలను పర్యవేక్షిస్తోందని నారా లోకేష్ తెలిపారు.

**మాజీ సీఎం జగన్ దిగ్భ్రాంతి**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం పట్ల వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై స్పందించిన ఆయన, కార్మికుల మృతికి సంతాపం ప్రకటించారు. కార్మికుల ప్రాణాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**నిర్లక్ష్యమే కారణం: షర్మిల**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతి గురిచేసిందని. ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు.విషాదపు ఘటన గుండెను కలిచివేసింది. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాం. ప్లాంట్‌లో ప్రమాదానికి ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వ నిరక్ష్యమే ప్రధాన కారణం. ఈ ఘటనకు పూర్తి భాద్యత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని మోడీ వహించాలని డిమాండ్ చేశారు.

# సమగ్ర కార్యాచరణ

>> మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని పవన్ అధికారులను అడిగారు. అధికారులు తాము నిర్వర్తించాల్సిన విధులను క్రమం తప్పకుండా చేసి తీరాలి అన్నారు.నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందన్నారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మొత్తం రోజువారీ మురుగు నీరు 104 మిలియన్ లీటర్లు గోదావరిలో కలుస్తుందని నివేదికలు చెబుతున్నాయి.ఆంధ్ర పేపర్స్ పారిశ్రామిక వ్యర్థాలు32 మిలియన్ లీటర్లు కలుస్తున్నాయి.ఆక్వా సాగు వ్యర్థాలు 13.24 మిలియన్ లీటర్లు, గ్రామీణ ప్రాంతాల మురుగు నీరు8.38 మిలియన్ లీటర్లు గోదావరిలో కలుస్తున్నారు.దీనిపై మీరు దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.ఈ విషయంలో అలసత్వం లేదన్న అధికారులపై ఆయన మండిపడుతూ మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వీటిపై చర్యలు తీసుకోవడం మీ కర్తవ్యమని స్పష్టం చేసారు.ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలి అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు సైతం నోటీసులు ఇవ్వాలి అన్నారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.అంతేకాకుండా వెంటనే ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డిప్యూటీ సీఎం పవన్ ఆదేశించారు. పర్యవేక్షణ సరిగా చేయని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు సైతం నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులకు పవన్ స్పష్టమైన సూచనలతో దిశానిర్దేశం చేశారు.రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నదిని కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు గతంలోనూ కీలక ఆదేశాలు జారీ చేశారు.

## రెవెన్యూ శాఖలో సమూల మార్పులు: సిఎం చంద్రబాబు

**పశ్చిమ గోదావరి జిల్లా బ్యూరో, జూన్ 8:** వివాదాలు లేకుండా రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకు వస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతంలో ఏర్పాటు చేసిన మీ భూమి మీ హక్కు గ్రామసభలో ఆయన మాట్లాడుతూ రీసర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామన్నారు. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ తెచ్చామన్నారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశాం. రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామన్నారు. అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులకు రూ.1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే చాలన్నారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటలైజేషన్ ప్రారంభించామన్నారు. 9 (2) నోటీసుల జారీ సమయంలో కూడా ఈకేవైసీ అమలు చేస్తున్నామన్నారు. 80 శాతం ఈకేవైసీ పూర్తయిన తర్వాతనే గ్రామాలను వెబ్‌ల్యాండ్ 2.0లోకి తీసుకుంటున్నామన్నారు.



సోమవారం విశాఖలో ప్రమాద స్థలిని సందర్శించిన ఎంపి భరత్, హోంమంత్రి అనిత తదితరులు

# టిడిపి అభ్యర్థుల నామినేషన్లు

>>సెట్ల నామినేషన్లు సమర్పించారు. ప్రతిపాదకులుగా మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుందరపు విజయ్ కుమార్, బోడే ప్రసాద్‌లు సంతకాలు చేశారు. ఈరోజు ఉదయం వెంకటపాలెం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో టీడీపీ రాజ్యసభ అభ్యర్థులు సాన సతీశ్, భాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ ప్రత్యేక పూజలు చేశారు. వీరికి వెంకటపాలెం టీటీడీ దేవస్థానం పండితులు సాదర స్వాగతం పలికారు. టీడీపీ అభ్యర్థులు ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని వేద పండితులు ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం ఏపీ అసెంబ్లీ వరకు టీడీపీ అభ్యర్థులు సైకిళ్లపై వెళ్లి, ఆపై నామినేషన్ దాఖలు చేశారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎం.అఖిల్ కుమార్, పి.విజయ కుమారి తోపాటు కూటమి నేతలు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) వరుపుల సత్య ప్రభ,బండారు సత్యానంద రావు పాల్గొన్నారు. ఇంకా 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తదతర నేతలు పాల్గొన్నారు.

**ఏకగ్రీవం దిశగా కూటమి రాజ్యసభ సభ్యులు**

ఆంధ్రప్రదేశ్ నుండి ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నికల ప్రక్రియ కీలక ఘట్టానికి చేరుకుంది. శాసనసభలో కూటమికి ఉన్న ఏకపక్ష బలాబలాల దృష్ట్యా, ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కాబోతుండటం దాదాపు ఖరారైంది. కూటమి ఒప్పందంలో భాగంగా టిడిపి మూడు స్థానాల్లో, జనసేన పార్టీ ఒక స్థానంలో తమ అభ్యర్థులను రంగంలోకి దించాయి. టిడిపి తరపున సానా సతీశ్, విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, పార్టీ సోషల్ మీడియా వింగ్ ఇన్‌ఛార్జ్ చింతకాయల విజయ్‌లు సోమవారం తమ నామినేషన్ పత్రాలను అధికారికంగా దాఖలు చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీరికి బిఫారాలను అందజేసి, నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయించారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించారు. పార్టీకి ఆయన అందించిన సేవలు, నిబద్ధతను గుర్తిస్తూ ఈ అవకాశం కల్పించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. లింగమనేని రమేశ్ కూడా అసెంబ్లీలో రిటర్నింగ్ అధికారికి శనివారమే తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ప్రతిపక్ష వైసిపి సంఖ్యాబలం లేకపోవడంతో ఈ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి దించలేదు. దీంతో నామినేషన్ల ఉపసంహారణ గడువు ముగిసిన తర్వాత కూటమికి చెందిన ఈ నలుగురు అభ్యర్థుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అధికారులు అధికారికంగా ప్రకటించనున్నారు.

# ఎన్డీయేపై 'ఇండియా' ఐక్యపోరు

>> న్యాయమూర్తి (సిజెఐ)కి లేఖ రాయాలని ఇండియా కూటమి పార్టీలు నిర్ణయించాయి. త్వరలోనే సిజెఐకి నిరసన లేఖను రాసి అందజేయడంపై పార్టీలు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. ఇండియా కూటమి సమావేశం అనంతరం మీడియా సమావేశంలో ఖర్గే, మమత, అఖిలేష్ తదితరులు వివరాలు వెల్లడించారు. ఇటీవలి నీట్ పేపర్ లీక్‌ల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న వేదన, నిరాశల అంశంపై రెండవ నిర్ణయం తీసుకున్నారు.

ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో విద్యా వ్య వస్థ నిర్వహణలో జరిగిన లోపాలపై పలువురు నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆయన రాజీనామా డిమాండ్ చేయాలని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ హయాంలో నీట్, సిబిఎస్ఇ పరీక్షలకు హాజరైన లక్షలాది మంది యువతకు అన్యాయం జరిగిందని, వారిని గాలికి వదిలే శారని వారు పేర్కొన్నారు. కాబట్టి బాధ్యతా యుత పదవిలో ఉన్నవారిని దీనికి జవాబుదారీని చేయాలని అన్నారు. దేశంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్రస్తుత తీవ్ర ఆర్థిక పరిస్థితి, పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, రైతుల సమస్యలు, ఇతర ప్రజా ప్రయోజన అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఇండియా కూటమి నాయకులు డిమాండ్ చేశారు.

ఈ ఇండియా బ్లాక్ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ, సీనియర్ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా, ఎన్‌సిపి ఎస్‌పి నాయకురాలు సుప్రియా సూలే హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీతో ఉన్న విభేదాల కారణంగా ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) సహా పలు ప్రతిపక్ష పార్టీలు ఈ సమావేశానికి దూరంగా ఉన్నాయి.

# బ్రిడ్జిని ఢీకొని ప్రైవేట్ బస్సు బోల్తా

>> ఆదివారం రాత్రి ఏంసూరు మండలం కందుకూరు గ్రామానికి చెందిన కె.వి.ఆర్ ట్రావెల్ బస్సులోని ఏలూరు జిల్లా ధర్మాజీ గూడెం, చింతలపూడి, ముసునూరు, తదితర గ్రామాల నుంచి హైదరాబాద్ వెళ్లడానికి బస్సులో ఎక్కారు. బస్సు బయలుదేరిన అర్ధగంటలోనే సత్తుపల్లి సమీప కొత్తలంక పల్లి రైల్వే బ్రిడ్జికి రాగానే రైల్వే బ్రిడ్జిని ఢీకొని బోల్తా కొట్టడంతో బస్సు ముందు భాగం పూర్తిగా నుజ్జయింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమవగా, ముందు చక్రాలు కూడా ఊడిపోయాయి.సమాచారం అందుకున్న వి.ఎం. బంజర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో బస్సులోఉన్న ప్రయాణికులను బయటికి తీసి సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌ల ద్వారా సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 36 మంది ప్రయాణికులు ఉండగా, మిగతా వారు సురక్షితంగా బయటపడటం ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.అయితే బస్సు డ్రైవర్ మద్యం మత్తులో అతి వేగంతో ముందు వెళ్తున్నా వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ బస్సు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బస్సులోని ప్రయాణికులు తెలిపారు. గాయాలైన వారు శ్రావణ శశి, మల్లిక, బాలాజీ, గణేష్, రామకృష్ణ, శిరీష, ప్రణీత, నరసింహా, స్వప్న, సీతరత్నం, సుస్మిత, తదితరులు చింతలపూడి ధర్మాజీగూడెం ముసునూరు తదితర గ్రామాల నుంచిబస్సులో హైదరాబాద్ బయలుదేరిన ప్రయాణికులు. బస్సు ప్రమాదంపై సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తు లింగం, విఎం బంజర్ ఎస్సై వెంకటేష్, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎపి బస్సుకు బీహార్‌లో ఘోర ప్రమాదం

>> నుంచి కాశీ యాత్రకు బయలుదేరిన ప్రైవేటు బస్సు బీహార్‌లో ప్రమాదానికి గురైంది. ఎదురుగా వచ్చిన లారీ బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సంగం ప్రాంతానికి చెందిన ఇద్దరు, ఆత్మకూరుకు చెందిన ఒక మహిళ మృతి చెందినట్లు సమాచారం. మరో 15 మంది యాత్రికులు గాయపడగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఘటనపై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితులకు అత్యవసర వైద్యసాయం అందించాలని అధికారులను ఆదేశించారు.

అవసరమైతే ప్రత్యేక సహాయక బృందాలను ఏర్పాటుచేసి సమ న్వయం చేయాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సంగం, దుత్తలూరు, ఆత్మకూరుకు చెందిన యాత్రికులతో బస్సు జూన్ 1వ తేది కాశీయాత్రకు బయలుదేరింది. గయా,వారణాసి పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలుదేరిన ఈ యాత్ర బస్సు బీహార్ రాష్ట్రం గయావద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న లారీ అతి వేగంతో బచ్చి బస్సును ఢీకొనగా సంగంకి చెందిన ఇద్దరు వ్యక్తు లు అక్కడిక్కడే మృతిచెందారు. విషయం తెలిసిన వెంటనే దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న దృశ్యం

**ప్రత్యేక విమానంలో మృతదేహాలు :** మృతదేహాలను రోడ్డు మార్గన తీసుకొని రావాలంటే 38 గంటలు పైగా సమయం పడుతుందని మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుండి రేణిగుంట విమానాశ్రయానికి తీసుకొని వస్తున్నట్లు మంత్రి ఆనం వెల్లడించారు. ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

## వారం - వర్జ్యం

09-06-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
నవమి రా.2.32,
పూర్వాభాద్ర ఉ.9.36
వర్జ్యం : రా.7.05-రా.8.39
దు.ఉ.8.10-ఉ.9.02,
(2) రా.11.53-రా.12.45
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వివాహయత్నాలు జరుగుతాయి.

**వృషభం:** అప్రయత్నంగా కార్యసిద్ధి. పలుకుబడి హోదాలో ఉన్న వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. బంధువుల కలయిక.

**మిథునం:** సన్నిహితుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. తండ్రి నుండి ఆస్తి లాభం పొందుతారు. వాహనసౌఖ్యం.

**కర్కాటకం:** నూతన పెట్టుబడులకు అనుకూల కాలం. బంధువులకు కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** ఉద్యోగాలలో ప్రోత్సాహకరంగా ఉంటుంది. పారిశ్రామిక రంగాలలోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**కన్య :** పదే పదే మీ సహాయాన్ని అర్థించే కొందరినీ దూరంగా ఉంచుతారు. క్రీడల యందు ఆసక్తి చూపుతారు. వస్త్రలాభం.

**తుల :** శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. ఆరోగ్య విషయంలో మెలకువ అవసరం. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.

**వృశ్చికం:** ఎన్ని సమస్యలు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగి అనుకున్న కార్యాన్ని విజయవంతంగా పూర్తి చేస్తారు.

**ధనుస్సు:** నూతన తరహా ఆలోచనలు చేసి ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తారు. ఇంటా బయటా మీదేపై చేయిగా వుంటుంది.

**మకరం:** సాంకేతిక విద్యావకాశాలు లాభిస్తాయి. రెండు, మూడు విధాలుగా ధనలాభం పొందుతారు. వస్త్రలాభం.

**కుంభం:** కీలక విషయాలలో స్వంత ఆలోచనలు తీసుకుంటారు. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. వాహనసౌఖ్యం.

**మీనం:** శత్రువులు సైతం మిత్రులుగా మారుతారు. పెద్దల నుండి సాయం అందుకుంటారు. శుభవార్తలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పారదర్శక పాలనే లక్ష్యం


## సాంకేతిక సంస్కరణలతో ఆదర్శంగా పౌరసరఫరాలశాఖ: మంత్రి నాదెండ్ల

**విజయవాడ,జూన్8,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రైతు సంక్షేమాన్ని కేంద్ర బిందువుగా తీసుకుని, పారదర్శకత, సాంకేతికత, వేగవంతమైన సేవల సమన్వయంతో వ్యవహరిస్తుందని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.తద్వారా సివిల్ సప్లైస్ శాఖ గత రెండు సంవత్సరాల్లో చారిత్రాత్మక సంస్కరణలను అమలు చేసి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందన్నారు. రైతు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, ధాన్యం కొనుగోళ్లలో సంపూర్ణ పారదర్శకత, తక్షణ చెల్లింపులు, మధ్యవర్తుల నిర్మూలన, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన ఆశయంగా పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో, ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు, రైతు సహాయక కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ మరియు అనుబంధ శాఖల సమన్వయంతో ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

**రైతుకు ప్రథమ ప్రాధాన్యత:** రైతు కష్టపడి పండించిన ప్రతి గింజకు గౌరవం దక్కేలా, ధాన్యం విక్రయంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందన్నారు. రైతు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా తీసుకుని, పారదర్శకత, వేగవంతమైన చెల్లింపులు, సాంకేతిక ఆధారిత సేవలతో దేశంలోనే ఆదర్శవంతమైన ధాన్యం కొనుగోలు విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 17.97 లక్షల మంది రైతుల నుండి 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో సుమారు రూ.30,361 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లు నిర్వహించి, రైతులకు సకాలంలో చెల్లింపులు చేయడం జరిగిందన్నారు.రైతులకు చెల్లింపుల విషయంలో అత్యంత వేగవంతమైన విధానాన్ని అమలు చేస్తూ, 90 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేయగా, మిగిలిన చెల్లింపులు కూడా 48 గంటలు దాటకుండా పూర్తిచేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎక్కడా ఇబ్బందులు పడకుండా, చెల్లింపుల్లో జాప్యం లేకుండా, పూర్తి పారదర్శకతతో ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు...

**సాంకేతిక సంస్కరణలు - దేశంలోనే తొలిసారి వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయం**

..రైతులకు మరింత సులభమైన, పారదర్శకమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ దేశంలోనే



తొలిసారిగా వాట్సాప్ ఆధారిత ధాన్యం నమోదు మరియు విక్రయ విధానాన్ని అమలు చేసినట్లు తెలిపారు. ఈ వినూత్న వ్యవస్థ ద్వారా రైతులు ఎటువంటి మధ్యవర్తుల అవసరం లేకుండా నేరుగా తమ ధాన్యాన్ని నమోదు చేసి విక్రయించే అవకాశం పొందుతున్నారన్నారు. ఇప్పటికే 40 వేల మందికి పైగా రైతులు ఈ విధానాన్ని వినియోగించుకుని సుమారు 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నేరుగా సివిల్ సప్లైస్ కార్పొరేషన్‌కు విక్రయించినట్లు ఆయన తెలిపారు. ఈ సంస్కరణ ద్వారా మధ్యవర్తుల జోక్యం గణనీయంగా తగ్గడమే కాకుండా, రైతులకు పారదర్శక వ్యవస్థలో నేరుగా లాభం చేకూరిందని ఆయన పేర్కొన్నారు.

**వర్షాలు - తుఫానుల సమయంలో రైతులకు రక్షణ:** వర్షాకాలంలో ధాన్యం తడవకుండా కాపాడేందుకు దేశంలోనే తొలిసారిగా చిన్న, సన్నకారు రైతులకు రూ.50 కోట్లు విలువైన టార్పాలిన్లు ఉచిత పంపిణీ చేసినట్లు మంత్రి తెలిపారు. తుఫానులకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి రైతు సహాయక కేంద్రాల ద్వారా ఈ సేవలు అందించామని పేర్కొన్నారు.

**దీపం-2" పథకం - కోట్లాది కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల లబ్ధి:** "దీపం-2" పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైన కుటుంబాలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలోని 1.08 కోట్ల గ్యాస్ కనెక్షన్లను లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ద్వారా కుటుంబాలపై గ్యాస్ వ్యయభారం తగ్గించి, సాధారణ ప్రజలకు ఆర్థిక ఊరటనందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటివరకు పలు విడతల్లో భారీ స్థాయిలో సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మొదటి విడతలో 97.36 లక్షల సిలిండర్లకు రూ.764 కోట్ల సబ్సిడీ, రెండో విడతలో 93.83 లక్షల సిలిండర్లకు రూ.777కోట్లు, మూడో విడతలో 94.81 లక్షల సిలిండర్లకు రూ.791 కోట్లు, నాలుగో విడతలో 92.28 లక్షల సిలిండర్లకు రూ.760 కోట్ల రాయితీ నేరుగా ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

9-6Pg3exHMNWJQETVRS.qxd:9-6Pg3exHMNWJQETVRS.qxd 1/1/02 7:01 AM Page 1



# హెచ్‌పివి టీకా పంపిణీ గడువు మరో 3నెలలు పొడిగింపు

**విద్యాసంస్థల పున:ప్రారంభం దృష్ట్యా పెంచినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడి**

**సచివాలయం, జూన్ 8 ప్రభాతవార్త:** గర్భాశయ ముఖద్వారం (సర్వైకల్ క్యాన్సర్ కేసుల నిరోధానికి చేపట్టిన హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పివి) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మూడు నెలలపాటు (ఆగస్టు వరకు) పొడిగించినట్లు రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 2,71,071మంది బాలికల (78.57శాతం) కు హెచ్‌పివి టీకాలు వేసినట్లు వెల్లడించారు. 14ఏళ్ల (14వ పుట్టినరోజు పూర్తిచేసుకొని 15వ పుట్టినరోజు లోనికి ఇంకా అడుగుపెట్టని) బాలికలకు కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి హెచ్‌పివి టీకా వేస్తున్నామని తెలిపారు. ఈ కేటగిరిలో రాష్ట్రంలో 3.45లక్షల మంది బాలికలు ఉండగా సోమవారం నాటికి 78.57శాతం మందికి టీకా వేసినట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు విడతలుగా కలపి రాష్ట్రానికి 3,81,780డోసుల వ్యాక్సిన్ వచ్చిందని తెలిపారు. త్వరలోనే విద్యాసంస్థలు పున: ప్రారంభం కానున్నందున మిగిలిన బాలికలకు త్వరగా టీకా పంపిణీ పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు మంత్రి ఆదేశించారు. టీకా వేయించుకునేందుకు సందిగ్ధంలో ఉన్న వారికి అవగాహన కల్పించాలని స్పష్టంచేశారు. తక్కువగా టీకాల నమోదు ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.



# జోజిలా టన్నెల్ రెడీ

- నేడు కేంద్రమంత్రి గడ్కరీ చేతుల మీదుగా బ్రేక్ త్రూ కార్యక్రమం
- ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న టన్నెల్ ఇదే
- అత్యంత పొడవైన సింగిల్‌ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగం

## జోజిలా రోడ్ టన్నెల్ ప్రాజెక్ట్



**అనంతపురం, జూన్ 8 ప్రభాతవార్త బ్యూరో:** దేశ సరిహద్దుల్లో అత్యంత ప్రతిష్టాత్మక జమ్మూ కాశ్మీర్-లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలను నిత్యం అనుసంధానించే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జోజిలా టన్నెల్ ప్రాజెక్ట్ మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించిన నేపథ్యంలో నేడు (మంగళవారం) కేంద్ర రవాణా శాఖ మంత్రి లాంచనంగా ప్రారంభించనున్నారు. 13.153 కిలోమీటర్ల పొడవైన జోజిలా టన్నెల్, ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో నిర్మితమవుతున్న అత్యంత పొడవైన సింగిల్‌ట్యూబ్ ద్విముఖ రహదారి సొరంగంగా గుర్తింపు పొందింది. జమ్ముకాశ్మీర్‌లో సోనమార్గ్ సమీపంలోని బాల్తాల్ పశ్చిమ పోర్టల్ నుంచి ద్రాస్ కార్గిల్ ప్రాంతంలోని సోనామార్గ్ తూర్పు పోర్టల్ వరకు విస్తరించిన జోజిలా టన్నెల్ ప్రాజెక్టు, భారీ మంచు, హిమపాతాలు, తీవ్ర వాతావరణ పరిస్థితుల కారణంగా సంవత్సరంలో సగం కాలం మూసి ఉంచే జోజిలా పాస్‌కు శాశ్వత పరిష్కారం చూపుతుంది. సముద్ర మట్టానికి సుమారు 11,578 అడుగుల ఎత్తులో నిర్మితమవుతున్న ఈ టన్నెల్, భారతదేశ పర్వత ప్రాంత మౌలిక సదుపాయాల అభివృద్ధిలో అత్యంత కీలకమైన మైలురాయిగా నిలుస్తుంది. పశ్చిమ హిమాలయాల్లోని అత్యంత క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, హిమపాతాల ముప్పు, తీవ్రమైన శీతాకాలం వంటి ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతున్న జోజిలా టన్నెల్ తుది బ్రేక్‌త్రూ వల్ల భారతదేశం అత్యంత క్లిష్టమైన పర్వత ప్రాంత రవాణా మౌలిక సదుపాయాల నిర్మాణంలో సాధించిన అసాధారణ విజయానికి నిదర్శనం. జోజిలా టన్నెల్ పూర్తి ఐన తరువాత కాశ్మీర్-లడఖ్ మధ్య అన్ని కాలాల్లో నిరంతర అనుసంధానం కల్పించడంతో పాటు, ప్రాంతీయ అభివృద్ధి, ఆర్థిక సమగ్రత, జాతీయ భద్రతా సామర్థ్యాలను మరింత బలోపేతం చేయనుంది.

**ప్రాజెక్టు విశేషాలు**

జోజిలా ప్రాజెక్ట్ మొత్తం పొడవు రోడ్లు, వంతెనలతో కలిపి 30.894 కి.మీ.

ఇందులో జోజిలా ప్రధాన టన్నెల్ పొడవు 13.153 కి.మీ.

నిల్‌గ్రార్ టన్నెల్ టి1 పొడవు 457.35 మీటర్లు.

నిల్‌గ్రార్ టన్నెల్ టి2 పొడవు 1,953.63 మీటర్లు (సుమారు రెండు కిలోమీటర్లు).



ఎన్‌డియే బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే పులివర్తి నాని

# నేడు తిరుపతిలో ఎన్‌డియే సభ

- హాజరుకానున్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

**తిరుపతి, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ళు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలుతీరు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించామని విస్తృతంగా ప్రచారం చేసుకోవడానికి తిరుపతిలో మంగళవారం ఎన్‌డియే పార్టీల నేతలు బహిరంగ సభ జరగనుంది. తిరుపతి రూరల్ తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారి పక్కన ఈ సభకు అవసరమైన అన్ని ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం పూర్తిచేసింది.
సోమవారం రాత్రి వరకు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోవిందరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఇతర జిల్లా యంత్రాంగం స్వయంగా ఏర్పాట్లు పర్యవేక్షించి పూర్తిచేశారు. సుమారు లక్షమందికి పైగా పాల్గొనే ఈ సభలో జనానికి సిఎం చంద్రబాబు నాయుడు, డిసిఎం పవన్‌కల్యాణ్, బిజెపి చీఫ్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, సవిత పాల్గొంటున్నారు.
పూర్తిఏర్పాట్లులో అధికారులు తలమునకలయ్యారు. మంగళవారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా దామినేడు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు విచ్చేసే ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించారు. పర్యటన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అత్యవసర సదుపాయాలు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ముఖ్యమంత్రి మంగళవారం ఉదయం 10.40 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుండి రోడ్డుమార్గంలో దామినేడు సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్ డి ఏ బహిరంగ సభలో పాల్గొంటారు. కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం 2 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్‌లో ఉండవల్లి చేరుకుంటారు.

# 12న పాఠశాలలు పున:ప్రారంభం

- ఎలాంటి మార్పు లేదని ప్రభుత్వం స్పష్టీకరణ


**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు పొడిగింపు అంశంపై ప్రభుత్వం స్పష్టతను ఇచ్చింది, రాష్ట్రంలో పాఠశాలల పునఃప్రారంభం తేదిల్లో మార్పులేదని తెల్చిచెప్పింది. వేసవి సెలవులను పొడిగించే ప్రతిపాదన ఏపీ లేదని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ముందగా ప్రకటించినట్లే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈ నెల 12వ తేదీన పునఃప్రారంభం కానున్నట్లు స్పష్టం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మకూడదని కీలక సూచనలు చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణలో స్కూళ్ల రీఓపెనింగ్‌ను ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశారు. ఈ నెల 13న రెండో శనివారం, 14న ఆదివారం కావడంతో వేసవి సెలవులను పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే 12న హాలిడే ఇచ్చినందకు, మరో కిటుకు పెట్టింది సర్కార్. విద్యా సంవత్సరం నష్టపోకుండా జులై 11వ తేదీన రెండో శనివారం తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపింది.

# పెళ్లికి ముందు లైంగిక సంబంధం నేరం కాదు

- కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన గాజుల తిరుపతి కేసులో సుప్రీం తీర్పు
- ఉద్యోగంలోకి తీసుకోవాలని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశం

**హైదరాబాద్, జూన్ 8 ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి:** మేజర్ల విషయంలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పెళ్లి కాని ఇద్దరు వయోజనులు పరస్పర అంగీకారంతో శారీరక సంబంధాన్ని కలిగి ఉండడాన్ని చెడు ప్రవర్తనగా భావించకూడదని స్పష్టం చేసింది. ప్రేమ విషయంలో నమోదైన ఒక క్రిమినల్ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అలాగే కేసులో తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. నియామక ప్రక్రియలో పరిగణించి ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించింది. కేసు వివరాల ప్రకారం, పిటిషన్ దారుడు (తెలంగాణలో గాజుల తిరుపతి అనే వ్యక్తి ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. బోర్డు పోస్టింగ్ ఇవ్వలేదు) తన పొరుగింటి యువతితో కొన్నేళ్ల పాటు ప్రేమ సంబంధం కొనసాగించాడు. ఇద్దరి మధ్య ఉన్న ఆ సంబంధం తర్వాత వివాహ సంబంధంగా మారలేదు. దీంతో 2014లో వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి మోసం చేశాడంటూ అతడిపై కేసు నమోదైంది.
అయితే తర్వాత ఇరువురు పరస్పర అంగీకారంతో రాజీకి వచ్చారు. 2015లో లోక్ అదాలత్‌లో ఆ వివాదం పరిష్కారమైంది. కేసును కొనసాగించేందుకు యువతి ఆసక్తి చూపలేదు. దీంతో వ్యవహారం అక్కడితో ముగిసింది. అయినప్పటికీ, ఆ కేసు నేపథ్యంలో అతడిపై నైతిక అపరాధం (మోరల్ టర్పిట్యూడ్) ముద్ర పడిందని భావించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు నియామకాన్ని రద్దు చేసింది. దీనిని సవాలు చేస్తూ అభ్యర్థి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి అతడి వాదనను సమర్థిస్తూ నియామకాన్ని మరోసారి పరిశీలించాలని ఆదేశించారు. ఆ తీర్పును సవాలు చేస్తూ అధికారులు అప్పీల్‌కు వెళ్లగా, చివరకు సుప్రీంకోర్టు కూడా అభ్యర్థికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.
ప్రతి ప్రేమ సంబంధం వివాహంతోనే ముగియాలనే నియమం లేదని పేర్కొంది. కేవలం వివాహం జరగలేదనే కారణంతో ఒక వ్యక్తి మరొకరిని మోసం చేశాడని తేల్చేయడం సరికాదని స్పష్టం చేసింది. సంబంధం విఫలమైందంటే అది తప్పనిసరిగా మోసమే అని భావించలేమని పేర్కొంది. అదేవిధంగా, సంబంధంలో బెదిరింపులు లేదా ఒత్తిడి ఉన్నట్లు ఆధారాలు ఉంటే నియామక సంస్థలు అభ్యర్థి అర్హతపై సందేహాలు వ్యక్తం చేయవచ్చని ధర్మాసనం తెలిపింది. అయితే ప్రస్తుత కేసులో అలాంటి పరిస్థితులు ఏవీ కనిపించలేదని పేర్కొంది. యువతితో బలవంతంగా రాజీ ఒప్పందం చేసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ఇద్దరి మధ్య సంబంధం ఏర్పడిన సమయంలో వివాహం చేసుకునే నిజమైన ఉద్దేశం ఉందా?, లేదా? అనే అంశాన్ని ఆయా కేసుల వారీగా పరిశీలించాల్సి ఉంటుందని న్యాయస్థానం సూచించింది. ఇద్దరి పరస్పర సమ్మతితో ఏర్పడిన సంబంధాలు, మోసపూరితంగా వివాహ వాగ్దానం చేసి ఏర్పడిన సంబంధాల మధ్య స్పష్టమైన తేడాను గుర్తించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం తెలిపింది. కేవలం సంబంధం వివాహానికి దారితీయలేదనే కారణంతో ఒకరిపై మరొకరు మోసపూరిత ఆరోపణలు చేయడం సరైన విధానం కాదని కోర్టు అభిప్రాయపడింది.
ఈ తీర్పు వ్యక్తిగత స్వేచ్ఛ, పరస్పర అంగీకారం, ఆధునిక సామాజిక సంబంధాలపై న్యాయవ్యవస్థ దృక్పథాన్ని ప్రతిబింబిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## తిరుమల సమాచారం



### సింహవాహనంపై వేణుగోపాలస్వామి

**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా కార్వేటినగరంలోని రుక్మిణి- సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో సోమవారం ఉదయం స్వామివారు యోగనారాయణుడి అలంకారంలో సింహవాహనంపై భక్తులకు దివ్యదర్శనమిచ్చి అనుగ్రహించారు. యోగశాస్త్రంలో సింహం వాహనశక్తికి, ధైర్యానికి, శీఘ్రగమనానికి ప్రతీకగా భావిస్తారు. భక్తుడు సింహబలం వంటి అచంచలమైన భక్తిశ్రద్ధలను కలిగి ఉన్నప్పుడే భగవంతుని అనుగ్రహానికి పాత్రుడవుతాడని ఆధ్యాత్మిక గ్రంథాలు పేర్కొంటున్నాయి. ఈ వాహనసేవలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొని స్వామివారి దివ్య మంగళరూపాన్ని దర్శించి పరవశించారు.



### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భూరం తిరుమల దీక్షిత్ సోమవారం హైదరాబాద్‌లో టిటిడి చైర్మన్ బిఆర్‌నాయుడును కలసి రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో దాత తండ్రి విశ్రాంత ఇంజినీర్ బి.జగదీశ్వర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లో తనిఖీల డొల్లతనం

- వెంటనే గమనించి పట్టుకున్న భద్రత సిబ్బంది



**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకొండపై చీమచిటుక్కుమన్నా వెంటనే కనిపెట్టి పట్టుకునే అత్యాధునిక ఎఐ వ్యవస్థతోబాటు ఆధునిక నిఘా నేత్రాలు పనిచేస్తున్నా ఓ భక్తుడు ఏకంగా తన సెల్‌ఫోన్‌ను తీసుకుని ఏకంగా వైకుంఠమ్ క్యూలైన్లలోని తనిఖీ వరకు వచ్చేవాడు. అంతేగాక ఆ భక్తుడు తనచేతిలోని సెల్‌ఫోన్‌తో వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, పరిసరాలు పూర్తిగా చిత్రీకరించాడు. ఆ దృశ్యాలను వెంటనే తనవారికి పంపి సామాజిక మాధ్యమంలో హల్‌చేల్ చేయించాడు. ఇదీ కాస్త సోమవారం ఉదయం దుమారం రేగడంతో వెంటనే అప్రమత్తమైన టిటిడి భద్రత సిబ్బంది జరిగిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి వివరణ ఇచ్చుకొనే ధోరణి వచ్చింది. అయితే తిరుమలలో భద్రత వ్యవస్థ పటిష్టంగా ఉందని, అప్రమత్తంగానే వ్యవహరిస్తోందని టిటిడి పిఆర్‌ఒ విభాగం సవివరాణాత్మక ప్రకటన ఇవ్వడం మరీ విశేషం. సామాన్యభక్తుడు ఏకంగా సెల్‌ఫోన్‌తో వైకుంఠమ్‌లోకి రావడం చిన్నవిషయం కాదు. ఆపై కంపార్టుమెంట్‌లలో పరిస్థితి చిత్రీకరించడం మరీ కలవరం. ఈ నేపథ్యంలో తిరుమలలో భక్తుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ టిటిడి పటిష్టమైన మూడంచెల భద్రతా వ్యవస్థను నిరంతరాయంగా అమలు చేస్తోందని వివరణ ఇవ్వడం కొసమెరుపు. ప్రతి షిఫ్టులో వందలాది మంది భద్రతా సిబ్బంది చెకింగ్, స్కానింగ్ విధుల్లో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు. ఏదైనా కారణాల వల్ల ఒక భద్రతా అంచె వద్ద గుర్తించబడని మొబైల్ ఫోన్ వంటి నిషేధిత వస్తువులు తదుపరి అంచెలలో గుర్తించి, నిర్దేశిత డిపాజిట్ విధానాన్ని అమలు చేయడం జరుగుతోంది. విధుల్లో నిరక్ష్యం వహించిన సిబ్బందిని గుర్తించి, వారిపై అవసరమైన శాఖాపరమైన చర్యలు కూడా తీసుకుంటున్నారు. సోమవారం సోషల్ మీడియాలో ఒక భక్తుడు సెల్‌ఫోన్‌తో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించి, అక్కడి కంపార్ట్‌మెంట్ల దృశ్యాలను చిత్రీకరించి పోస్ట్ చేసినట్లు టిటిడి దృష్టికి వచ్చింది. అయితే, వాస్తవానికి సదరు భక్తుడు ఆదివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌కు మొబైల్ ఫోన్‌తో వచ్చినప్పటికీ, వివిధ దశల్లో నిర్వహించిన భద్రతా తనిఖీల్లో భాగంగా డౌన్ స్కానింగ్ పాయింట్ వద్ద అతడిని గుర్తించి, భద్రతా సిబ్బంది మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన తిరుమలలో అమలవుతున్న మూడంచెల భద్రతా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోందనడానికి నిదర్శనం. తిరుమలలో భద్రత విభాగం పూర్తిగా ప్రోటోకాల్ విధులకు, తమ దర్శనాలకు, తమ వారికి దర్శనాలకే పరిమితమైపోయిందనడానికి ఇదో నిదర్శనం,

# తిరుమలలో నీటి పొదుపు మంత్రం!

- గోగర్భమ్ డ్యామ్ నుండి ప్రధాన ఫిల్టర్ హౌస్ వరకు అదనపు పైప్‌లైన్

**తిరుమల, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రోజురోజుకూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న లక్షమంది భక్తులతో కొండపై నీటి వినియోగం కూడా పెరిగింది. రోజుకు సరాసరి 50లక్షల గ్యాలన్ల నీరు అవసరమవుతోంది. ఇందులో తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భమ్ డ్యామ్, పాపవినాశనం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార తీర్థాల ప్రాజెక్టుల నుండి రోజుకు 25లక్షల గ్యాలన్ల వరకు నీరు వినియోగిస్తున్నారు. మిగిలిన మరో 25-30 లక్షల గ్యాలన్ల నీరు చంద్రగిరి సమీపంలోని కళ్యాణిడ్యామ్ నుండి తిరుమలకు పంపింగ్ చేసుకుంటున్నారు. దీనివల్ల టిటిడికి భారం కూడా పెరిగింది. అయితే కల్యాణిడ్యామ్ నుండి నీటి పంపింగ్‌ను తగ్గించుకునే దిశగా టిటిడి అడుగులేస్తోంది. దీనివల్ల అదనపు భారం కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. ఇందుకోసం తిరుమలలోనే ఐదు ప్రధాన జలాశయాల నుండి రోజుకు అవసరమైన 50లక్షల గ్యాలన్ల నీటిని సాఫీగా సరఫరా చేసుకునేందుకు గోగర్భమ్ డ్యామ్ నుండి తిరుమలలోని ప్రధాన ఫిల్టర్ హౌస్ వరకు నీరు వృధాకాకుండా పూర్తిస్థాయిలో అదనపు పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే గత టిటిడి బోర్డు సమావేశంలోనే సుమారు ఆరుకోట్ల రూపాయల అంచనాతో పనులు చేపట్టేందుకు ఆమోదించారు. ఈ పనుల కోసం త్వరలోనే ఇ టెండర్లను పిలిచి పనులు ప్రారంభించేందుకు టిటిడి ఇఇ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఇ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి







కార్యాచరణ సిద్ధం చేశారు.
తిరుమలలో తాగునీటి జలాశయాలైన గోగర్భం డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,894 అడుగులు, పాపవినాశనం 697.14 అడుగులు, ఆకాశగంగ జలాశయం 685లక్షల గ్యాలన్లు నీటి సామర్థ్యం. రెండు ప్రధాన పెద్దజలాశయాలు కుమారధార, పసుపుధార తీర్థాలు. ఈ రెండు జలాశయాల్లో పసుపుధార 2,833లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం, కుమారధారతీర్థం 4,258లక్షల గ్యాలన్లు నీటిసామర్థ్యం కలిగి ఉన్నాయి. వీటిల్లోని నీటిని పొదుపుగా వాడుకునేందుకు టిటిడి చర్యలు ఉపక్రమించింది. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదువతుండటంతో నీటిని మరింత పొదుపుగా వాడుకోవాలని యోచిస్తున్నారు. 2025 అక్టోబర్‌లో తుఫాన్ ప్రభావంతో భారీ వరదలు వచ్చాయి. అప్పట్లో కొండపై ఐదు జలాశయాలు నీటితో నిండుకున్నాయి. ఆ తరువాత మళ్ళీ అడపాదడపా వర్షాలు కురిసినా నీరు మాత్రం చేరలేదు, దీంతో ఇప్పుడు పాపవినాశనం, గోగర్భమ్ డ్యామ్ నుండి దిగువకు విడుదలవుతున్న మిగులు నీటిని పంపింగ్ చేసుకునేందుకు అవసరమైన అదనపు పైప్‌లైన్ ఏర్పాటుపై ఆలోచన చేశారు. అదనపు పైప్‌లైన్ ఏర్పాటుతో నీటిని మరింత పొదుపుగా వాడుకోవచ్చని అధికారుల ఆలోచన. 500 ఎంఎం డయాపైప్‌లైన్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. అదనపు పైప్‌లైన్ నిర్మాణం జరిగితే వర్షాకాలంలో నీరు వృధాపోకుండా నీటిని పొదుపు చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది. తిరుమలలోని జలాశయాల్లో 14,304 లక్షల గ్యాలన్లు నీటి సామర్థ్యం కాగా ప్రస్తుతం నాలుగు వేల లక్షల గ్యాలన్ల నీరు పైగా మాత్రమే అందుబాటులో ఉంది. ఈ నీరు కేవలం 90 రోజులు మాత్రమే అవసరాలకు సరిపోతుందనేది టిటిడి వర్గాల సమాచారం. వరుణదేవుడు దయతో సకాలంలో ఏదో ఒకరూపంలో నైరుతి రుతుపవనాలు, అల్పపీడనాలతో వర్షాలు కురవకపోతే తాగునీటికి ప్రత్యామ్నాయ పరిస్థితులపై ఆలోచన చేస్తున్నారు.

## వివేకా హత్య కేసుపై సిబిఐ కోర్టులో విచారణ

**హైదరాబాద్ జూన్ 8, ప్రభాతవార్త:** మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి సోమవారం నాడు హైదరాబాద్ సిబిఐ కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసును మరింత సమగ్రంగా విచారించాలని వివేకానంద రెడ్డి తనయ డాక్టర్ సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటి షన్‌పై కోర్టు ఈ విచారణ చేబట్టింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని నిందితుల తరపు న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేశారు. వివేకానం ద రెడ్డి హత్య కేసు విచారణ ఇప్పటికే పూర్తయ్యిందని, మరోసారి దర్యాప్తు అవసరం లేదని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపా రు. అయితే దీనిపై సునీతారెడ్డి తరపు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. తమ అభ్యంత రాలను పరిగణలోకి తీపుకోలేదని, ఛార్జిషీట్‌లోని అనేక అంశాలపై మరింతగా విచారణ చేయాలని వారు కోర్టును కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న సిబిఐ కోర్టు దీనిపై తదుపరి విచారణను ఈ నెల 16వ తేదీకి వాయిదా వేసింది.

# జులైలో భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం

**కేంద్రమంత్రి పీయూష్‌గోయల్**



**న్యూఢిల్లీ, జూన్ 8:** ప్రతినిధి బృందాల చర్చల్లోనే నలుగు తున్న భారత్ అమెరికా ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుంది. వచ్చే జులైలో ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి విడత ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సోమవారం ప్రకటించారు. ఇటీవలి కాలంలో పన్నుల విషయంలో ఇరు దేశాల మధ్య స్వల్ప వివాదం తలెత్తినప్పటికీ చర్చలు మాత్రం వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకుంటూ.. పరస్పర మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంపొందించు కోవడమే ఈ ద్వైపాక్షిక ఒప్పందం ముఖ్య ఉద్దేశమని గోయల్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్‌లో భారీ ప్రయోజనం చేకూరనుంది. గత కొన్ని వారాలుగా ఇరు దేశాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు ఊపందుకు న్నాయని, అందరూ ఊహించిన దానికంటే ముందే ఒక మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు జూన్ 5న ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో అమెరికా వాణిజ్య విభాగానికి చెందిన పూర్తి స్థాయి బృందం పాల్గొందని గోయల్ గుర్తుచేశారు. ఆ భేటీలోనే ఒప్పందానికి అడ్డంకిగా ఉన్న చాలా అంశాలపై ఒక స్పష్టత వచ్చిందన్నారు. జులై మధ్య నాటికి ఇరు దేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా మొదటి విడత ఒప్పందాన్ని అమలు చేసే స్థితికి చేరుకుంటామన్నారు. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాల మధ్య ఒక ప్రాథమిక అవగాహన కుదిరింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన కొన్ని పన్నుల నిర్ణయాలపై చట్టపరమైన సవాళ్లు ఎదురుకావడంతో చర్చలు కాస్త నెమ్మదించాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 12.5 శాతం పన్ను విధించాలని అమెరికా గత వారమే ఓ ప్రతిపాదన తెచ్చింది. నిర్బంధ శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో భారత్ తగిన చర్యలు తీసుకోలేదనే నెపంతో ఈ ప్రతిపాదన చేశారు. అయినప్పటికీ, వాణిజ్య బంధాన్ని దెబ్బతీసుకోవద్దనే ఉద్దేశంతో ఇరు దేశాలు చర్చలను నిరంతరం కొనసాగిస్తున్నాయి. అమెరికా ప్రస్తుతం భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి దేశాలు ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ ఒప్పందం భారత్‌కు ఎంతో కీలకం కానుంది. మంత్రి పీయూష్ గోయల్ చెప్పినట్లు సజావుగా సాగితేజులై మధ్యకల్లా ఇరు దేశాల మధ్య తుది ఒప్పందం ఖరారవుతుంది.

వార్త

కేవలం ఆలోచించడం కాదు, ఆచరణ ముఖ్యం. అదీ ఇప్పుడే ప్రారంభించాలి తప్ప రేపటికి వాయిదా వేయకూడదు.

-ఇ. గిబ్బన్


# ఈ పంథా ఏ 'మార్పు' కోసం!

'మా వ్యూహాలకు మేమే రాజులం. వ్యూహం చేశామంటే అవి పండి తీరాలంతే! అని ఎవరేనా అనుకుంటే వాళ్ల పప్పులో కాలేసినట్లే! ఎవరు వ్యూహం చేశారని అల నాడు విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు పార్టీ స్థాపించిన అతి తక్కువ కాలంలో ఆంధ్రప్రదేశ్ పీఠమెక్కగలిగారు. ఎవరి ప్రోత్సాహంతో ద్రవిడ నాట సినీ కథానాయకుడు దళపతి విజయ్ కొత్త రాజకీయ పార్టీతో ప్రజల్లోకొచ్చి ప్రజల కోసం, ప్రజల చేత ప్రజల పాలనకు తెరదీసే అవకాశమిచ్చారు. అదంతా ప్రజల చలువ వల్లనే. అదే దారిలో, అదే పోకడలో ద్రవిడ నాట రాజకీయాలు నడపాలన్న ధోరణిలో తమిళ నాడు మాజీ బిజెపి నేత అన్నామలై మరోసారి నడుం బిగించారు. తాను తమిళనాడు బిజెపి అధ్యక్షునిగా ఉన్నంతకాలం అక్కడ రాజకీయాల్లో కొత్త బాటలు వేసేందుకు బిజెపి అధిష్టానం సహకారం పూర్తిస్థాయిలో దక్కలేదని ఆయనే స్వయంగా చెప్పారు. ఇటీవలి ఎన్నికల్లోనైనా ద్రవిడ పార్టీలను దాటి విజయ పథంలోకి అడుగుపెట్టాలన్న ఆయన ప్రయత్నాలకు బిజెపి కలిసి రాలేదు. తమిళనాట ద్రవిడ పార్టీల అనుబంధం నుంచి బయటికొచ్చే ప్రయత్నమేవీ చేయకపోగా అన్నాడిఎంకెలో కలిసి సాగడంతో అన్నామలై కాస్త పక్కకు జరిగి మౌనంగా, దూరంగా జరిగి ఉండిపోయారు. ఎన్నికల ముందూ వ్యూహాలు, ప్రతివ్యూహాలు ఆనక ఓటమి చెందితే మరో ఎన్నికకు సిద్ధం కావడం మామూలుగా ఏ రాజకీయ పార్టీయేనా చేసే పని. కానీ ఒక్కసారిగా ద్రవిడనాట ద్రవిడ నేపథ్యం, భావజాలం ఉన్న పార్టీలు చతికిలపడిపోవడం, సంప్రదాయేతర పార్టీతో ద్రవిడేతర పార్టీ అధికారంలోకి రావడంతో ఇప్పుడక్కడ రాజకీయ కలకలం చోటు చేసుకొంది. ఇవే సమీకరణలతో ఐదేళ్ల పాటు పార్టీలు నడుపుకోవడం, ప్రజాబాహుళ్యంలోకి వెళ్లి మనుగడ సాధించడమూ కష్టమే. పార్టీలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. అయితే ఐదేళ్లు వేచి ఉండాలా? పదేళ్లు వేచి ఉండాలా అనే విషయమై స్పష్టత లేని తమిళనాడు రాజకీయాలను ఎవరూ నమ్ముకునే పరిస్థితి లేదు. పార్టీల్లో ద్వితీయశ్రేణి నేతలు అటూ ఇటూ చెల్లాచెదుర వుతున్నాయి. ప్రథమ శ్రేణి నాయకత్వం కూడా పక్క చూపులు చూస్తున్నాయి. ఎంత వేచి చూసినా కను చూపు మేరలో భవిష్యత్ ఆశాజనకం లేదని ఎంచి మాజీ మంత్రులు అధికార పార్టీలో చేరిపోతున్నారు. అన్నాడిఎంకె నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచిన నేతలు ఎక్కువ కాలం అధికారంలో లేకుండా ఉండేట్లు లేరు. ఎమ్మెల్యేగా గెలిచిన వారు సైతం బేషరతుగా టి.వి.కె. పార్టీలోకి చేరిపోతున్నారు. టివికె అధినేత ముఖ్యమంత్రి పూర్తి మెజారిటీకి అతితక్కువ దూరంలో ఉన్నందున చాలా మంది దానిని అందిపుచ్చుకుంటే తృణమోప్రణమో ప్రజా సేవలో ఉన్నట్లుగా ఉంటుంది. మర్యాద దక్కించు కున్నట్లూ ఉంటుంది అనుకుంటూ జంప్‌లు చేసేస్తున్నారు. ఐపిఎస్ ఉద్యోగంచేస్తూ సమాజంలోమార్పుకోసం తన వంతుగా రాజీనామా చేసి రాజకీయ జపం చేసిన అన్నామలై కిందపడ్డా మళ్లీ తన ప్రయత్నాలను, ఆలోచనలను వీడలేదు. ఎప్పుడైతే భారతీయ జనతాపార్టీవదిలి సరికొత్త రాజకీయ ప్రయాణానికి అడుగులువేశారు.'వుయ్ ది పీపుల్' పేరిట రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. స్పందన అనూహ్యం. త్వరలో ప్రజలే కేంద్రంగా ఓ రాజకీయ పార్టీని స్థాపించే పనిలో పడ్డారు. 'మారుదాం. మార్చుదాం' అనే నినాదంతో కొత్త రాజకీయ ప్రస్థానానికి నాంది పలికారు. 'నా మార్గం వేరు, నా లక్ష్యాలు విస్తృతం. తమిళనాట ఒక సరికొత్త రాజకీయ సంస్కృతిని, సమున్నతమైన మార్పును తీసుకురావాలనుంది అని అన్నామలై స్పష్టం చేశారు. ఎవరెన్ని రాజకీయాలు చేసినా, రాజకీయ పార్టీ లకు అంతిమ లక్ష్యం అధికారమే. ఒక ఉద్యమానికి పునాది వేస్తే 'మార్పు' అదే వస్తుందన్న ఆలోచనలతో ఆయన వ్యూహాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల తమిళ తంబి లో వచ్చిన మార్పు సినీ నటుడి పార్టీకి అధికారం కట్ట బెట్టిన తీరు చూస్తే 'మళ్లీ ఇంకేంకావాలి' అనిఎవరైనా ప్రశ్నిస్తే, అన్నామలై తన గమ్యానికి సరైన దారి వేసుకునే పనిలో ఉన్నారు. తమిళనాడు రాజకీయాల్లో కాకావికలైన అన్ని పార్టీలు తమ రాజకీయమార్గాన్ని, రాజీ మార్గాన్ని కొత్త పుంతలు తొక్కించే ప్రయత్నం చేస్తున్నారు. ముందు ఉద్యమంలా బయటికొచ్చి ఆపైన రాజకీయ ఆకాంక్షలు నెరవేర్చుకునే విధంగా ఆలోచనలు చేస్తున్నారు. తమిళునిగా కొనసాగుతూ బిజెపిలో ఉండడం కష్టమైన పనిగా భావించిన అన్నామలై కొత్త పంథాలోకి అడుగు పెట్టారన్న మాట. కొత్తగా రాజకీయాన్వేషణ చేసే వారికి రాజకీయాలు నేర్పేందుకు సన్నద్ధమయ్యారు. కోయంబత్తూరులో ఎపిజె అబ్దుల్ కలాం సెంటర్ ఫర్ ఎథిక్స్ ప్రారంభించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజకీయ నేతలు కొత్తగా పార్టీ పెట్టే సమయంలో చెప్పే మాటలే ఆయనా చెప్పారు. తమిళనాట రాజకీయ కూటముల్లో మిత్రులెవరూ ఆనందంగాలేరు. బయటికెళ్లి అధికార పార్టీలో మమేకమైపోయినా లోపలుండి చేసేదేమీ లేదని తదుపరి కార్యాచరణకు సందిగ్ధంలో ఉన్నారు. నెమ్మదిగా తమకున్న రాజకీయ అనుబంధాలను తప్పించుకునే ప్రయత్నంలో ఉన్నారు. మొన్నటిఎన్నికల్లో చితికిపోయిన వారు సైతం ఏంచేయాలో తోచక, నలుగురులో నవ్వులపాలవకుండా ఉండేందుకు కొత్తగా ఉద్యమాలు నిర్మిస్తామంటున్నారు. ఇదిలాఉండగా సూపర్ స్టార్ విజయకాంత్ సతీమణి, సామాజిక కార్యకర్త ప్రేమాలతా రజినీకాంత్ ఎండిఎంకె తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ ద్రవిడ పార్టీల కూటమిలో ఉండిపోవడంతో తమిళనాడు రాష్ట్ర శ్రేయస్సు అభివృద్ధి కోసం 'నినాదంతో'మక్కల్ మేద్రై' పేరిట సామాజిక ఉద్యమానికిపిలు పునిచ్చారు. ఆరాష్ట్రంలో రాజకీయ సామాజికపరిణామాలు ఎంతో మందికి ఎన్నో కొత్తదారులు చూపిస్తున్నాయి.



జీవితం ఒక పాఠశాల వంటిది. ఇక్కడ ప్రతి బాధ, ప్రతి హృదయం విదారకత మనకు అమూల్యమైన పాఠాన్ని నేర్పుతుంది.

స్వామి వివేకానంద



అనేక విత్తనాలు విత్తడం ద్వారా నేల ఏ విధంగా సారవంతమవుతుందో అలాగే రకరకాల విషయాలను పరిశీలించడం ద్వారా మనసు వికసిస్తుంది.

జెఫర్సన్

## ప్రజావాక్కు

### పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరీక్షలనిర్వహణ పేపర్ల మూల్యాంకనం సరిగాజరగడం లేదనేది చాలా కాలంగా వినిపిస్తున్నవిమర్శ. ప్రతిష్టాత్మకసంస్థల్లో చేరడానికి నిర్వహించే ఎంట్రన్స్ టెస్ట్‌లు ఉద్యోగాల కోసం అభ్యర్థులకు నిర్వహించే టెస్టులు కూడా సరిగా ప్రూఫ్ రీడింగ్ చేయడం లేదు. గ్రమెటికల్‌మిస్టేక్స్ ఉంటున్నాయి. ప్రింటింగ్ మిస్టేక్స్ కూడా ఉంటున్నాయి. యాడ్స్ స్కోర్‌ఇవ్వడంలేదు. తప్పులు ఏమైనాఉంటే అప్పీల్ చేయండిఅని అడుగుతున్నారు. ఎక్కువమంది అప్పిల్ చేయడానికి ఫీజు కట్టడానికి భయపడి అప్పీల్ చేయడం లేదు. తద్వారా తప్పులు తడకలతో కూడినకీ పేపర్ ఆధారంగానే మార్కులు ఇస్తున్నారు. ఇటీవల ఆంధ్ర యూనివర్సిటీ వారు నిర్వహించిన ఏపీ సెట్ 2025 లో పేపర్ వన్‌లో ఎనిమిది బిట్లు తప్పుగా ఇచ్చారు. వాటికిపదహారుమార్కులు. మాస్టర్‌కిలో ఆ తప్పులు ఆధారంగానే ఆన్సర్లుఉన్నవి. ఇలాంటి పరీక్షలు నిర్వహించే టప్పుడు అభ్యర్థుల నుండి ఎలాంటి విమర్శలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

పజాస్వామ్య వ్యవస్థలో ఓటరు తీర్పు అత్యంత పవిత్రమైనది. ప్రజలు ఒకసిద్ధాంతాన్ని నమ్మి తమ ప్రతినిధులను ఎన్నుకుంటారు. అయితే ఇటీవల రాజకీయాల్లో చోటు చేసుకుంటున్న ఫిరాయింపులు ఓటర్ల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ప్రలోభాలకు గురై పక్షాలుమార్చడం ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలి పెట్టు. ఈచట్టంలోని లొసుగులను వాడు కుని ప్రతినిధులు స్వార్థ ప్రయోజనాల కోసం పక్షాలు మారుతున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరో పక్షంలోకి వెళ్లడం ఓటర్లను మోసం చేయడమే. ఫిరాయింపులకు పాల్పడినప్పుడు సభ్యత్వం తక్షణమే రద్దు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### కర్షకులు అంటే విలువలేదా

నేటి భారతంలో అధిక పనుల పేరిట ఆదివారం కూడా ఆకలి మంటల కోసంఅహర్నిశలు కృషి చేస్తూ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రైవేట్ ఆఫీసులు, ఆసుపత్రుల బంధిఖానలో తీవ్రఅనారోగ్యానికి గురవుతున్న కార్మికులు ఎక్కువమందేఉన్నారు. జరఆరోగ్యం గురించినిన్ను నమ్ముకున్న కుటుంబం గురించి ఆలోచించి ముందుకు సాగు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### డబుల్ బెడ్‌రూమ్స్ ఇళ్లు ఇవ్వాలి

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డబుల్ బెడ్ రూమ్లను వెంటనే ఇవ్వవలెను. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు ఇప్పుడుఉన్న ప్రభుత్వం లబ్ధిదారులకు కేటాయించాల్సినవి కేటాయిస్తే తమకేమీనష్టం వాటిల్తుందో అర్థం కావటం లేదు. ప్రజలను ఒక రకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూంలో నిర్మించి ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేయుచున్నారు. గ్యారెంటీ వారంటీ అనుకుంటూ ఓట్లు దండుకోవటం తప్ప ప్రజలకు మేలు చేకూర్చే, బాగోగులు చూసేపథకాలను ప్రణాళిక తీసుకువచ్చి ప్రజలకులబ్ధిదారులకు న్యాయం చేయాలి. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలలో తీర్మానంచేసి లబ్ధిదారులను ఎంపిక చేసినారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఆ లబ్ధిదారులను కాకుండా వేరే లబ్ధిదారులను చాటు మార్గంగా ఎంపిక చేస్తున్నారా? తమకు నచ్చిన వారినినకిలీల ఎంపిక చేసివారికి కేటాయించేవిధంగాఉందని ప్రజలుఅనుమానంతో భావిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూమ్స్ కేటాయించాలి.

- సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### గ్రామాలలో జంతు బలి నిషేధించాలి?

గ్రామాలలో ఇండ్లవీధులలో జంతు బలిని నిషేధించాలి. వర్షా కాలంలో జంతువులను వధించడం వలన జంతువు కళేబరాలు, వ్యర్థ పదార్థాలను, రక్తం, మాంసం, ఎముకలు, కసరు, వంటి పదార్థాలు మురుగు వాసనతో అంటూ రోగాలు వస్తున్నాయి. జంతువులు బలిచేసే వారు ఆర్థికంగా లాభం పడుతున్నారు. కానీ చుట్టూ ప్రక్కల ప్రజలు అనారోగ్యం పాలు అవుతున్నారు. కనుక తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య, హెల్త్ డిపార్ట్మెంట్, స్థానిక గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో జంతు బలినినిషేధం చేయాలి. వారికీ నోటీసు ఇవ్వాలి. జరిమానావిధించాలి. కేసులు నమోదుచేయాలి. ఆరోగ్యమేమహాభాగ్యం కనుకశుభ్రత పాటించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### నిధులను విడుదల చేయాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజ్ రీయంబర్స్‌మెంట్ బకాయి నిధులను సకాలంలో విడుదల చేయక పోవడం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం ఫీజ్‌లు చెల్లించాలని విద్యార్థులపై వత్తిడి చెయడం వల్ల ఫీజ్‌లు చెల్లించే ఆర్థిక స్తొమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే ప్రమాదం ఉంది. ప్రభుత్వంఫీజ్ బకాయి నిధులను విడుదల చేసి నిరుపేదలు ఉన్నత విద్యనభ్యసించేలా సహకరించాలి.

-బి. కృష్ణ యాదవ్, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# 'పొల్లు మాట'లతో చేటు తేవొద్దు

*తెలంగాణావారి హక్కులను ఇతరుల పాలు కాకుండా చేయడానికి. ఎవరైనా ఎక్కడివారైనా ఇక్కడికి రావచ్చు, ఏమైనా చేసుకోవచ్చు కాని ఇచటి రాజకీయ పరమైన ఉన్నత పదవులు అంటే, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రిలాంటివి ఇక్కడి వారికే, లేక ఇక్కడ చిరకాలంగా నివసిస్తున్నా వారికే దక్కాలి అనే నిబంధనను చేసుకోవచ్చు. అప్పుడు తెలంగాణలోని విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు, భూమి వనరులు మున్నగువాటికిచెందిన యాజమాన్యతలు పూర్వం నుండి ఇచటే పుట్టి పెరిగిన వారికి లేక చాన్నాళ్ల నుండి ఇచ్చట స్థిరపడ్డవారికి మాత్రమే లభించేటట్లు చేయవచ్చు. ఆర్థిక స్థోమతే కదా అన్ని స్థోమ తల కంటే మిన్న. అలాంటి ఆర్థిక స్థోమత తగ్గుతుందేమో నని తెలంగాణా ప్రాంతం వారికున్న భయాందోళనలు, సందేహాలు సహజమే కదా! ఇప్పుడు గొడవంతా వస్తున్నది ఆ భయాందోళనల, సందేహాల వలననే కదా? తెలంగాణా వారి భయాందోళనలను, సందేహాలను నివారించాలంటే పవన్ కళ్యాణ్ వీటిని పట్టించుకోవలసుంటుంది. సిద్ధమేనా మరి! పవన్ కళ్యాణ్ కాస్తాగి వీటిగురించి సావధానంగా ఆలోచించి ముందడుగు వేయగలరా మరి?*



డా॥కొండలరావు వెల్చాల

ఇదేనా మన సభ్యత, సంస్కారం, సాంప్రదాయం? ఇదేనా మనకు మన విద్య ద్వారా లభించినవినయం, వివేకం, వికాసం? ఈ మధ్య హైదరాబాదులో చెలరేగుతున్న మాటల మాయాజాలం నన్నెంతో కలవరపరిచింది. ఇంకా కలవర పరుస్తూనే ఉంది. దేశ స్వాతంత్ర్య సమరంలో, హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం కావడానికి ఆనాటి హైదరాబాదు వారు జరిపిన విలీన పోరాటంలో, అటు తదుపరి తెలంగాణ అస్తిత్వ పోరాటంలో చాలా చురుకుగా పనిచేసి కరవళ్లు మోసిన వాణ్ణి, కారాగారాల్లో బంధించబడినవాణ్ణి. నిజమైన, స్వచ్ఛమైన స్వాతంత్ర్య సమరయోధుణ్ణి. కనుకనే ఈనాటి అసభ్యకరమైన, ఆందోళనకరమైన మాటల పోటీలను చూస్తుంటే, వింటుంటే తట్టుకోజాలడం లేదు. ఇదేనా మనం మన యువతకిస్తున్న సందేశం, వారసత్వం? ఇందుకొరకేనా మనం సకల త్యాగాలతో స్వాతంత్ర్యాన్ని సాధించింది? అని అనుకుంటూ శాంతి ప్రశాంతతలు కోల్పోతున్నాను. ఒక దేశం లేక రాష్ట్రంవారు ఇంకొక దేశానికి, రాష్ట్రానికి అనేకానేక కారణాల వల్ల రావటం పోవటం జరగడం అనాదిగా మామూలే కదా! అది వ్యాపారం కొరకు కావచ్చు, విద్య కొరకు కావచ్చు. ఉపాధి కొరకు కావచ్చు, కాని నాకు తెలిసినంతవరకు అది రాజకీయాల కొరకు మాత్రం కాదు, కాకూడదు కూడా. కాని ఇప్పుడు మాత్రం తక్కినవాటికంటే రాజకీయ కారణాలే ఎక్కువేమోనని తెలంగాణావారు గాభరా పడుతున్నారు. అందుకేనేమో కొందరు అలజడులకు, అసభ్య పదజాలాలకు పాటుపడుతున్నారు. ఇది వారి విశ్వాసానికి చెందిన విషయం. దానికి గత చరిత్ర కారణం కదా! కాదనగలమా మరి! ఒకప్పుడు తెలంగాణాను ఆంధ్రా ప్రాంతంలో విలీనం చేస్తున్నప్పుడు 'జంటిల్మెన్ అగ్రిమెంట్' ద్వారా తెలంగాణా వారికి ఆంధ్రాప్రాంతపు నేతలు ఎన్నో వాగ్దానాలు చేశారు. వాటిని పట్టించుకోకపోవడం వలననే కదా ప్రత్యేక తెలంగాణా పోరాటం వచ్చింది. మరి ఇప్పుడుకూడా ఈనాటి ప్రభుత్వాలు అనేకానేక వాగ్దానాలు చేస్తూనే ఉన్నాయి. వాటిని అమలు చేయకుండా చేతులెత్తేస్తూనే ఉన్నాయి. వాటికి అనేకానేక కారణాలు ఉదహరిస్తూ. మరొకసారి తెలుగువారందరూ కలిస్తే రెండు రాష్ట్రాలు ఒకటైతే తెలంగాణా వారికి అదే గతి పడుతుందేమోననే అనుమానం రాకుండా ఉంటుందా? ఇంగ్లీషులో ఒక సామెత 'వి హేడ్ ద ఎక్స్‌పీరియన్స్ బట్ మిస్స్‌డ్ ద మీనింగ్' యనునది ఉంది. ఇంకొకటి 'హిస్టరీ టీచస్ అజ్ దట్ మ్యాన్‌కైండ్ హ్యాడ్‌లీ లర్న్స్ ఎనీథింగ్ ఫ్రమ్ హిస్టరీ' యనునది. ఇప్పుడు హైదరాబాద్‌లో జరుగుతున్న కలహాలను చూస్తుంటే ఔను కదా! అంతే కదా! అని అనిపిస్తుంది. మనకు మొదటి ప్రపంచ యుద్ధం వచ్చింది. దానితో మనమేం నేర్చుకున్నాం. రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. మనమేం నేర్చుకున్నాం. ఇప్పుడు మూడో ప్రపంచయుద్ధం దాదాపు మొదలైంది. దానివలన మనమేం నేర్చుకుంటున్నాం? తెలంగాణ అస్తిత్వ పోరాటం వచ్చింది, దానితో మనం ఏం నేర్చుకున్నాం? ఇదీ అంతే కావచ్చునను భయాందోళన ఈనాటి తెలంగాణా వారి



అలజడికి, అప్రస్తుత, అసభ్య పదజాల వాడుకకు కారణం కాదని నిస్సందేహంగా అనగలమా? పవన్ కళ్యాణ్ జనసేన యను ఒక పార్టీని స్థాపించారు. ఆ పార్టీని తెలంగాణాలో కూడా పెట్టదలచుకున్నారు. దానికి అభ్యంతరమెందుకు? ఆయన హైదరాబాదులో ఒక సభ జరపాలనిఅనుకున్నారు. దానికి అనుమతి నిరాకరణ ఎందుకు? ఆ పార్టీ కాక ఇంకా ఎన్నో పార్టీలు హైదరాబాదులో లేవా? ఇంకా వస్తూనే ఉన్నాయి కదా? ఆయా పార్టీలు వారివారి సభలు సమావేశాలు జరుపుకోవడం లేదా? అసలు కారణం అది కాదు. అసలు కారణం ఆనాటి ఆంధ్రాప్రాంతపు అధిపత్యం తిరిగి మరొకసారి తెలంగాణాకి వస్తుందేమోనని, ఇది తెలంగాణా వారి విశ్వాసానికి చెందింది. ఎవరెన్ని అన్నా ఆ విశ్వాసం ఇంత త్వరగా పోదు, పోజాలదు. ఇది పవన్ కళ్యాణ్ అర్థం చేసుకొని ఇంత తొందరగా ఇచట వారి పార్టీకి చెందిన సన్నాహాలు ప్రారంభించకపోతే బాగుండేదేమో? కాస్త రాజకీయ వాతావరణం చల్లబడ్డాక మరికొంతకాలం ఓపిక పట్టి, ఈలోపల అచటి ఇచటి మేధావులతో సంప్రదించి కొన్ని సమిష్టి సభలు, సదస్సులు నిర్వహించి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించి ఇప్పుడు చేయదలచుకున్నవన్నీ అప్పుడు చేస్తే బాగుండేదేమో? కాస్త తొందరపాటు జరిగిందని అనిపిస్తోంది. ఒకనాటి హైదరాబాదు రాష్ట్రంలో 'ముల్కీరూల్స్' యనునవి ఉండేవి. వాటిద్వారా హైదరాబాదు రాష్ట్రంలోని విద్యావసతులు, ఉద్యోగాలు, భూమి పుత్రులు మున్నగునవి మొదట హైదరాబాదు వారికే చెందాలి అనే నిబంధన ఉండేది. వాటిని తూ.చ తప్పక అమలు చేసినన్ని రోజులు ఏ గొడవలూ రాలేదు. ఎపుడైతే వాటిని అమలు చేయలేదో, అమలు చేయుటకు ఎన్నో అవరోధాలు కల్పించి, వాటిని ఇతర ప్రాంతాల వారు కాజేయుటకు వీలు కల్పించారో అప్పుడు వచ్చింది ప్రత్యేక తెలంగాణ పోరాటం, దీని గురించి'గిర్గలాని కమీషన్' సవివరంగా పేర్కొంది. అప్పటికీ ఇప్పటికీ అసలు గొడవంతా విద్యావసరాల కొరకు, ఉద్యోగాల కొరకు, భూములు, నీళ్ల వగైరాల కొరకే కదా? అలాంటప్పుడు ఆనాటి 'ముల్కీ రూల్స్' లాంటివి ఈనాడు కూడా తెలంగాణా వారికొరకు పెట్టుకోవచ్చు కదా! అలాంటి ముల్కీరూల్స్ లాంటివి కాశ్మీర్లో కూడా అమలులో ఉన్నాయి కదా. అప్పుడు ఈ గొడవంతా ఉండదు కదా! సోనియాగాంధీకి ఒకప్పుడు ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉండింది. ఆమెను అలా కానివ్వకుండా సుబ్రహ్మణ్యస్వామి రాష్ట్రపతి దగ్గరకు వెళ్ళి ఈమె ఇటాలియన్ దేశ పౌరసత్వం కలది, ఆ దేశ రాజ్యాంగంలో ఆ దేశపౌరులు కానివారు ఆ దేశానికి రావచ్చు. ఏ కార్యకలాపాలనైనా చేసుకోవచ్చు. కాని అత్యంత ప్రముఖమైన ప్రధానమంత్రిత్వాన్ని మాత్రం ఆ దేశ పౌరుడికే ఉంటుంది' యని రాసి ఉంది. అలాగే ఇక్కడ కూడా ఇక్కడి ప్రధాన మంత్రిత్వం ఇక్కడి వారికే దక్కాలి కాని మరొకరికి కాదు యని వాదించి ఆమెను ప్రధానమంత్రి కాకుండా చేశారు. అలాంటి నిబంధనను మనం కూడా 'ముల్కీరూల్స్' పెట్టుకోవడానికి ఉదాహరణగా తీసుకోవచ్చు. తెలంగాణావారి హక్కులను ఇతరులపాలు కాకుండా చేయడానికి. ఎవరైనా ఎక్కడివారైనా ఇక్కడికి రావచ్చు, ఏమైనా చేసుకోవచ్చు కాని ఇచటి రాజకీయ పరమైన ఉన్నత పదవులు అంటే, ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రిలాంటివి ఇక్కడి వారికే, లేక ఇక్కడ చిరకాలంగా నివసిస్తున్నా వారికే దక్కాలి అనే నిబంధనను చేసుకోవచ్చు. అప్పుడు తెలంగాణలోని విద్యావకాశాలు, ఉద్యోగావకాశాలు, భూమి వనరులు మున్నగువాటికిచెందిన యాజమాన్యతలు పూర్వం నుండి ఇచటే పుట్టి పెరిగిన వారికి లేక చాన్నాళ్ల నుండి ఇచ్చట స్థిరపడ్డవారికి మాత్రమే లభించేటట్లు చేయవచ్చు. ఆర్థిక స్థోమతే కదా అన్ని స్థోమ తల కంటే మిన్న. అలాంటి ఆర్థిక స్థోమత తగ్గుతుందేమో నని తెలంగాణా ప్రాంతం వారికున్న భయాందోళనలు, సందేహాలు సహజమే కదా! ఇప్పుడు గొడవంతా వస్తున్నది ఆ భయాందోళనల, సందేహాల వలననే కదా? తెలంగాణా వారి భయాందోళనలను, సందేహాలను నివారించాలంటే పవన్ కళ్యాణ్ వీటిని పట్టించుకోవలసుంటుంది. సిద్ధమేనా మరి! పవన్ కళ్యాణ్ కాస్తాగి వీటిగురించి సావధానంగా ఆలోచించి ముందడుగు వేయగలరా మరి? •

(రచయిత: సీనియర్ స్వాతంత్ర్య సమరయోధులు)

# అమెరికా, ఇజ్రాయెల్ సంబంధాల్లో కొత్త అధ్యాయం

సీహెచ్ వి ప్రభాకర్ రావు

ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా కాంగ్రెస్ సభ్యుడు మార్లిన్ స్టుట్మనక్కు పంపిన లేఖ అమెరికా-ఇజ్రాయెల్ సంబంధాలపై ఒక కొత్త చర్చకు తెర తీసింది. ఆ లేఖలో నెతన్యాహు అమెరికా ఇజ్రాయిల్ రక్షణ సహకారాన్ని 'సహాయం నుండి భాగస్వామ్యం వైపు' మార్చాలి అని పేర్కొనడం, అమెరికా రాజకీయ, రక్షణ, ఇంటెలిజెన్స్ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చలకు దారితీసింది. అమెరికా మీడియా నివేదికల ప్రకారం, నెతన్యాహు 'ఇజ్రాయెల్ ఇక భాగస్వామి కావాలి' అని స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. దశాబ్దాలుగా అమెరికా ప్రతి సంవత్సరం ఇజ్రాయెల్‌కు సుమారు 3.8 బిలియన్ డాలర్ల సైనిక సహాయం అందిస్తోంది. కానీ ఇప్పుడు ప్రతిపాదన ఏమిటంటే, ఆ సహాయాన్ని క్రమంగా తగ్గించి, దాని స్థానంలో సంయుక్త రక్షణ ఉత్పత్తి, సంయుక్త పరిశోధన, సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, డ్రోన్ సాంకేతికతలలో ఉమ్మడి పెట్టుబడులు పెట్టే భాగస్వామ్య నమూనాను రూపొందించడం. ఈ మార్పు పైకి చూస్తే అమెరికా, ఇజ్రాయెల్ సంబంధాలను మరింత బలోపేతం చేసే చర్యలా కనిపిస్తుంది. అయితే లోతుగా పరిశీలిస్తే ఇది కేవలం ఆర్థిక సహాయం తగ్గింపు కాదు. ఇదిశక్తి సంబంధాల పునర్వ్యవస్థీకరణ. గతంలో అమెరికా నాయకత్వం వహించే సంబంధం ఉండగా, ఇప్పుడు ఇజ్రాయెల్ సమాన భాగస్వామిగా గుర్తింపు కోరుతోంది. అమెరికా భద్రతా వ్యవస్థలో కొందరు అధికారులు ఈమార్పును జాగ్రత్తగా గమనిస్తున్నారు. కారణం సైనిక సహాయంకంటే సాంకేతికభాగస్వామ్యం మరింత లోతైనది. ఒకసారిరెండు దేశాల రక్షణ పరిశ్రమలు, ఏఐ, వ్యవస్థలు, సైబర్ నెట్వర్క్స్, క్షిపణి రక్షణ వ్యవస్థలు పరస్పరం అనుసంధానమైతే, సమాచారం ప్రవాహం కూడా విస్తృతమవుతుంది. అప్పుడు ప్రశ్నకేవలం సహకారం గురించే కాదు, సున్నితమైన సాంకేతికతపై ఎవరి ప్రభావం ఎంత అన్నది కూడా కీలకమవుతుంది. చరిత్రలో అమెరికా, ఇజ్రాయెల్ మధ్య సంపూర్ణ విశ్వాసం మాత్రమే ఉండలేదు. మిత్రదేశాల మధ్యకూడా గూఢచర్య ఆరోపణలు, ఇంటెలిజెన్స్ వివాదాలు చోటుచేసు కున్నాయి. అందువల్ల అమెరికా కౌంటర్ ఇంటెలిజెన్స్ వర్గాల్లో కొందరు 'భాగస్వామ్యం ఎంత వరకు?' అనే ప్రశ్నను లేవనెత్తడం సహజమే. నెతన్యాహు ప్రతిపాదనను మరో కోణంలోచూస్తే, ఇది ఇజ్రాయెల్ వ్యూహాత్మక ఆత్మవిశ్వాసానికి సంకేతం, గతంలో సహాయం పొందిన దేశం ఇప్పుడు 'మేము నిలబడగలుగుతాం, కానీ భాగస్వామ్యంగా ముందుకు వెళ్తాం' అని చెబుతోంది. ఇదిఅమెరికా సహాయంపై ఆధారపడే మోడల్ నుండి, అమెరికా సాంకేతిక రక్షణవ్యవస్థలో కీలక భాగస్వామిగా మారే ప్రయత్నం. ఇక్కడ అమెరికా రాజకీయాల్లో మరో అంశం కూడా ఉంది. గత కొన్నేళ్లుగా అమెరికాలో విదేశీ సహాయంపై విమర్శలు పెరుగుతున్నాయి. అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బుఎందుకు విదేశాలకు వెళ్తోందనే ప్రశ్న రిపబ్లికన్ వర్గాల్లో బలపడుతోంది. ఈ నేపథ్యంలో 'సహాయం నుండి భాగస్వామ్యం వైపు' మోడల్ రాజకీయంగా కూడా ఆకర్షణీయంగా మారింది. ఎందుకంటే ఇది సహాయం కొనసాగించడం కాదువాణిజ్యం, ఉమ్మడి పెట్టుబడులు, ఉమ్మడి ఉత్పత్తి అనే కొత్తభాషనుఉపయోగిస్తోంది. అమెరికాకు ఇది ఒక అవకాశం. అత్యాధునిక సాంకేతిక రంగాల్లో విశ్వసనీయ భాగస్వామ్యాన్ని మరింతగా ఉపయోగించుకోవడం. ప్రపంచ అగ్రరాజ్యంగా తన వ్యూహాత్మక స్వాతంత్ర్యాన్ని, సాంకేతిక ఆధిపత్యాన్ని, ఇంటెలిజెన్స్ భద్రతను కాపాడుకుంటూనే ఆభాగస్వామ్యాన్ని నిర్వహించడం. రాబోయేదశాబ్దంలో అమెరికా ఇజ్రాయెల్ సంబంధాల భవిష్యత్తు ఈ సమతుల్యతపైనే ఆధారపడి ఉండవచ్చు. •

# భూ ఆక్రమణదారులపై హైడ్రా కొరడా!

ఆర్.భాస్కర్ రెడ్డి

ఒక బృహత్తర లక్ష్యంతో భావితరాల ఉపయోగార్థం ముఖ్యంగా హైదరాబాద్ ప్రజల సంరక్షణార్థం కొరకు ఆస్తుల రక్షణ ,పర్యవేక్షణ విపత్తుల నిర్వహణ పకడ్బందీగా అమలు చేసే ఉద్దేశంతో హైడ్రాను ఏర్పాటు చేసి త్వరిత గతిన ఆక్రమణలు తొలగించి ప్రభుత్వం హైడ్రా ద్వారా భూములను స్వాధీనం చేసుకుంటుంది .ఇది అన్ని వర్గాలు స్వాగతించవలసిన విషయం. కానీ ఎన్నో విమర్శలు, మరెన్నో విన్నపాల మధ్య దాదాపు ఎనభై ఆరు వేల కోట్ల రూపాయల విలువైన ,రెండు వేల తొంభై మూడు ఎకరాల భూములను స్వాధీనం చేసుకుంది. ఇందులో చెరువులు, కుంటలు, సరస్సులు, నాలాలు, ప్రభుత్వ భూములు, ప్రజల పార్కులు ఉన్నాయి. ఈ ఆక్రమణ నిర్మాణాలను గమనిస్తే ఎక్కువగా రాజకీయ నాయకులు చేసినవి లేదా వారి అధినాయకులు చేసినవే ఎక్కువగాఉన్నాయని స్పష్టమవుతుంది. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలను నమ్మించి వారి ద్వారా సొమ్ముచేసుకున్న భూములు కనబడుతున్నాయి. విచిత్రంగా అన్ని రాజకీయ పార్టీల నుండి, అన్ని రకాల వర్గాల ప్రజల నుండి, మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా తీసుకునే చర్యలను స్వాగతిస్తున్నారు ఇది హర్షించదగిన సందర్భం. గతంలోనే తెలంగాణ హైకోర్టు మూసీ నది నాలాల వెంట దాదాపు 30 వేల నిర్మాణాలు వెలిశాయని వాటిని తొలగించి అక్కడ నివసించే ప్రజలకు పునరావాస చర్యలు తీసుకోవాలని ,అప్పుడే వరదలు తగ్గుముఖం పడతాయని, నాళాలు సురక్షితంగా ఉంచాలని ప్రభుత్వానికి సూచించింది. కానీ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం వాటిపై సరైన దృష్టి పెట్టిన దాఖలు లేవు. వర్షాకాలం వచ్చిందంటే హైదరాబాదు నగర జీవనం అష్ట కష్టాలు పడుతూ జీవించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రోడ్లన్నీ జలాశయాలను తలపిస్తూ విపరీతమైన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. భారీ వర్షాలు పడిన సందర్భంలో ఎప్పుడూ ,ఎక్కడ, ఏ ప్రమాదం సంభవిస్తుందో అనే సందేహం, భయం ఉత్పన్నమవుతుంది. వీటన్నింటి అనర్థాలకు నాళాలు, చెరువులు, కుంటలు కబ్జా చేసిన పుణ్యఫలమే అని అందరికీ తెలుసు. ఈ మధ్యకాలంలో నాలాలలో పాఠశాల విద్యార్థులు పడి చనిపోయిన ఉదంతాలు చాలా జరిగాయి. కానీ ఏడు దశాబ్దాలుగా సినిమా సన్నివేశాల లాగా చూస్తూ ఉన్న ప్రభుత్వ పాలన శాఖలు కబ్జా కోరల నుండి రక్షణ కల్పించకపోగా, ఆక్రమణదారులకు రక్షణగా నిలిచి పర్యవేక్షణ చేశాయి. కానీ ఈ మధ్యే తెలంగాణ ప్రభుత్వం మూసి నాల అభివృద్ధి కార్యక్రమం పేరుతో మూసి నది పరివాహక ప్రాంతాన్ని అభివృధి చేయడానికి పథకాన్ని రూపొందించింది. ఆక్రమణలు, కబ్జాలే కాక అనేక సమస్యలకు నిలయంగా మారిన కూడా హైదరాబాద్ ఒక విశ్వనగరంగావర్ధిల్లుతుంది. అనేక రకాల మతాల, కులాల, ప్రాంతాల, భాషల, వివిధ



దేశాల ప్రజలు కలిసిమెలిసి బ్రతుకుతూ బహుళ సంస్కృతిని ఏర్పరిచినారు. హైదరాబాద్ నగరానికి అనేక పేర్లు ఉన్నాయి. కానీ చెరువుల నగరం, తోటల నగరం అనే పేరు కూడా ఉండేదని చారిత్రకంగా అవగతం అవుతుంది. ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధ్యయనం ప్రకారం, హైదరాబాద్ నగరంలో సుమారు 140 పెద్దా చిన్న సరస్సులు ఉన్నాయి. మరో 834 నీటి ట్యాంకులు 25ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. కానీ హుడా సరస్సుల పరిరక్షణ ప్రణాళిక, క్రింద 2018 మే నాటికి కేవలం 169 సరస్సుల రికార్డులను మాత్రమే నిర్వహిస్తుంది. అనగా నగరంలోని నీటి వనరులు, ఇతర నీటి వనరుల ఉపరితల వైశాల్యం తగ్గుతూ వస్తుంది. అలాగే నగరంలో రియల్ ఎస్టేట్ లేదా పట్టణీకరణ వేగవంతమైన వృద్ధి వలన వేలాది ట్యాంకులు అంతరించిపోయాయి. ఉదాహరణకు అఫ్జల్ సాగర్, కుంట భవాని దాస్ ,మాసబ్ ట్యాంక్ ,మీరు జుమ్లా ట్యాంక్, నల్లకుంట ,నవాబ్ సాహెబ్ కుంట, సోమాజిగూడ ట్యాంక్, తీగలకుంట కను మరుగయ్యాయి. 1990లో హుస్సేన్ సాగర్ చెరువు 1375 ఎకరాలుగా ఉండేది. ఆక్రమణకు గురై ఈ ప్రాంతంప్రస్తుతం 825 ఎకరాలకు మాత్రమే పరిమితమై ఉంది. అలాగే నగరంలో 1973 నుండి 1996 కాలంలో పట్టణ ఆక్రమణ కాలుష్యం కారణంగా హైదరాబాద్ పది హెక్టార్ల కంటే ఎక్కువ పరిమాణంలో ఉన్న 18 నీటి వనరులను పది హెక్టార్ల కంటే తక్కువ పరిమాణంలో ఉన్న 80 చిన్న నీటి వనరులను కోల్పోయింది. అలాగే కేంద్ర జలవనరుల శాఖ సర్వే ప్రకారం, చిన్న నీటి వనరుల ఆక్రమణలలో దేశంలో నాలుగో స్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉంది. బ్రాండ్ హైదరాబాద్ పేరును నిలబట్టుకోవడానికి కావలసిన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ, ప్రభుత్వ భూమి ఆక్రమణలకు తావు లేకుండా చేసి ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేలా, పరిశ్రమలను నెలకొల్పేలా, ప్రజాపాలన అందించేలా, ప్రభుత్వం పారదర్శకంగా, జవాబుదారీతనంగా నిర్ణయాలు తీసుకోవాలి. వీటిని నెరవేర్చడానికి హైడ్రా తోడ్పాటు అందిస్తుందని ఆశలు చిగురిస్తున్నాయి. కానీ ఇది వానాకాలం వరకే పరిమితం కాకుండా, రాజకీయ కోణంలో చూడకుండా, 365 రోజులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. అలాగే హైడ్రాను తెలంగాణ మొత్తంపరిరక్షించే విధంగా చట్టంలో మార్పు తీసుకు రావాలి. గ్రామీణ స్థాయి నుండి పట్టణ స్థాయి వరకు జరుగుతున్న భూ కబ్జాలను గుర్తించి పేద వారికి న్యాయం చేయాలి. ఏడు దశాబ్దాలుగా ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించడానికి ఒక మంత్రివర్గ ఉపసంఘం నియమించి కబ్జాదారుల నుండి విడిపించుకోవాలి. అలాగే ఆస్తుల సంరక్షణకే పరిమితం కాకుండా విపత్తుల నిర్వహణ బాధ్యత కూడా హైడ్రా పై ఉన్నందున నగరంలో అనుమతుల్లేని నిర్మాణాల పైన ఉక్కుపాదం మోపాలి. ముఖ్యంగా గత దశాబ్దకాలంగా వెల్లివిరిసిన అక్రమ నిర్మాణాలను వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలి. అనుమతి లేని నిర్మాణాల వలన ఆ నిర్మాణాల సమయంలో అగ్ని ప్రమాదాలు తావు లేకుండా చేయాల్సిన అత్యవసర మార్గాలను ఏర్పాటు చేయని కారణంగా అనేకమంది అమాయకులు ప్రాణాలు పోయిన సందర్భాలు ఈ మధ్యకాలంలో చాలా బయటపడినాయి. గత ప్రభుత్వం ప్రారంభించిన స్ట్రాటజిక్ నాలా డెవలప్మెంట్‌ను ముందుకు తీసుకెళ్తూ, మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టును తక్షణమేప్రారంభించి, హైదరాబాదును అంతర్జాతీయ స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించే నగరంగా, పర్యావరణహితంగా, సమగ్ర, సుస్థిర, సమ్మిళిత అభివృద్ధి జరిగేలా అన్నిరకాల చర్యలు తీసుకుంటూ, అభివృద్ధి వేగం పెంచితేనే ప్రభుత్వం చెప్పిన ప్రజాపాలనకు అర్థం చేకూరుతుంది. •

ong-5_ong-5.qxd 6/8/2026 11:23 PM Page 1



# యోగాతో మానసిక ప్రశాంతత: కలెక్టర్ పి.రాజాబాబు



**ఒంగోలు, ప్రభాతవార్త**

యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా చేస్తున్న యోగా సాధనలో భాగంగా సోమవారం ప్రకాశం భవనం ఎదురుగా ఉన్న రోడ్డులో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందుకోసం తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ స్వయంగా నడుచుకుంటూ వచ్చారు. యోగాసనాలు వేసి, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజల్లో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రజలందరూ యోగాసాధన చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రకాశం జిల్లాలోనూ గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు 15 రోజుల పాటు ఇలాంటి సాధన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యోగా భారతదేశంలో పుట్టి, ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన కళ అని చెప్పారు. ఆరోగ్యకరంగా, సాత్వికంగా ఉండేందుకు యోగా చక్కని మార్గమని అన్నారు. దీనిని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఆర్ఓ మాధురి, జడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీవో వెంకటేశ్వరరావు, డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకట కృష్ణయ్య, ఆయుష్ విభాగ సీనియర్ వైద్యులు భ్రమరాంబ, భీమ్ నాథ్, డీఎస్‌డీవో రాజరాజేశ్వరి, ఇతర అధికారులు, పతంజలి యోగ సంస్థ గురువులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కాగా, 45 నిమిషాల పాటు చేస్ కామన్ యోగా ప్రొటోకాల్‌ను తెలిపే



పోస్టర్‌ను మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ఇతర అధికారులు ఆవిష్కరించారు.


ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త


# ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించం: కలెక్టర్

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



మీకోసం, స్పెషల్ గ్రీవెన్స్, పల్లె నిద్ర కార్యక్రమాల ద్వారా జిల్లా యంత్రాంగం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్న నేపథ్యంలో వాటి పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోనని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు స్పష్టం చేశారు. సోమవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీ ప్రభుత్వంపై వారు ఉంచిన నమ్మకానికి ప్రతీక అని అన్నారు. అందువల్ల ప్రతి శాఖ అధికారి అర్జీలను అత్యంత బాధ్యతతో పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు ప్రతి రోజూ ఆన్‌లైన్ లో పరిశీలించాలని, పెండింగ్‌లో ఉన్న వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, జిల్లా యంత్రాంగం కూడా అదే దిశగా పనిచేస్తోంద న్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డీఆర్ఓ మాధురి, జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీఓ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధిత శాఖలకు అప్పగించి త్వరితగతిన పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పాలన అందించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు.

# గాదె వెంకటరెడ్డికి ఎంపీ మాగుంట నివాళులు

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో మాజీ మంత్రి కి.శే గాదె వెంకటరెడ్డి పెద్దకర్మ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మాజీ టీడీపీ బోర్డు చైర్మన్ కనుమూరి బాపిరాజులు పాల్గొన్నారు. గాదె వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బంగారురెడ్డి, బెల్లం సత్యం తదితరులు ఉన్నారు.

**పాత సింగరాయకొండ బావిలో లభ్యమైన మృతదేహం..** 6లో..

- హైదరాబాద్‌లో బీటెక్ విద్యార్థి రాహుల్‌గా గుర్తింపు

## అడుగడుగునా లోపాలు...
# అభాగ్యులకు శాపాలు..
### - భద్రత కల్పించలేని భద్రతా వారోత్సవాలు

**బల్లికురవ, జూన్ 8, ప్రభాతవార్త**



గడచిన 22 సంవత్సరాలుగా భద్రత వారోత్సవాలు జరుపుకొని, ప్రస్తుతం 23వ గనుల భద్రత వారోత్సవాలు నేటి నుండి ఆరంభం అయ్యాయి. ప్రారంభ ఆర్భాటాలు, అధికారుల ప్రసన్నతల కోసం హంగామా చేయటం, ఒక వారం రోజులు పాటు ట్రేడ్ పరీక్షలు నిర్వహించటం, మరో వారం రోజులు పాటు గనులలో నిర్వహించడం. ముగింపు రోజున అందరినీ సంతృప్తి పరిచే రీతిలో యాజమాన్య ప్రతినిధులు తమదైన శైలిలో పురస్కారాలు కొనసాగుతాయి. గడిచిన 22 సంవత్సరాలుగా గనుల భద్రత వారోత్సవాలు జరిగిన తీరు అదే, ప్రస్తుతం జరగబోయేది అదే. గనులలోని కార్మికులకు కానీ, ఉద్యోగులకు కానీ అదనంగా సమకూరే సౌకర్యాలు మాత్రం షరా మామూలే. హవాయి చెప్పులు, నెత్తి మీద టోపీ. కానీ గనుల చట్టం 1952లో చట్టం నెంబర్ 35 కొన్ని కీలక శాసనాలు చేసింది. గనులలో పని చేసే వ్యక్తుల ఆరోగ్యం భద్రత సంక్షేమం నిర్వహించే ఉద్దేశంతో ఈ చట్టాన్ని అమలు చేశారు. ఈ కనుల చట్టాన్ని 88 సెక్షన్లగా విభజించారు. నిర్దిష్ట పని గంటల విధానం ఒక్క గనిలోనూ అమలు కాదు. మోలిక వసతుల కల్పన, ప్రమాదాల నివారణ, వైద్య సంరక్షణలు, మచ్చుకైన కానరావు. గనులలో పని చేసే వ్యక్తులను కాపాడటానికి చట్టపరమైన రక్షణల ఆవశ్యకత నిరంతర ప్రక్రియగా చెబుతున్నప్పటికీ అది ఆచరణకు మాత్రం నోచుకోదు. పర్యావరణ అనుమతులు కోరుతూ నిర్వహించే గ్రామ సభలను సైతం గుట్టు చప్పుడు కాకుండా తమ అనుకూలమైన వ్యక్తులతో నిర్వహించటం ఆనవాయితీగా మార్చుకున్నారు. అనుక్షణం ప్రమాదాలతో సహవాసం చేస్తూ, పరాయి రాష్ట్రాల నుండి వలస వచ్చిన కూలీల, బ్రతుకులు కొన్ని సందర్భాలలో తెల్లారిపోతున్నాయి. కిరా నైట్ వ్యర్థాలతో ఏర్పాటు చేసిన కృత్రిమ కొండలు నివాస గృహాల నడుమ ఉండటం, ఆ పక్కనే ఉన్న రహదారిలోనే దైనందిక జీవితంలో ప్రజలు ప్రయాణించటం వారి అవసరాలను తెలియజేస్తుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు బండ పైన బండ పెట్టి ఏర్పాటుచేసిన కృత్రిమ కొండలు కిందకు జారితే, పక్కన ఉన్న నివాస గృహాల పరిస్థితి ఏమిటో ఒక్క అధికారైన ఆలోచించాడా. బల్లికురవ మండలంలో భక్తుల పాలిట కొంగుబంగారమై బాసిల్లుతున్న ఈర్ల గంగమ్మ తల్లి ఆలయం సిగ భాగాన డంపింగ్ దొర్లిస్తూనే ఉంటారు. భక్తులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా యాజమాన్యాలు పనులు ఆపాయా భగవంతునితో పరాచకాలు ఆడుతూనే ఉన్నారు. ఎవరు ఎలా పోతే, మాకేంటి అన్న చందంగా ఉంటుంది అధికారుల వ్యవహార శైలి. వస్తుంటారు, చూస్తుంటారు, పోతుంటారు, 22 సంవత్సరాలు జరిగింది ఇదే. 23 సంవత్సరం కూడా జరగబోయేది ఇదే.. ప్రభుత్వాలు అధికారులు చూస్తూ ఉండొచ్చు. భగవంతుడు కూడా ఒకే మొక్కలకు ఒక అడుగు వెనక్కు వేయొచ్చు. అన్ని చూస్తున్న ప్రకృతి మాత్రం వీరందరిలా చూస్తూ ఊరుకోదు. తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. గాలి జనార్దన్ రెడ్డి కంటే గొప్పవారు కాదు కదా. ప్రభుత్వాలు చూస్తూ ఊరుకున్నా, సుంకులమ్మ తల్లి ఏం చేసిందో తెలుసు కదా. ధనం మత్తులో భగవంతునితో పరాచకాలు ఆడితే ప్రకృతి కచ్చితంగా సమాధానం చెబుతుంది. అప్పుడు చేసేది చూసేది ఏమీ ఉండదు.

# ప్రజలవద్దకు పాలన తీసుకొచ్చే సంస్కరణలో భాగమే ప్రజాదర్బార్

**- గొట్టిపాటి లక్ష్మీ**



**ముండ్లమూరు, జూన్ 8, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన ముండ్లమూరు ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా దర్బార్‌లో దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో అద్దంకి ఆర్డీవో విజయజ్యోతి, రెవెన్యూ, ఎలక్ట్రికల్, పంచాయతీ రాజ్, ఎంఎ డీవో, హౌసింగ్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుండి రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా వినతులు వచ్చాయని డాక్టర్ లక్ష్మీ తెలిపారు. రెవెన్యూ అధికారులు రైతులను ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పవద్దని చిన్న చిన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వచ్చే ప్రజా దర్బార్ జరిగే లోపు సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారులను కోరారు. కొత్త పెన్షన్ల కోసం వందల అర్జీలు పెట్టుకున్నారని త్వరలో అర్హులైన వారందరికి కొత్త పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మనం ముండ్లమూరు మండలంలో లక్షలాది రూపాయలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. మిగిలి ఉన్న సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాటర్ ట్యాంకు అవసరమని కూడా ఒక వినతి అందిందని సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు వెంటనే అందుకు సంబంధించిన అంచనాలు రూపొందించాలని ఆదేశించా మన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నుండి ప్రజలు, మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, జనసేన మండల పార్టీ అధ్యక్షులు తోట రామారావు, మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ నాయకులు, కూటమి శ్రేణులు హాజరయ్యారు.








































6:6.qxd 6/8/2026 11:31 PM Page 1



## పాత సింగరాయకొండ బావిలో లభ్యమైన మృతదేహం

- హైదరాబాద్‌లో బీటెక్ విద్యార్థి రాహుల్‌గా గుర్తింపు
- మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తు రీ పోస్ట్ మార్టం చేయాలనీ కుటుంబ సభ్యులు డిమాండ్
- ర్యాగింగ్ అనుమానాలు.. రాహుల్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు
- వందల కిలోమీటర్ల దూరంలో రాహుల్ మృతి.. మిస్టరీ ఛేదనకు పోలీసుల దర్యాప్తు
- ఈ మృతదేహం రాహుల్‌దేనా? డీఎన్ఏ పరీక్షలతో తేల్చనున్న పోలీసులు







**సింగరాయకొండ,జూన్ 8, ప్రభాతవార్త**
మండలంలోని పాత సింగరాయకొండ గ్రామంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన పూలతోటలోని వాడుకలో లేని బావిలో ఇటీవల లభ్యమైన గుర్తుతెలియని యువకుడి మృతదేహం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. హైదరాబాద్ లో అదృశ్యమైన బీటెక్ విద్యార్థి రాహుల్‌గా మృతుడిని కుటుంబ సభ్యులు గుర్తించినప్పటికీ, డీఎన్ఏ పరీక్షల అనంతరమే పూర్తి నిర్ధారణకు వచ్చే అవకాశముందని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రాహుల్ హైదరాబాద్ లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మే 27న ఇంటికి వెళ్తున్నానని చెప్పి స్నేహితుడు బైక్ మీద కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు నాలుగు రోజులైన ఇంటికి రాకపోతే అంత గాలించి ఎక్కడ ఆచూకీ కనపడక పోవడంతో మే 31 కాచిగూడ పోలీస్ స్టేషన్ లో తండ్రి రాజేష్ పిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు.దీనితో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రైల్వే స్టేషన్ లో శబరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించినట్లు సీసీటీవీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. ఇదిలా ఉండగా,మే 30న సింగరాయకొండలోని స్వామివారి తోటబావిలో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభించింది. మృతుడి వద్ద ఉన్న ఎర్రటి టీషర్ట్, మెడలోని ఆంజనేయస్వామి లాకెట్ తదితర ఆధారాలను పోలీసులు సోషల్ మీడియా, పత్రికల ద్వారా ప్రచారం చేశారు.ఈ సమాచారం రాహుల్ కుటుంబ సభ్యులకు చేరడంతో వారు సింగరాయకొండకు వచ్చి ఆధారాలను పరిశీలించి మృతుడిని తమ కుమారుడిగా గుర్తించారు.సోమవారం తెలంగాణ, సింగరాయకొండ పోలీసులు కుటుంబ సభ్యులతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహం లభ్యమైన బావితో పాటు ఖననం చేసిన ప్రదేశాన్ని కూడా వారికి చూపించారు.

### ర్యాగింగ్ కోణంపై కుటుంబ సభ్యుల అనుమానం

రాహుల్ తండ్రి అంకం రాజేష్ మాట్లాడుతూ, తన కుమారుడు హాస్టల్ నుంచి అదృశ్యమైన తర్వాత మిస్సింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. వందల కిలోమీటర్ల దూరంలోని సింగరాయకొండకు రాహుల్ ఎలా చేరుకున్నాడనే విషయంపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు.ఇది ఆత్మహత్యా, హత్యా అన్నది తేల్చాలని, కాలేజీలో ర్యాగింగ్‌కు సంబంధించిన అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని పోలీసులను కోరారు.

### అన్ని కోణాల్లో దర్యాప్తు

సీఐ శ్రీహరి మాట్లాడుతూ, మే 30న బావిలో గుర్తించిన మృతదేహాన్ని యువనేస్తం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం, ఫోరెన్సిక్ అనంతరం ఖననం చేసినట్లు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ఆధారంగా ప్రచారం చేయడంతో కుటుంబ సభ్యులు స్పందించారని చెప్పారు.మృతదేహం వద్ద లభించిన టీషర్ట్, లాకెట్ తదితర వస్తువులను కుటుంబ సభ్యులకు చూపించగా, వారు రాహుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. అయితే పూర్తి నిర్ధారణ కోసం కుటుంబ సభ్యుల డీఎన్ఏ నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థి మృతికి గల కారణాలపై ఆత్మహత్య, హత్యతో పాటు ఇతర అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోందని, విచారణ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.


## ఘనంగా జాతీయ ఉత్తమ స్నేహితుల దినోత్సవం



**పొదిలి, జూన్ 8, ప్రభాతవార్త**
పొదిలి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో జాతీయ ఉత్తమ స్నేహితుల దినోత్సవం నవ్వులు పువ్వుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. నవ్వులు పువ్వులు సంఘం మిత్రులు శుభాకాంక్షలు ఒకరికి ఒకరు ఘనంగా తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ మదార్ వలి మాట్లాడుతూ స్నేహం అనేది రెండు హృదయాల మధ్య ఉండే ఒక అందమైన వారధి అని, వంద మంది స్నేహితులు ఉండటం కంటే 100 సమస్యలు తీర్చే ఒక మంచి మిత్రుడు ఉండటం గొప్ప అన్నారు. సంఘంలో సీనియర్ సభ్యులు గోవిందయ్య మాట్లాడుతూ మంచి మిత్రులు అనే వారు అన్ని కులాలలో ఉంటారని, మా సంఘంలో అన్ని కులాల మిత్రులు కలిసిమెలిసి ఉంటున్నామని, అన్ని విషయాలు ఒకరికి ఒకరు పంచుకొని కలిసి మెలిసి ఉంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాషా మొహిద్దీన్, ఘంటా జలాని, మీరావలి, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.


## ఎమ్మెల్యే ఏలూరి చొరవతో చెరువులకు సాగర్ జలకళ

- పర్చూరు నియోజకవర్గంలో జలకళ
- తాగునీటి సమస్యకు ముందస్తు పరిష్కారం



**మార్టూరు, జూన్ 8, ప్రభాతవార్త**
నిండు వేసవిలో చెరువులు సాగర్ జలాలతో జలకళను సంతరించుకున్నాయి. నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేపట్టిన ప్రత్యేక చర్యలు ఫలిస్తున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలైన జలాలు నియోజకవర్గంలోని చెరువులను చేరడంతో పలు గ్రామాల్లో నీటి వనరులు పునరుజ్జీవం పొందుతున్నాయి. ఇప్పటికే ఎక్కువ శాతం చెరువులు నిండగా, మిగిలిన వాటిని కూడా మరో నాలుగు నుంచి ఐదు రోజుల్లో పూర్తి స్థాయిలో నింపేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. వేసవి కాలంలో మంచినీటి సమస్య తలెత్తే అవకాశాలను ముందుగానే గుర్తించిన ఎమ్మెల్యే ఏలూరి, నీటి విడుదల అంశాన్ని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఆయన చొరవతో ఎన్ఎస్పీ కాలువల ద్వారా సాగర్ జలాల విడుదలకు మార్గం సుగమమైంది.నాగార్జున సాగర్ ప్రాజెక్టు వైస్ చైర్మన్ చక్రపాణి పర్యవేక్షణలో మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చిన్నగంజాం, మండలాల పరిధిలోని చెరువులను ప్రణాళికబద్ధంగా ఎన్ఎస్పీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నింపుతున్నారు. చెరువుల్లోకి సాగర్ జలాలు చేరడంతో భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశాలున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు మరింత భరోసా ఏర్పడుతోంది.చెరువుల నింపుడు ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఎక్కడా ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి నీటి ఎద్దడి లేకుండా మంచినీరు అందేలా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. చెరువులన్నీ నిండే వరకు పర్యవేక్షణ కొనసాగుతుందని, నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. సాగర్‌జలాలతో చెరువులు కళకళలాడుతుండడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ముందస్తు ప్రణాళికతో చేపట్టిన చర్యల ఫలితంగా ఈ ఏడాది తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టారు.

## నిర్మాణంలో ఉన్న గృహంలో టైల్స్ పగుల గొట్టిన దుండగులు



**రాచర్ల, జూన్ 8 ప్రభాతవార్త**
మండలంలోని పలుగుంటిపల్లె గ్రామంలో గుర్తు తెలియని దుండగులు నిర్మాణంలో ఉన్న గృహంలో టైల్స్ పగులగొట్టిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన ఏరువ భాస్కర్ రెడ్డి నూతన గృహ నిర్మాణం చేపట్టి టైల్స్ వేసే వరకు పనులు పూర్తి చేశారు. ఇదిలా ఉండగా ఎవరో వ్యక్తులు కావాలని దురుద్దేశపూర్వకంగా రాత్రి సమయంలో గృహంలో ప్రవేశించి టైల్స్ పగలగొట్టారని రెండు లక్షల రూపాయల మేర నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. ఈ విషయంపై రాచర్ల పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు ఏరువ భాస్కర్ రెడ్డి తెలిపారు.

## శ్రీకామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామిని దర్శించుకున్న డాక్టర్ బోయళ్ల విష్ణువర్ధన్‌రెడ్డి



**సీఎస్‌పురం, జూన్ 8, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన సీఎస్‌పురంలోని అతి పురాతన శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో(శివాలయం) రాజగోపురం నిర్మాణ దాత టీడీపీ నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి కుమారుడు డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.సందర్భంగా దేవస్థానం అర్చకులు గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ నాయుడు నారాయణ, సీఎస్‌పురం మాజీ ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, మాజీ నీటి సంఘం అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, జర్నలిస్టు ఎస్పీ నాయుడు, సంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్వోలు, వీఆర్ఏలపై పనిభారం తగ్గించాలి



**చీరాల, జూన్ 8, ప్రభాతవార్త**
వీఆర్వోలు, వీఆర్ఏలపై పని భారం తగ్గించాలని వీఆర్వోల సంఘం ప్రధాన కార్యదర్శి షేక్‌మునీర్ తెలిపారు. సోమావారం ఇందుకు సంబంధించి వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్‌కు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు చెందిన వీఆర్వో హుస్సేన్ అధికారుల ఒత్తిడి, పనిభారం వలన బలవన్మరణానికి పాల్పడడం జరిగిందని, వీఆర్వోలు,వీఆర్ఏలపై పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు దానియేలు,కళ్యాణ్, రాధికా,చెంచుపున్నమ్మ, సత్యనారాయణ, నాగేశ్వరరావు, నాగరాజు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆర్డీవోకు వినతి



**చీరాల, జూన్ 8, ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షులు మువ్వల వెంకటరమణారావు, జిల్లా జనతా వారధి కన్వీనర్ కోక్కిలిగడ్డ శ్రీనివాసరాజు సూచన మేరకు చీరాలలో భారతీయ జనతా పార్టీ, జనత వారధి కార్యక్రమంలో భాగంగా గీత కార్మికుల సమస్యల మీద అభ్యున్నతకై ఆర్డీవో కి అర్జీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనతా వారధి చీరాల రెవెన్యూ డివిజన్ కన్వీనర్ డాక్టర్ తాడివలస దేవరాజు, కో కన్వీనర్ దామిశెట్టి శ్రీనివాస్ గుప్తా, మేడికొండ భవరణిరావు, ఆవ్వారు హనుప్రసాద్, కాకరపర్తి సత్యవతి, క్షత్రియ సుహాసిని, రావు జగదీష్, మున్నెం శ్రీనివాసరెడ్డి, జగదీష్, తడవర్తి చంద్ర, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం



**మార్కాపురం, జూన్ 8, ప్రభాతవార్త**
జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కాపురం నియోజకవర్గ స్థాయిలో గత నాలుగు వారాలుగా నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో అందిన అర్జీలను నూరుశాతం పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే నాలుగు వారాల కార్యక్రమాల్లో వచ్చిన పెండింగ్ అర్జీలను మరో వారం రోజుల్లోగా పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 161 అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించిన 82 అర్జీలు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే లక్ష్యంతో మార్కాపురం నియోజకవర్గంలో నాలుగు వారాల పాటు నాలుగు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అలాగే త్వరలో ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలో కూడా నెలరోజుల పాటు నాలుగు వారాల వ్యవధిలో నాలుగు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి శివరామిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనీష్, జిల్లా పంచాయతీ అధికారి బాలు నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ అబ్దుల్ కరీం, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ మోహన్‌రావు, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత ఆయుర్వేద భోజనం ఏర్పాటు





**గిద్దలూరు, జూన్ 8 ప్రభాతవార్త**
గిద్దలూరు పట్టణంలోని శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమం నందు ప్రతి సోమవారం పేదల కోసం భోజనం ఏర్పాటు చేస్తున్న విషయం అందరికీ తెలిసినదే.ఉదయం స్వామి వారికి అభిషేకం పూలమాలతో నూతన వస్త్రాలతో అలంకరణ చేశారు పూజలో పాల్గొన్న భక్తులకు పేదలకోసం అర్థవీడు మండలం బోగోలుగ్రామానికి చెందిన చేగిరెడ్డి మహాలక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు భర్త చేగిరెడ్డి రామచంద్రారెడ్డి, చెగిరెడ్డి పోతిరెడ్డిలు భోజనం ఏర్పాటు చేశారు. భోజన ఏర్పాటు చేసిన దాతలకు కాశి నాయన పటము శాలువ పూలమాలతో స్వామి వారి తీర్థప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించామని యోగా టీచర్, బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు తెలిపారు.ప్రతి సోమవారం దాతలు సహకరిస్తున్నందుకు కాశినాయన తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజులలో కూడా దాతలు ముందుకు వచ్చి కాశినాయన ఆశ్రమం దగ్గర భోజనం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సూపరెన్టెంట్ పాలుగుల్ల కాశిరెడ్డి, విశ్రాంత లెక్చరర్ వడ్డి వీరారెడ్డి, విశ్రాంత ఆర్మీ లింగారెడ్డి, ఏరువ రమణారెడ్డి, విశ్రాంత బిఎస్ఎన్ఎల్ అధికారి పోలయ్య, రంగారెడ్డి పల్లె బాలరాజు, విశ్రాంత సర్వేయర్ రెడ్డి, మల్లారెడ్డి, కాశినాయన భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లూరి రామయ్య మృతికి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, దారపనేని, బైరెడ్డి





**పామూరు, జూన్ 8, ప్రభాతవార్త**
కనిగిరి నియోజవర్గం పామూరు మండలం తూర్పు కోడిగుడ్లపాడు ఎస్సీ కాలనీ వాసులు సీనియర్ టీడీపీ నాయకులు,మాజీ ఎమ్మెల్యే ఇరిగినేని తిరుపతి నాయుడు ముఖ్య అనుచరులు తాళ్లూరి రామయ్య మృతి పట్ల కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డిలు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ మా తండ్రి కి.శే మాజీ సర్పంచ్ దారపనేని పోతయ్యకు సుమారు 40 సంవత్సరాలు సర్పంచ్‌గా గెలిపించిన ఘనత రామయ్యకే దక్కుతుందని, అలాగే మా అమ్మ మాజీ సర్పంచ్ దారపనేని భూమమ్మను, నన్ను గ్రామ సర్పంచ్‌గా గెలిపించిన ఘనత రామయ్యకే దక్కుతుందని అలాగే ఎంపీటీసీలుగా, మాజీ ఎంపీటీసీ డబ్బుకొట్టు ఆదిలక్ష్మమ్మ, చెనికల వెంగమ్మ, చెనికల పెద్ద మాలకొండయ్యలను ఎంపీటీసీలుగా గెలిపించిన ఘనత రామయ్యకే దక్కుతుందని అలాగే మాకు గ్రామంలో 60సంవత్సరాల నుండి మా కుటుంబ సభ్యుడిగా, మా వర్గానికి వెన్నంటి ఉంటున్న రామయ్య లేని లోటు తీర్చలేనిదని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అంతే కాకుండా రామయ్య కుటుంబానికి వెన్నంటి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి కుమారులు తాళ్లూరి పాములయ్య, నగేష్, సురేష్, తాళ్లూరి కృపయ్య, కన్నయ్య, జయ రాములు, రాజ్ కుమార్, ప్రభుదాసు, తాతపూడి ఇమ్మానియేల్, నరసింహులు, తాళ్లూరి వారి కుటుంబ సభ్యులు, తాతపూడి వారి కుటుంబ సభ్యులు, ఏసుపోగు వారి కుటుంబ సభ్యులు, మనవళ్లు మనవరాళ్లు పలువురు బంధుమిత్రులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

## కావలి జోహార్ భారతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**టంగుటూరు, జూన్ 8, ప్రభాతవార్త**
రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంగం అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్‌బాబు, రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం ఉప అధ్యక్షులు స్వర్ణ నరసింహామూర్తి , కార్యనిర్వాహకులు కావలి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ అన్న,కావలి డివిజన్ అధ్యక్షులు జయప్రకాష్, నాయకులు, రాష్ట్ర మాలల జేఏసీ అధికార ప్రతినిధి పిల్లి మాల్యాద్రి, జేఏసీ యువత విభాగం నాయకులు కే.రాజు పెద్ద ఎత్తున మూడు జ ఇల్లాల జేఏసీ నాయకులు, ఉద్యోగస్తులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు.

## గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్





**సింగరాయకొండ, జూన్ 8, ప్రభాతవార్త**
కొండేపి నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ మంత్రి, కొండేపి నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ పిలుపునిచ్చారు.మండల కేంద్రంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయిబూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏ) ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)పై శిక్షణ,అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్,కొండేపి నియోజకవర్గం పరిశీలకులు షంషీర్ అలీ బేగం,సంతనూతలపాడు పరిశీలకులు బొట్లా రామారావు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాజీవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ బూత్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంతో పాటు ఓటర్ల జాబితాలో పార్టీ అనుకూల ఓట్లు తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామ స్థాయి కమిటీలను మరింత చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.అనంతరం వైసీపీ అధ్యక్షులు వై. యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తైన సందర్భంగా "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని నాయకులు ఆరోపించారు. నిరసనలో భాగంగా నల్ల కండువాలు వేసుకొని, బెలూన్లు ఎగురవేసి తమ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఆరు మండలాల పార్టీ అధ్యక్షులు సింగరాయకొండ మసనం వెంకట్రావు,టంగుటూరు చింతపల్లి హరిబాబు, జరుగుమల్లి పిన్నిక శ్రీనివాసరావు, కొండేపి బచ్చల కోటేశ్వరరావు, పొన్నలూరు దుద్దుగుంట మల్లికార్జున రెడ్డి, మర్రిపూడి ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు,బి.ఎల్.ఓలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

- చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో వైఎస్సార్‌సీపీ నిరసన






**కనిగిరి, జూన్ 8, ప్రభాతవార్త**
ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ పిలుపు మేరకు సోమవారం కనిగిరిలోని పార్టీ కార్యాలయంలో చంద్రబాబు మోసాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమంలో భాగంగా పార్టీ నాయకులు,కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నల్ల బెలూన్లను ఎగరవేసి నిరసన తెలిపారు. అనంతరం దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగభృతి, ఆడ బిడ్డ నిధి, వివిధ వర్గాల సంక్షేమ పతకాల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ ధరలు అధికంగా ఉన్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కూటమి పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తలు అధైర్య పడవద్దని, పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామాలు, వార్డుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి భవిష్యత్తు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి , గుంటక తిరుపతిరెడ్డి, గంగసాని లక్ష్మీ, మాజీ ఎంపీపీ గాయం సావిత్రి, మాజీ వైస్ చైర్మన్ పులి శాంతి, చింతకుంట్ల సాల్మన్ రాజు,గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, గూడూరి అబ్రహం లింకన్, సిరుప గోవర్ధన్‌రెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, బత్తుల మాలి, పల్నాటి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్య స్క్రీనింగ్ ఆధునిక సాంకేతికతపై అవగాహన కార్యక్రమం



**గుడ్లూరు, జూన్ 8, ప్రభాతవార్త**
గుడ్లూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సున్నా నుండి ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షించేందుకు ఏఐ ఆధారిత స్క్రీనింగ్ విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడమైంది. ఈ కార్యక్రమానికి గుడ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్యరెడ్డి మాట్లాడుతూ సున్నా నుండి మూడు సంవత్సరాల్లో పిల్లల్లో మెదడు 80శాతం ఎక్కువగా పెరుగుతుందని తెలియజేశారు. ఈ వయసులో పిల్లలు తగిన ఎదుగుదల లేకపోతే తల్లులు ఎలా గుర్తించాలి, పిల్లలకి ఏఏ రకాలు వ్యాధులు వస్తాయి, ఆ వ్యాధులని ఎలా గుర్తించాలి అని కార్యకర్తలకు వివరించి చెప్పారు. అలాగే సూపర్‌వైజర్స్ మాట్లాడుతూ సున్నా నుంచి ఆరు సంవత్సరాల్లో పిల్లలు యాప్‌లో ఎలా గుర్తించాలి వాళ్ళ అభివృద్ధిని తల్లికి ఎలా వివరించాలి, ఆ బిడ్డ వయసుకు తగ్గట్టుగా ఎదుగుతుందా లేదా అని బిడ్డని స్క్రీనింగ్ చేసే ఫిదా విధానాన్ని తెలియజేశారు. సున్నా నుండి మూడు సంవత్సరాల బిడ్డలు ఎక్కువగా ఇంటి దగ్గరే ఉంటారు, కాబట్టి వారు వయసుకు తగ్గట్టుగా ఎదుగుతున్నారో లేదో గృహ సందర్శనాలు చేసి ఆ బిడ్డ పరిస్థితిని ఆ యాప్‌లో గుర్తించాలి అని తెలియజేశారు.ఆ యాప్‌లో గుర్తించిన బిడ్డలు ఏమైనా అభివృద్ధి లోపాలు జరిగి ఉంటే ఆ సమస్యలని పరిష్కరించడానికి డాక్టర్ సలహాలు తీసుకొనివారి ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచుకోవడానికి తోడ్పడుతుందని తెలియజేశారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం




**తాళ్లూరు,జూన్ 8,ప్రభాతవార్త**
యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసికప్రశాంతతను కూడా సాధించవచ్చని యోగా మాస్టర్‌లు ఎన్. చిరంజీవి, శివారెడ్డి లు చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని గుంటి గంగభవాని ఆలయ ఈవో నర్రానారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్యానంద అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆలయంలో సోమవారం యోగాసన కార్యక్రమాలు ప్రారంభించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21 తేది వరకు ప్రతిరోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.యోగా మంచి ఆరోగ్యాన్ని అందిస్తుందన్నారు. యోగా మాస్టర్‌లు సూర్యనమస్కారాలు,ఆసనాలు వేయించి ప్రాణాయామం చేయించారు. కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ కాటూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపల్ ఆఫీస్‌లో గ్రీవెన్స్



**కందుకూరు జూన్ 8, ప్రభాతవార**
పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమీషనర్ అనూషా ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ తలమంచి బ్రహ్మయ్యతోపాటు పలువురు అర్జీదారులు పలుసమస్యలపై వినతిపత్రాలు అందచేశారు.పారిశుద్యం,డ్రైనేజి,ఆక్రమణలు తదితర సమస్యలుపై వినతిపత్రాలును అందచేశారు.ఈ సందర్భంగా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు.

## ఆరోగ్యజీవితానికి యోగా - ఎమ్మెల్యే



**కందుకూరు జూన్ 8, ప్రభాతవార**
ఆరోగ్యకరజీవితానికి యోగా అవసరమని స్దానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం ఆయన యోగాంధ్ర కార్యక్రమంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద యోగా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగాపాల్గొని యోగా చేయడం వలనే ప్రధాని మోడీ,సీఎం చంద్రబాబు ఏడు పదులవయస్సులో సైతం ఆరోగ్యకరంగా ఉన్నారన్నారు.వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ యోగాను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ దామెరహిమవంశీ,మున్సిపల్ కమిషనర్ అనూష,ఏపీఎం సురేష్‌తో పాటు పలువురు అధికారులు టీడీపీ నేతలు పాల్గొని యోగాసనాలు వేశారు.

7:7.qxd 6/8/2026 11:30 PM Page 1



# మార్కాపురం వార్త



## త్రిపురాంతకం పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల తనిఖీ

- పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, ప్రస్తుత స్థితిగతులపై ఆరా
- పలు రికార్డుల పరిశీలన,సాంకేతిక పరిజ్ఞానంతో నేర పరిశోధన నేర నియంత్రణకు కృషి
- మహిళలు, చిన్నారులు, వృద్ధులపై నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- మార్కాపురం జిల్లా పోలీస్ శాఖ ప్రజా భద్రత, సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేస్తోంది
- మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు



**త్రిపురాంతకం, జూన్ 8, ప్రభాతవార్త**
త్రిపురాంతకం పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల పనితీరు, సిబ్బంది నిర్వహణ, మౌలిక సదుపాయాల స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్,సర్కిల్ కార్యాలయాల పరిసరాలు, కార్యాలయ గదులు, రిసెప్షన్ కౌంటర్, నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లు, ఫైళ్లు, ఇతర రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలోని నేరాలు, శాంతిభద్రతల పరిస్థితి, ఎక్కువగా నమోదవుతున్న కేసులు, వారు నిర్వహిస్తున్న విధులు తదితర అంశాలపై ఆరా తీశారు. కేసుల దర్యాప్తులో నాణ్యతను పెంపొందిస్తూ (క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్) విచారణలను వేగవంతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో భాగంగా బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు వంటి రద్దీ ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పెంచాలని, వాహనాల తనిఖీలు నిర్వహించాలని, అనుమానిత వ్యక్తులను గుర్తించి విచారించాలని సూచించారు. చెడునడత గల వ్యక్తులు, పాత నేరస్థులపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఇంకా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను త్వరితగతిన డిస్పోసల్ చేయాలన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటైన అనంతరం ప్రజలకు మరింత చేరువగా ఉండే విధంగా జిల్లా పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తోందని మార్కాపురం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు తెలిపారు.ప్రజలసమస్యలను సత్వరంగా పరిష్కరించడం, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలలో భద్రతా భావన పెంపొందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

**విజిబుల్ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తున్నాం :**
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు, ప్రతి పోలీస్ అధికారి ప్రజా సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా గొడవలు, వివాదాలు, కొట్లాటలు వంటి సమస్యలను చట్టబద్ధంగా, త్వరితగతిన పరిష్కరించే దిశగా పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. మహిళలు, బాలికల భద్రత మరియు రక్షణ పోలీస్ శాఖ ప్రథమ ప్రాధాన్యత అని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, పాఠశాలలు మరియు కళాశాలల్లో విద్యార్థినులకు వివిధ చట్టాలు, వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాల నివారణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ప్రతి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, చట్టాలు, శిక్షలపై అవగాహన వంటి అంశాలపై ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రజల సమస్యలకు వెంటనే స్పందించి పరిష్కారం అందించే విధంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని,శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు కూడా పోలీస్‌శాఖకు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు, ఎస్పీ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్ పి ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, త్రిపురాంతకం సిఐ అస్సాన్,యర్రగొండపాలెం ఎస్సై దేవకుమార్, త్రిపురాంతకం ఎస్ఐ శివరామయ్య మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ ఎంసీపీలకు త్వరితగతిన రుణాలు

- మహిళల ఆర్థిక సాధికారతకు బ్యాంకులు చొరవ చూపాలి
- పీడీ శివన్నారాయణ




**మార్కాపురం, జూన్ 8, ప్రభాతవార్త**
మార్కాపురం జిల్లా డీఆర్‌డీఏ-వెలుగు ఆధ్వర్యంలో యాన్యువల్ క్రెడిట్ లైవ్లీహుడ్ ప్లాన్ (ఏసీఎల్పీ)లో భాగంగా బ్యాంకు లింకేజీకి సంబంధించిన పెండింగ్ ఎంసీపీల (మైక్రో క్రెడిట్‌ప్లాన్స్ )పై జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూబీఐ డీజీఎం రవికుమార్, ఏపీజీబీ రీజినల్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రామకృష్ణ, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ గౌరి, ఎస్‌బీఐ బజార్ బ్రాంచ్ మేనేజర్ శంకర్‌తో పాటు వివిధ బ్యాంకుల మేనేజర్లు, వెలుగు ఏపీఎంలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ శివన్నారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 6 వేల ఎంసీపీలకు ఆమోదం లభించినప్పటికీ వాటికి సంబంధించిన బ్యాంకు రుణాల మంజూరు, పంపిణీ ప్రక్రియ గణనీయంగా పెండింగ్‌లో ఉందన్నారు. మహిళా సంఘాల సభ్యులు వివిధ జీవనోపాధి కార్యక్రమాలను ప్రారంభించి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపి రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని సూచించారు.మహిళల ఆర్థిక సాధికారతకు బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, అర్హులైన మహిళా సంఘాలకు ఎలాంటి జాప్యం లేకుండా రుణాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకులు మరియు వెలుగు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సులభంగా అధిగమించవచ్చని తెలిపారు.దీనికి స్పందించిన బ్యాంకుల ఉన్నతాధికారులు మహిళా సంఘాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. బ్యాంకు మేనేజర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిని పరిశీలించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రాజెక్ట్ డైరెక్టర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్కే షాహీర్ మాట్లాడుతూ, నూతనంగా ఏర్పాటైన మార్కాపురం జిల్లాలోని అన్ని బ్యాంకులు, వెలుగు సిబ్బంది సమన్వయంతో పనిచేసి మహిళా సంఘ సభ్యుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిర్దేశించిన బ్యాంకు లింకేజీ లక్ష్యాలను అధిగమించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు.వర్క్‌షాప్‌లో బ్యాంకు లింకేజీ ప్రక్రియను వేగవంతం చేయడం, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, మహిళా సంఘాల జీవనోపాధి అవకాశాల విస్తరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమం మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వనుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆడపడుచులకు చీరల కానుకతో సాయి ప్రణవి జన్మదినం

- దద్దాల చారిటబుల్ ట్రస్టు సేవా కార్యక్రమం





**కనిగిరి, జూన్ 8, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పెద్ద కుమార్తె దద్దాల సాయి ప్రణవి జన్మదిన వేడుకలు సోమవారం స్థానిక పార్టీకార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.జన్మదిన వేడుకలను పురస్కరించుకుని దద్దాల చారిటబుల్‌ట్రస్టు ఆధ్వర్యంలో 100 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఆడపడుచులకు చీరల కానుక అందజేసి వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. సమాజంలోని ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతోఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. దద్దాల సాయి ప్రణవి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖంగా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. పేద ప్రజలకు చేయూతనిచ్చే ఇటువంటి కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దద్దాల సాయి ప్రణవికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

## ఎస్ఐఆర్‌పై శిక్షణ

**టంగుటూరు, జూన్ 8, ప్రభాతవార్త**
కొండపి నియోజకవర్గ టీడీపీ బూత్ , క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలకు ఎస్ఐఆర్‌పై శిక్షణ కార్యక్రమం సోమవారం జరిగింది. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం ఐటీసీ దగ్గర దామచర్ల సత్య కార్యాలయం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు.

## ప్రతిభా పురస్కారాల మహోత్సవం

- ఆర్యవైశ్య ముద్దుబిడ్డలకు ఘన సత్కారం
- కన్యకా పరమేశ్వరి ఆలయంలో మిన్నంటిన సంబరాలు

**కనిగిరి, జూన్ 8, ప్రభాతవార్త**
వాసవి వనితా తెలుగు తేజం సంస్థ ఆధ్వర్యంలో2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఆర్యవైశ్య విద్యార్థుల ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం కనులపండువగా జరిగింది. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అత్యంత వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి చన్నా సాయి కోమలదేవి నేతృత్వం వహించారు. చదువుల్లో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలిచిన చిన్నారులను,విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. తమ పిల్లల ప్రతిభకు దక్కిన గౌరవాన్ని చూసి తల్లిదండ్రులు ఉద్వేగానికి లోనయ్యారు. ఆలయ ప్రాంగణం అంతా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యుల కోలాహలంతో, సంతోషాలతో మిన్నంటింది.ఈ కార్యక్రమంలో గోనుగుంట లావణ్య, కొలిపర్తి,సుకన్య, కొప్పరపు పరమేశ్వరి, అంగులూరి రమ్య, బొగ్గరపు శ్రీలత, దేవకి ప్రసూన, దేవకి సత్యవతిలతో పాటు గోనుగుంట పవన్ కుమార్, ఎక్కలి అనంత్, గోనుగుంట అనిల్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.భావిభారత పౌరులుగా ఆర్యవైశ్య విద్యార్థులు దేశ గమనాన్ని మార్చాలని వక్తలు ఆకాంక్షించారు.



## కృతజ్ఞతలు సీఎం సార్



**పామూరు, జూన్ 8, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల సహాయ సంస్థ నుండి కనిగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో హీరో డెస్టినీ 125 మూడు చక్రాల స్కూటీ వాహనాన్ని చల్లూరి వేణు వారికి మంజూరు చేసిన వాహనాన్ని పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు ఇర్రి కోటిరెడ్డి, మండల టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పోక వినోద్, హీరో షోరూమ్ నిర్వాహకులు గోళ్ళ వీరబాబు,మండల టీడీపీ బీసీ నాయకులు మాండ్ల మల్లిఖార్జున తదితరులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## పచ్చదనమే ప్రగతికి బాట

- పచ్చదనం పెంపే లక్ష్యం
- మొక్కలు నాటి భవిష్యత్తును కాపాడుకుందాం
- జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత




**మార్కాపురం, జూన్ 8, ప్రభాతవార్త**
పర్యావరణ పరిరక్షణకు పచ్చదనమే ప్రగతికి బాట అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తును అందించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాలుగో రోజు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా కొనసాగించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడానికి పచ్చదనం పెంపు అత్యంత అవసరమని పేర్కొన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా, పచ్చగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనే ఉందన్నారు.జిల్లాలోని మండలాలు, గ్రామాల్లో విస్తృత స్థాయిలో మొక్కల నాటకాన్ని చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రకృతితో మమేకమై జీవించే వారికి మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యపరంగా అనేక ప్రయోజనాలు లభిస్తాయని వివరించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీవో ఎం. వెంకట శివరామిరెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎస్.కె. కరీం, వ్యవసాయ శాఖ జిల్లా ఇన్‌చార్జి బాలాజీ నాయక్, ఉద్యానశాఖ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఐసిడీఎస్ ఇన్‌చార్జి పీడీ పద్మావతి తదితర అధికారులు పాల్గొన్నారు.

## నేడు కంభం చెరువుకట్టపై యోగాంధ్ర 2026

- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయసునీత





**కంభం, జూన్ 08 ప్రభాతవార్త**
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కంభం పట్టణం చారిత్రాత్మక కంభం చెరువుకట్టపై నేడు మంగళవారం యోగాంధ్ర 2026 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, జాయింట్ కలెక్టర్ పులిశ్రీనివాసులు సిబ్బందితో కలిసి సోమవారం సాయంత్రం చెరువుకట్టపై ఏర్పాట్లను స్వయంగా .ఈ సందర్భంగా ఆమె యోగాంధ్ర ఏర్పాట్లు, చెరువు కట్ట పరిసరాలు వసతుల గురించి అధికారులతో చర్చించారు. యోగాంధ్ర కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు, అధికారులకు, నాయకులకు అన్నిరకాల సౌకర్యాలను కల్పించాలని సూచించారు. చెరువు కట్ట పరిసరాలను, చెరువు కట్ట వైశాల్యాన్ని డ్రోన్ కెమెరా సహాయంతో చూసి ఆమె పరిశీలించారు. యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు, అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. కలెక్టర్ విజయ సునీత వెంట పలు శాఖల అధికారులు, టిడిపి నాయకులు ఉన్నారు.

## ఫీజుల భారానికి చెక్.. అంగన్‌వాడీ వైపు అడుగులు

- అంగన్‌వాడీ పిలుస్తుంది - అవగాహన ర్యాలీ నిర్వహణ

**కనిగిరి, జూన్ 8, ప్రభాతవార్త**
కనిగిరి మండలం బల్లిపల్లి అడ్డరోడ్డు గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ పిలుస్తోంది అవగాహన ర్యాలీ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీకేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రుల కుపిలుపునిచ్చారు.ర్యాలీలో పార్వతి మాట్లాడుతూ రండి..అంగన్‌వాడీ పిలుస్తోంది, ఫీజులు ఎందుకు దండగ..అంగన్‌వాడీలు ఉండగా అనే నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోఆటలు,పాటలు, సృజనాత్మక కార్యక్రమాల ద్వారా నాణ్యమైన ప్రీ-స్కూల్ విద్య అందించడంతో పాటుపాలు,గుడ్లు, పౌష్టికాహార భోజనం,ఆరోగ్య సంరక్షణ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించి సర్టిఫికేట్లు కూడా అంద జేస్తున్నామని చెప్పారు.ఈ నెల 12న సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అనంతరం అడ్డరోడ్డు, తక్కెళ్ళపాడు గ్రామాల్లో పాఠశాలల్లో చేరే వయస్సు గల చిన్నారుల ఇళ్లకువెళ్లి తల్లిదండ్రులకు అంగన్‌వాడీ ల ప్రత్యేకతలను వివరించి, అడ్మిషన్లు చేయించా లని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్య కర్తలు శిరీష,శైలజ,హెల్పర్ నారాయణమ్మతో పాటుగ్రామస్తులు,తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

## సజ్జలతో అన్నా రాంబాబు భేటీ

- మార్కాపురం రాజకీయాలపై కీలక చర్చ



**మార్కాపురం, జూన్ 8, ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, మార్కాపురం పట్టణ అధ్యక్షుడు షేక్ సలీం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కాపురం నియోజకవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలు, కార్యకర్తలతో సమన్వయం, ప్రజా సమస్యలపై పార్టీ చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన చర్యలపై సజ్జల రామకృష్ణారెడ్డి పలు సూచనలు చేసినట్లు సమాచారం. అలాగే పార్టీ శ్రేణులు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించుకున్నట్లు తెలిపారు. ఈ భేటీ మార్కాపురం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకోగా,పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపిందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పేర్కొన్నాయి.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
- ప్రత్యేక పోలీసు మీ కోసం కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీ
- మీ కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్న పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు
- మీ కోసం కార్యక్రమంకు 36 అర్జీలు







**యర్రగొండపాలెం, జూన్ 8, ప్రభాతవార్త**
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు సోమవారం యర్రగొండపాలెంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం, ఇతర ప్రాంతాల నుండి వివిధ సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి యొక్క సమస్యల పూర్వపరాలను సమగ్రంగా అడిగి తెలుసుకొని, వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా ఎస్పీ ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీసుస్టేషన్ అధికారులతో మాట్లాడి ఈ కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి చట్ట ప్రకారం విచారణ జరిపి ఫిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని, ప్రజా ఫిర్యాదుల పట్ల నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కావున ఆ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై కూడా నివేదిక ఇవ్వాల్సిందిగా పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పోలీసు వ్యవస్థను ప్రజలకు మమేకం చేయడంలో భాగంగా ఈ ప్రత్యేక మీ కోసం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, యర్రగొండపాలెం పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు వారి సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసలు పడి మార్కాపురంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి రాకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ప్రజా ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తి స్థాయి విచారణ జరిపి సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భర్త/అత్తారింటి వేదింపులు, భూ, ఆస్తి వివాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవప్రభాకర్, త్రిపురాంతకం సీఐ అస్సం,పొదిలి సీఐ రాజేష్‌కుమార్, మార్కాపురం సీఐ అల్లాఫ్ హుస్సేన్, యర్రగొండపాలెం ఎస్సై దేవకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించిన దామచర్ల సత్య

**టంగుటూరు, జూన్ 8, ప్రభాతవార్త**
చంద్రగిరి నియోజకవర్గం దామినేడు వద్ద జరుగుతున్న కూటమి ప్రభుత్వ విజయోత్సవ సభ ఏర్పాట్లను రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్, జోనల్ కో ఆర్డినేటర్ దామచర్ల సత్య సోమవారం పరిశీలించారు.ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు పనబాక లక్ష్మీ,శాప్ చైర్మన్ అనిమిని రావి నాయుడు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు ఉన్నారు.



## ఎస్ఐఆర్ పక్రియలో బీఎల్‌ఏలదే కీలక పాత్ర

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**యర్రగొండపాలెం, జూన్ 8, ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు యర్రగొండపాలెం నియోజకవర్గంలో శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో బూత్ లెవల్ ఏజెంట్లకు(బీఎల్‌ఏలు) అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కేవీ రమణారెడ్డి బూత్ వింగ్ స్టేట్ సెక్రటరీ, బూత్ కమిటీ విభాగ రాష్ట్ర కార్యదర్శి, ప్రకాశం జిల్లా ఎస్ఐఆర్ పక్రియ టాస్క్‌ఫోర్స్ సభ్యులు పత్తి రవిచంద్ర పాల్గొని బీఎల్‌ఏలకి అవగాహన ఇచ్చారు. ఈ సందర్భంగా తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ(ఎస్ఐఆర్) పక్రియ అత్యంత కీలకమైందని అన్నారు. ప్రతి బీఎల్‌ఏ తమ పరిధిలోని ప్రతి ఓటరుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు ఎవరైనా అక్రమంగాఓటర్లను చేర్చేప్రయత్నాలు చేస్తే వెంటనే గుర్తించి అభ్యంతరాలు నమోదు చేయాలని తెలిపారు.రాబోయే నెలన్నర రోజుల పాటు బీఎల్‌ఏలు క్షేత్ర స్థాయిలో చురుకుగా పని చేసి ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ఓట్లు అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగ బద్ధమైన హక్కు అని, ఆ హక్కును కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రత్యర్థి పార్టీలు అక్రమాలకు పాల్పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండి ప్రతి అంశాన్నిపరిశీలించాలని కోరారు.పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పని చేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా చర్యలుతీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మండలవైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఏకులా ముసాలారెడ్డి, పట్టణ అధ్యక్షులు కాశీవిశ్వనాథ్, యర్రగొండపాలెం నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షులు గురిజేపల్లి మాజీ సర్పంచ్ పల్లెపోగు ఫిలిప్స్,గంగపాలెం మాజీసర్పంచ్‌రాగాల వెంకటయ్య, పాలుట్ల కరంతోట్ సురేష్ నాయక్, తమ్మడపల్లెఇలాకోటిశివారెడ్డి, ముఖ్య నాయకులు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

ong-8_ong-8.qxd 6/8/2026 11:23 PM Page 1



### రాష్ట్రంలో కృష్ణ గోదావరి కేజీ బెషన్‌లో ఉత్పత్తి అవుతున్న
## చమురులో రాష్ట్రానికి వాటా ఇవ్వాలి: వామపక్షల డిమాండ్



**అద్దంకి, జూన్ 8, ప్రభాతవార్త**
పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరల పెరుగుదలకు నిరసనగా 9వ తేదిన రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రాస్తారోకో నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అద్దంకి సుందరయ్య భవనంలో సిపిఐ, సిపిఎం పార్టీల ఉమ్మడి పత్రిక విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ, సిపిఎం పార్టీ నాయకులు కేఎల్‌డి ప్రసాద్, తంగిరాల వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ మే నెలలో కేవలం 11 రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోడీ నాలుగు సార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి దేశ చరిత్రలోనే అతి తక్కువ రోజుల్లో అధికంగా పెట్రోల్ డీజిల్ ధరలు పెంచిన ఘనత మోడీకి దక్కిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ దాడులను సాకుగా చూపించి ఆయిల్ కొరత ఏర్పడిందని తెలియజేసి ప్రజల పైన విపరీతమైన అధిక ధరల భారాన్ని వేయటానికి నిరసిస్తూ నేడు అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో సెంటర్లో జరగనున్న రాస్తారోకో నిరసన కార్యక్రమంలో ప్రజానీకం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. మన రాష్ట్రంలోనే కృష్ణా గోదావరి కేజీ బేసిన్ లో ఉత్పత్తి అవుతున్న సమురు గుజరాత్ మహారాష్ట్రలకు తరలించి అక్కడి నుండి దేశమంతట అమ్ముకొని రిలయన్స్ లాంటి కంపెనీలు భారీగా లాభపడుతుంటే మనం ఆయిల్ కొరతతో ఇబ్బందులు పడుతున్నాము. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న కేజీ బేసిన్లో గ్యాస్ ఆయిల్‌లో చట్టబద్ధంగా 50 వాటా రాష్ట్రానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు ఎస్ కే కరీం ,ఈమని నాగేశ్వరరావు, కొమరగిరి ప్రమీల, హనుమంతరావు, సిపిఐ నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఆర్‌టిసి బస్టాండ్‌లో అత్యవసర సేవల కొరకు నంబర్లు ఏర్పాటు



**అద్దంకి, జూన్ 8, ప్రభాతవార్త :**
వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ ఊటుకూరు ఉమా అన్నపూర్ణ అద్దంకి ఆర్‌టిసి బస్టాండ్‌లో ఎమర్జెన్సీ కాంటాక్ట్ నెంబర్స్ అత్యవసర సేవల కోసం నంబర్ల బ్యానర్‌లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిపో మేనేజర్ మెహబూబ్, స్టాఫ్, తమ్మన శ్రీనివాసరావు, చార్టర్ ప్రెసిడెంట్ గ్రంధి లక్ష్మి నాగరాజ కుమారి, వనిత క్లబ్ ప్రెసిడెంట్ కొత్తమాసు నాగలక్ష్మి, సెక్రటరీ సునీత, డిస్టిక్ ఆఫీసర్ ఉడత్తు ఆదినారాయణ, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు. వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో వేసవి కాలం సందర్భంగా పాదచారుల కోసం 50 రోజులుగా నిర్విరామంగా చల్లని మంచినీరు, చల్లని మజ్జిగ,రాగిజావ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంతో మంది దాతలు, ప్రముఖులు పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో ఇస్త్రీబాక్సులు పంపిణీ



**అద్దంకి, జూన్ 8, ప్రభాతవార్త :**
రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వారి ఆర్థిక సహాయంతో, సోమవారం సాయంత్రం స్థానిక రోటరీ కార్యాలయంలో నలుగురు పేద వారికి గ్యాస్ తో నడిచే ఇస్త్రీ బాక్సులు పంపిణీ చేశారు.ఈ ఇస్త్రీ పెట్టెలు పర్యావరణ పరి రక్షణలో భాగంగా పంపిణీ చేసినట్లు రోటరీ అధ్యక్షులు బాచిన శివధర పూర్ణ చంద్రరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అళహరి హరి ప్రసాద్, ట్రెజరర్ తమ్మన శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, పువ్వాడ రామకోటేశ్వరావు, అద్దంకి లేవి ప్రసాద్, ఊటుకూరు రామకోటేశ్వరావు, పసుపులేటి ఆంజనేయులు, గూడా లక్ష్మి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పనిఒత్తిడి తగ్గించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన



**సంతనూతలపాడు, జూన్ 8, ప్రభాతవార్త**
పని ఒత్తిడిని తగ్గించాలని కోరుతూ సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం ముందు సోమవారం మండల వీఆర్వోలు, గ్రామాల సర్వేయర్లు, గ్రామాల వీఆర్ఏలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు టెలి కాన్ఫరెన్స్, రాత్రి 8,9 గంటలకు గ్రూపు కాన్ఫరెన్స్, రాత్రి 10గంటలకు నిరంతరం రెవెన్యూ విధులతో తామంతా ఆందోళనకు గురి అవుతున్నామని జిల్లావీఆర్వోల సంఘం అధ్యక్షులు ఎస్ ఆదిరెడ్డి ఈ సందర్భంగా వాపోయారు. ప్రతి రోజు సాయంత్రం ఐదు గంటల తరువాత విధిగా రెవెన్యూ కార్యాలయానికి హాజరు కావాలని రెవెన్యూ అధికారులు ఆదేశాలు ఇవ్వడం వల్ల ముఖ్యంగా రాత్రి 10గంటలకు రెవెన్యూ కార్యాలయాలలో గత్యంతరం లేని పరిస్థితిలో విధులు నిర్వహిస్తున్నామని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల మార్కాపురం జిల్లా వెలిగండ్ల మండలంలో వీఆర్వో మానసిక ఒత్తిడికి లోనై ప్రమాదంలో మృతి చెందారన్నారు. అదే విధంగా కర్నూలు కేంద్రంలో వీఆర్వో మహమ్మద్ హుస్సేన్ ఉన్నతాధికారుల వేధింపుల వల్ల ఆత్మహత్యకు గురి అయ్యారని పలువురు వీఆర్వోలు ఈ సందర్భంగా వాపోయారు. వీరు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీర్వోల సంఘం ఉపాధ్యక్షులు పసుపులేటి వెంకటస్వామి, మండల వీఆర్వోలు దాసరి శ్రీనివాసరావు, కే.హనుమంతరావు, ఎం.మరియకుమార్, జాలయ్య, వినీల, మధు, విజయలక్ష్మీ, మౌలాలి, రామాంజనేయులు, గ్రామాల సర్వేయర్లు సుభాషిని, శేఖర్, వీఆర్ఏలు అశోక్, భార్గవి, శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, అలీ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక



**సంతనూతలపాడు, జూన్ 98, ప్రభాతవార్త**
రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో పాల్గొనే జిల్లా పురుషుల జట్టు ఎంపిక సోమవారం సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొన్న క్రీడాకారులకు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారితో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపిక ప్రక్రియ జిల్లా కార్యదర్శి ఏ.సుందరరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపికైన జట్టు ఈ నెల 12వ తేదీ నుండి 15వ తేదీ వరకు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగబోయే రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో పాల్గొంటారని జిల్లా కార్యదర్శి ఏ.సుందరరామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర్, పి.రవి, వెంకట్రావు, హాకీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ తిరుమలశెట్టి రవికుమార్లు పాల్గొన్నారు.

## యోగాంధ్ర శిక్షణలో పాల్గొన్న అధికారులు, పలు శాఖల సిబ్బంది



**సంతనూతలపాడు, జూన్ 8, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం నాడు యోగాంధ్ర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంను జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు దీనిని నిర్వహించారు. గురువుల ద్వారా ఆసనాలు తదితరవి నేర్పించారు. ఈ కార్యక్రమను ఎంపీడీవో డి.సురేష్‌బాబు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుడంగుంట విజయ, తహసీల్దార్ ఎస్.ఎల్ నారాయణరెడ్డి, వెలుగు ఏపీఎం బి.బాబురావు, ఎంఈఓ షణ్ముఖ కుమార్, ఆరోగ్యవిస్తరణ అధికారి ఏఈ బి.మధుసూదనరావు, మండల అభివృద్ధి వైద్యాధికారి డాక్టర్ ఏ.కరుణాకరరెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్ సావిత్రి, పంచాయతీ అభివృద్ధి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పిఎం.డి.ఎస్ పై రైతులకు అవగాహన



**బల్లికురవ జూన్ 8( ప్రభాతవార్త)**
తీవ్రమైన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే నేపథ్యంలో పీఎం.డి.ఎస్ విధానం తో వర్షాభావ పరిస్థితులను అధిగమించవచ్చని ప్రకృతి వ్యవసాయ ఎఫ్.ఎం.టి వసంత శిరిష అన్నారు. సోమవారం మండలంలోని అంబడిపూడి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎటువంటి వర్షాభావ పరిస్థితుల్లో పీఎండీఎస్ విధానంలో విత్తనాలను బీజామృతం,ఘన జీవామృతం, బంకమట్టి తో కలిపి పొలాల్లో చల్లుకోవాలన్నారు.ఈ విధానం వల్ల విత్తనాలు సులభంగా మొలకలు రావడంతో పాటు, వాతావరణ పరిస్థితులు,చీడపీడల బారి నుంచి పంటలను రక్షించుకోవచ్చు అన్నారు. భూమి సారవంతం తో పాటు. కర్బన శాతం పెరుగుతుందని శిరిష రైతులకు వివరించారు. ప్రతి రైతు తనకున్న పొలంలో సగభాగాన్ని జీరో బడ్జెట్ లో ప్రకృతి వ్యవసాయంలో పంటల పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో విసిఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీలో అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**ఒంగోలు, ప్రభాతవార్త**
వైస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మెగా డీఎస్సీ లో ఎస్సీ,ఎస్టీ అభ్యర్ధులకు జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ సోమవారం ఒంగోలులో పార్టీ జిల్లా ఎస్సీసెల్ విభాగం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు గాలిమూటి దేవప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్సీ విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకరావు పాల్గొని మాట్లాడారు. మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకలపై సీబీఐచే సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. మెగా డీఎస్సీ అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దోచుకోవడం దాచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఆవేదన వ్యక్తపరిచారు. తొలుత అంబేద్కర్,జగజ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉన్నం జనార్ధన్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి యరిజర్ల రమేష్‌బాబు, నాయకులు ఉన్నం జనార్ధన్, కందుల డానియల్, దుడ్డు వినోద్, డి.రమణయ్య, మేళం, గురవయ్య(మధు), పాలెపోగు డగ్లస్, జి.ఏసుదాసు, బొట్ల సుబ్బారావు, నాయకులు కరుణాకర్, యోహాను, పీటర్ అచ్చయ్య, కిరీటి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులందరికీ కనీస వేతనం రూ. 18,600 ఇవ్వాలి

- ఏఐటీయూసీ డిమాండ్



**ఒంగోలు, ప్రభాతవార్త**
హెల్త్ డిపార్ట్మెంట్‌లో పనిచేసే కార్మికులందరికీ జీవో నెంబర్ 138 ప్రకారం కనీస వేతనం రూ.1 8,600 ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర యూనిట్ పిలుపుమేరకు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద కొన్ని సమస్యల పరిష్కారానికై ధర్నా నిర్వహించి, కలెక్టర్కు మెమోరండం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు ఎస్ డి సర్దార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్టీ సర్దార్, కొత్తకోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 138 ప్రకారం శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులందరికీ కనీస వేతనం రూ. 18,600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాల నిండిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుండి నిలిపివేయాలనే నిర్ణయాన్ని వెనక తీసుకోవాలన్నారు. 8వ తరగతి చదివిన వారే విధులకు రావాలని ఆంక్షలు పెట్టడం సరికాదన్నారు. కాంట్రాక్టు పద్ధతి రద్దు చేసి కార్మికులను ఆప్కాస్ లో విలీనం చేయాలని, సాలీన జాతీయ పండుగలకు ఆర్జిత సెలవులు 25 రోజులు ఇవ్వాలని, ప్రతినెల 7వ తేదీ లోపు జీతాలు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ ప్రతి నెల అదే కవరీ చేసి వారి ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు.

## డొక్కా సీతమ్మ పథకాన్ని ప్రైవేటుకు అప్పగించ వద్దంటూ కలెక్టరేట్ వద్ద ధర్నా



**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**
డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని, మెనూ చార్జీలు, కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథక కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కల్పన మాట్లాడుతూ పేద విద్యార్థుల్లో ఆకలి, పోషకాహార లోపాన్ని తగ్గించడంలో మధ్యాహ్న భోజన పథకం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జిల్లాలో సుమారు 4 వేల మంది కార్మికులు ఈ పథకంలో పనిచేస్తున్నారని, బిల్లులు, వేతనాలు ఆలస్యమైనా తల్లి మనసుతో పిల్లలకు భోజనం వండి పెడుతున్నారని తెలిపారు. కార్మికులకు అదనపు వేతనాలు చెల్లించాలని, అధికారుల వేధింపులు నిలిపివేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న ఈ పథకం ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. పాఠశాలల్లోనే తయారయ్యే ఆహారంపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్మార్ట్ కిచెన్ విధానాన్ని విరమించుకోవాలని, గ్యాస్, వంట సామగ్రి, తాగునీరు, వంట షెడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రత్నకుమారి, అనంతలక్ష్మి, మీరాబీ, ఆదాంబి, కోటేశ్వరి, రమాదేవి, శేషమ్మ, రాధ, తిరుపతమ్మ, ఈశ్వరమ్మ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జిందాల్ ఐరన్ ఓర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గ్రామస్తుల ఆందోళన



**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**
ఒంగోలు మండలంలోని మార్లపాడు, కొనిజేడు గ్రామాల ప్రజలు జిందాల్ఏపీఎండీసీ ఐరన్ ఓర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ కొమ్ము రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో స్థానికులు మాట్లాడుతూ 2011లో అప్పటి జింపెక్స్ ఐరన్ ఓర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులను గుర్తు చేశారు. ఆ సమయంలో జరిగిన ఆందోళనల కారణంగా పలువురిపై నమోదైన పోలీసు కేసులు ఇటీవలే ముగిశాయని తెలిపారు.అదే ప్రాజెక్టును ఇప్పుడు జిందాల్ఏపీఎండీసీ భాగస్వామ్యంతో కొత్త పేరుతో తిరిగి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ ప్రాజెక్టు అమలైతే గాలి కాలుష్యం పెరగడంతో పాటు భూగర్భ జలాలు కలుషితమవుతాయని, సారవంతమైన వ్యవసాయ భూములు దెబ్బతిని రైతుల జీవనాధారం ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యలు తలెత్తడంతో పాటు ప్రజారోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం గుర్తించి ప్రాజెక్టుపై పూర్తి వివరాలను వెల్లడించాలని, స్థానికుల అభిప్రాయాలను గౌరవించాలని డిమాండ్ చేశారు.

## పోలీసుల మీకోసం కార్యక్రమంలో 85 ఫిర్యాదులు



**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**
జిల్లా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రకాశం జిల్లా పోలీసు శాఖ సోమవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో "మీకోసం (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ పి. శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 85 ఫిర్యాదులు స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వ్రాతపూర్వక అర్జీలను అధికారులకు అందజేశారు. ఫిర్యాదుదారులతో అధికారులు నేరుగా మాట్లాడి సమస్యల వివరాలు తెలుసుకుని చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, సింగరాయకొండ సీఐ శ్రీహరి, వీవీపాలెం ఎస్సై ప్రేమ్ కుమార్, ప్యానెల్ అడ్వకేట్ బి. బాలాజీ సింగ్, పీజీఆర్ఎస్ ఎస్సై జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

## టెన్త్‌సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభం



**ఒంగోలు కలెక్టరేట్ ప్రభాతవార్త**
జిల్లాలో నిర్వహిస్తున్న పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం ఒంగోలులోని డి.ఆర్.ఆర్. మున్సిపల్ హైస్కూల్‌లో ప్రారంభమైంది. ఈ మూల్యాంకన శిబిరానికి జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి. రేణుక క్యాంప్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.ఈ సందర్భంగా మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక ప్రక్రియ కావడంతో అత్యంత జాగ్రత్తగా జవాబు పత్రాలను పరిశీలించాలని సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా విద్యార్థులు రాసిన సమాధానాలకు అనుగుణంగా సరైన మార్కులు కేటాయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఎం. శ్రీనివాసరావు, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌గా ఒంగోలు మండల విద్యాశాఖ అధికారి టి. కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. మూల్యాంకన ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

## సింగరకొండ దేవస్థానంలో యోగ ఆసనాలు



**అద్దంకి, జూన్ 8, ప్రభాతవార్త :**
సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో యోగ ఆసనాలు సిబ్బంది, అర్చకులు పాలకమండలి సభ్యులు, భక్తులు వచ్చి ఆసనాలు నేర్చుకొన్నారు.రిటైర్డ్ పిటిటీచర్ నర్రాగోపాల్ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో పాలకమండలి అధ్యక్షుడు చుండూరి మురళీ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

## పోలవరం గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం

- పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మీ- లలిత్ సాగర్ దంపతులు



**ముండ్లమూరు, జూన్ 8, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలం పోలవరం గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సీతారాముల వారి ఆశీస్సులు తీసుకున్న దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి- లలిత్ సాగర్ దంపతులు. వారితో పాటు మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, పోలవరం గ్రామ టీడీపీ నాయకులు, మహిళలు, మండలంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఎల్‌ఓసీ చెక్కులు పంపిణీ చేసిన గొట్టిపాటి లక్ష్మీ



**ముండ్లమూరు, జూన్ 8, ప్రభాతవార్త**
ముండ్లమూరు మండలం పులిపాడు గ్రామానికి చెందిన దాసరి జరీష అనారోగ్యంతో బాధపడుతుండగా దర్శి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి దృష్టికి పులిపాడు టీడీపీ నాయకులు తీసుకెళ్లారు. డాక్టర్ లక్ష్మి వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.1,53,670 ఎల్‌ఓసీ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వారితో పాటు మండలంలోని టీడీపీ అధ్యక్షులు కూరపాటి శ్రీను, పులిపాడు టీడీపీ నాయకులు నారాయణరెడ్డి, మండలంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయాలి



**దర్శి, జూన్ 8, ప్రభాతవార్త**
అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు చేయాలని సీపీఐ దర్శి నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఆర్.కరుణానిధి కోరారు. సోమవారం దర్శి ఎంపీడీవోకు భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కరుణానిధి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్నప్పటికి పెన్షన్లు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల హామీల్లో భాగంగా బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తానని చెప్పి అధికారం చేపట్టాక ఆ వైపుగా ఆలోచన చేయకపోవడం ఎంత వరకు సమంజసమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ దర్శి పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, ఏఐటీయుసీ నాయకులు కే.హనుమంతరావు, సీపీఐ సీనియర్ నాయకులు కల్లూరు పెద్ద ఆంజనేయులు, సీహెచ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

## బూచేపల్లిని కలిసిన యువకులు



**ముండ్లమూరు, జూన్ 8, ప్రభాతవార్త**
దర్శి శాసనసభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించిన మండలంలోని మారెళ్ళ గ్రామ వైసీపీ యువకులు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువకులు గోపనబోయిన శ్రీనివాసరావు, వాకా రామిరెడ్డి, చాగంరెడ్డి కృష్ణ చైతన్యరెడ్డి, సుంకర భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## బడి పిలుస్తోందిలో భాగస్వాములమవుదాం



**దర్శి, జూన్ 8, ప్రభాతవార్త**
దర్శిలోని ఎస్సెస్పీ కాలనీలో సోమవారం దళిత బహుజన రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో దర్శి నియోజకవర్గ కన్వీనర్ గుంటూరు నాగమణి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రవేశపెట్టిన బడి పిలుస్తోందిలో అందరూ భాగస్వాములమవుదాం కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభం ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉచిత పుస్తకాలు, యూనిఫామ్, నోట్ బుక్స్, పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం,డిజిటల్ తరగతులు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా ఎన్నో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ప్రభుత్వం అందిస్తుంది. కనుక ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలని అలాగే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల బాలికలకు వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడానికి దోహదపడుతుందన్నారు.

## ఈసీడీఎల్ ఎర్లీ చైల్డ్ ట్రైనింగ్



**ముండ్లమూరు, జూన్ 8, ప్రభాతవార్త**
నవ చేతన జీరో నుండి ఆరు సంవత్సరాల పిల్లల్లో వారి యొక్క అభివృద్ధిలో, పోషణ అభివృద్ధి సామాజిక మానసిక శారీరక అభివృద్ధి లక్ష్యంగా సోమవారం మోడల్ స్కూల్ నందు అంగన్‌వాడీ కార్యకర్తలకు ట్రైనింగ్ నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా పిల్లల్లో రెండు సంవత్సరాల్లోపు వారికి మెదడు 80 శాతం డెవలప్ అవుతుంది. అభివృద్ధి చెందడానికి పిల్లలతో ఉన్న లోపాలను గుర్తించి స్క్రీన్ చేసి యాప్ ద్వారా నమోదు చేసి డాక్టర్‌కు రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మారెళ్ళ పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్, సీడీపీవో పరిమళ, సూపర్‌వైజర్ ఇందిరమ్మ, సీహెచ్ సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా సినీనటుడు గిరిబాబు 84వ జన్మదినోత్సవ వేడుకలు



**కొరిసపాడు, జూన్ 8, ప్రభాతవార్త**
ప్రముఖ సినీ నటుడు యర్రా గిరిబాబు 84వ జన్మదినోత్సవ వేడుకలను ఆయన స్వగ్రామమైన రావినూతల లోసోమవారం ఆయన సన్నిహితులు, అభిమానులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో చిరకాలం నుంచి వైద్య సేవలందిస్తున్న ప్రముఖ వైద్యులు, ఆయన సమ కాలికుడైన డాక్టర్ ఈదుపుగంటి హృదయనాథ్, ఆర్ఎస్‌సిఎ అధ్యక్షులు కారుసాల బాబు, మండల టిడిపి ఉపాధ్యక్షులు మోపర్తి లక్ష్మీనారాయణ గ్రామస్తులతో కలిసికేక్ ను కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిబాబు మారుమూల గ్రామమైన రావినూతల గ్రామంలోని ఒక సామాన్య వ్యవసాయ కుటుంబీకులైన నాగయ్య, నాగరత్నమ్మ దంపతుల ముద్దు బిడ్డగా జన్మించారన్నారు. ఆయన చిన్నతనం నుండి నటనపై ఆసక్తితో గ్రామంలో నాటకాలలో నటిస్తూ, సినీ రంగం వైపు పయనించారన్నారు. 1979లో జగమే మాయ సినిమా ద్వారా సినీ రంగానికి పరిచయమయ్యారన్నారు. అనంతరం స్వయంకృషితో నటుడిగా ఎదగడమే కాకుండా పలు చిత్రాలకు నిర్మాతగా, దర్శకుడిగా కూడా వ్యవహరించి తన ప్రతిభను చాటుకున్నారన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగిన స్వగ్రామంపై మమకారంతో గ్రామంలోని ప్రతి వేడుకకు హాజరవు తూ గ్రామస్తులతో కలివిడిగా ఉండేవారన్నారు. ఆయన తన జన్మదిన ఎక్కువగా గ్రామంలోని సన్నిహితులు, స్నేహితుల మధ్య జరుపుకునే వారన్నారు. వేసవికాలం కావడంతో ఎండల ప్రభావం వలన, వయసు రీత్యా ఆయన గ్రామానికి రాలేకపోవడంతో ఆయన మీద అభిమానంతో తాము ఈ జన్మది నవేడుకలను గ్రామంలో నిర్వహిస్తున్నామన్నారు. ఆయన తన తండ్రి నాగయ్య వలె శతాధిక జన్మ దినోత్సవ వేడుకలు జరుపుకోవాలని భగవంతుని కోరుకుంటున్నా మంటూ ముగించారు. ఈ జన్మదిన వేడుకలలో వారితో పాటు మాజీ ఎంపీటీసీలు రామినేని రమణ శ్రీనివాసరావుతో పాటు పలువురు గిరిబాబు కుటుంబ సన్నిహితులు, స్నేహితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్యాస్ సరఫరాలో ఆయా సంస్థలు నిబంధనలను కచ్చితంగా పాటించాలి: జెసి కల్పనా కుమారి



**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**
జిల్లాలో గ్యాస్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని గ్యాస్ ఏజెన్సీలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి ఆదేశించారు. సోమవారం ఒంగోలులోని ప్రకాశం భవనంలో జిల్లా గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్యాస్ సిలిండర్లను డెలివరీ చేసే సమయంలో తప్పనిసరిగా వేయింగ్ మిషన్ ద్వారా తూకం వేసి వినియోగదారులకు అందించాలని, వినియోగదారులు ఇంటి వద్ద లేకపోతే మరుసటి రోజు తిరిగి వెళ్లి డెలివరీ చేయాలని సూచించారు. ఆన్‌లైన్ ఓటీపీ ద్వారానే గ్యాస్ డెలివరీ పూర్తి చేయాలని, డెలివరీ సిబ్బంది వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ఏజెన్సీలు చర్యలు తీసుకోవాలన్నారు. రశీదులో పేర్కొన్న మొత్తానికి మించి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపం2 పథకం కింద అర్హులకు సబ్సిడీ సక్రమంగా అందుతున్నదీ లేదీ పరిశీలించాలని, పెండింగ్ కాల్స్ లేకుండా చూడాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ఇకపై ఫిర్యాదులు రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఐవీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్. పద్మశ్రీ, సహాయ సరఫరా అధికారి జె. రవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది, జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీ డీలర్లు పాల్గొన్నారు.

9-6Pg5exH.qxd:9-6Pg5exH.qxd 1/1/02 5:39 AM Page 1



# చైనా, భారత్, పాక్ వద్ద మరిన్ని అణ్వాయుధాలు

## 'సిప్రి' నివేదికలో వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 8:** 2025లో భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు ఓ నివేదిక ద్వారా తెలిసింది. బాలిస్టిక్ క్షిపణులకు వార్ హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్ఐపిఆర్ఐ) తన నివేదికలో పేర్కొన్నది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాల సంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతోపాటు వార్‌హెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత యేడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వదనద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత యేడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండే అని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది. భారత్ తన యుద్ధ విమానాలు, నేల నుంచి ప్రయోగించే క్షిపణులు, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన జలంతార్గామిలకు న్యూక్లియర్ వెపన్స్‌ను అమర్చినట్లు కూడా ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా అదనపు క్షిపణుల కోసం మరి కొన్ని వార్‌హెడ్స్‌ను కూడా తయారుచేస్తున్నట్లు సిప్రి తన నివేదకలో చెప్పింది. ఆ వార్‌హెడ్స్ ఉన్న క్షిపణులను కంటెయినర్లకు తరలిస్తున్నట్లు కూడా రిపోర్టులో చెప్పారు. స్టాక్‌హోమ్ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 జనవరి నాటికే స్వల్ప సంఖ్యలో ఉన్న వార్ హెడ్స్‌ను ఇండియా తన జలాంతర్గాములకు తరలించినట్లు తెలుస్తోంది.




# ఇక 2 నెలలకోసారి 'ఇండియా కూటమి' భేటీ

### కూటమి నుంచి వైదొలగినట్లు ఆప్, డిఎంకె ప్రకటన

### 23 పార్టీల ప్రతినిధులు హాజరు

### తదుపరి సమావేశం హైదరాబాద్‌లో నిర్వహణ

**న్యూఢిల్లీ, జూన్ 8:** 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఇండియా కూటమి పక్షాల నేతలు సమావేశమయ్యారు. దేశ రాజధాని ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి 23 పార్టీలకు సంబంధించి 27 మంది ప్రతినిధులు హాజరయ్యారు. డిఎంకె, ఆప్ పార్టీలు ఇండియా కూటమి సమావేశానికి దూరంగా ఉన్నాయి. రాజ్యసభ సభ్యుడు, మాజీ కాంగ్రెస్ పార్టీ నేత కపిల్ సిబల్ కూడా హాజరయ్యారు. శివసేన (యుబిటి) అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే వర్చువల్‌గా ఇండియా కూటమి సమావేశంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించగా, ఆ పార్టీ తరఫున అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, కెసి వేణుగోపాల్ హాజరయ్యారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, టిఎంసి అధినేత్రి మమతాబెనర్జీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ, ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా, పిడిపి అధ్యక్షుడు మొహబూబా ముఫ్తి, జెఎంఎం పార్టీ తరఫున సర్ఫరాజ్ అహ్మద్, ఎన్‌సిపి (ఎస్‌పి) సుప్రియా సూలే, సిపిఎం తరఫున జాబ్ బ్రిట్టాస్, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఐ ఎంఎల్ సీనియర్ నాయకుడు దీపాంకర్ భట్టాచార్య, ఆర్‌ఎస్‌పి నేత ఎన్‌కె ప్రేమచంద్రన్, ఐయుఎంఎల్ నేత సాధిఖ్ థంగల్, విసికె నేత తిరుమవలవన్, ఎండిఎంకె అధ్యక్షుడు డి.వైకో, కేరళ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.జార్జ్, కేరళ కాంగ్రెస్ (ఎం) నేత జోస్ కె మణి, ఆర్‌ఎల్‌పి హనుమాన్ బెనివాల్, లోక్ దల్ నేత సునీల్ సింగ్, ఫార్వార్డ్ బ్లాక్ కార్యదర్శి జి.దేవరాజన్, శెట్కారి కమ్‌గర్ పకాష్ నేత జయంత్ పాటిల్ ఇండియా కూటమి సమావేశానికి హాజరయ్యారు. ప్రస్తుతంలో దేశంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, ఎన్‌డియే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించారు. ప్రధానంగా ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని ఆయా పార్టీలను నిర్వీర్యం చేసే చర్యలను ఇండియా కూటమి తీవ్రంగా ఖండించింది. అంతకుముందు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తన ప్రారంభోపన్యాసంలో, ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో అసమర్థత, లోపభూయిష్టమైన విదేశాంగ విధానం కారణంగా దేశాన్ని ప్రమాదకరమైన స్థితిలోకి నెట్టినందుకు కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల కోట్లాది మంది ఓటు హక్కును కోల్పోతున్నారని ఖర్గే ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో బలహీన వర్గాలపై అఘాయిత్యాలు అడ్డూఅదుపు లేకుండా సాగుతున్నాయని మండిపడ్డారు. అంతేకాదు రాజ్యాంగంపై నిరంతరం దాడి జరుగుతోందని ఆరోపించారు.ప్రతిపక్షాలు ఐక్యంగా ఉంటే ఎన్‌డియే ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవచ్చన్నారు. తాజాగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులను ఓడించామని గుర్తు చేశారు. ఈ విషయంలో మన సంఘీభావం, ఐక్యతను ప్రదర్శించామన్నారు. ఇప్పుడు ఆ భావనను మరింత బలపరచాలన్నారు. మోడీ ప్రభుత్వం పాలన కారణంగా దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు ఇండియా కూటమిని ముందకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తద్వారా రాజకీయ, ఆర్థిక, సమాజిక విదేశంగా విధానాలకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కోవచ్చన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో ఎదురైన భారీ పరాజయం నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో, కూటమిని బలోపేతం చేసే మార్గాలపై కూడా చర్చించారు. ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ప్రతి రెండు నెలలకోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. తదుపరి సమావేశం ఆగస్టులో హైదరాబాద్‌లో జరగనుంది. అంతేకాకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పుడు, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే కార్యాలయంలో ప్రతి ఉదయం ఒక సమన్వయ సమావేశం జరుగుతుంది. అక్కడ, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై అచంచలమైన దృష్టితో, ఐక్యంగా కేంద్రాన్ని ఎదుర్కోవడంపై ఇండియా బ్లాక్ చర్చించాలని తీర్మానించింది.

తమిళనాడులో టివికె నేతృత్వంలోని జోసెఫ్ విజయ్ సంకీర్ణ ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యంగా ఉన్నప్పటికీ, ఇండియా కూటమి సమావేశానికి టివికెను ఆహ్వానించలేదు. దీంతో ఆ పార్టీ తరఫున ఇండియా కూటమి భేటికి ఎవరూ హాజరుకాలేదు.

మరోవైపు నిన్నటి వరకు ఇండియా కూటమిలో క్రియాశీలకంగా ఉన్న డిఎంకె, ఇటీవల తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమి నుంచి డిఎంకె వైదొలగింది. ఈ మేరకు డిఎంకె ప్రకటన విడుదల చేసింది. అటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇండియా కూటమిలో తాము లేమని స్పష్టంగా వెల్లడించింది. దీంతో ఇండియా కూటమి సమావేశానికి డిఎంకె, ఆప్‌లు దూరంగా ఉన్నాయి.



# సిఎం విజయ్ సర్కార్‌పై డిఎంకె స్టాలిన్ ధ్వజం

**చెన్నై,జూన్ 8:** తమిళనాడులో కొత్తగా కొలువుదీరిన టీవీకే ప్రభుత్వంపై డీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని ఈ ప్రభుత్వం మూడు నెలల కన్నా ఎక్కువ కాలం మనుగడ సాగించలేదని ఆయన జోస్యం చెప్పారు. రాష్ట్రంలో గత 60 ఏళ్లలో డీఎంకే, అన్నాడీఎంకేయేతర పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. మే నెలలో విజయ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. మాజీ వీసీకే ఎమ్మెల్యే పనైయూర్ బాబు, ఆయన మద్దతుదారులు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గురించి తాను ఎక్కువగా చెప్పనవసరం లేదన్నారు.



# బెంగాల్ 'పుష్ప' జహాంగీర్‌ఖాన్ అరెస్టు

కోల్‌కత్తా,జూన్ 8: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ సుదీర్ఘ పాలనకు తెరపడి, కొత్త ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే ఒక సంచలన అరెస్ట్ నమోదైంది. పశ్చిమ బెంగాల్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ జరిపిన మెరుపు దాడిలో తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత, మాజీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ భారత్‌నేపాల్ సరిహద్దుల్లో అరెస్టయ్యారు. కలకత్తా హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ లేదా రక్షణ పొడిగించేందుకు నిరాకరించడంతో ఎస్టీఎఫ్ ఈ చర్య తీసుకుంది. మే 4న ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఆయనపై ఐదు కొత్త పోలీస్ కేసులు నమోదయ్యాయని కోర్టు ఈ సందర్భంగా గుర్తుచేసింది. మమతా బెనర్జీ మేనల్లుడు, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీకి జహంగీర్ ఖాన్ అత్యంత ఆప్తుడు. డైమండ్ హార్బర్ పరిధిలోని ఫాల్తా నియోజకవర్గంలో జహంగీర్ ఖాన్ వర్గీయులు భయాందోళనలు సృష్టిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి.

# ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం.. నలుగురు మృతి

## 200 మందికి గాయాలు, సునామీ హెచ్చరికలు జారీ



**మనీలా, జూన్ 8:** ఫిలిప్పీన్స్‌లో సోమవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఉదయం 7.37 గంటల సమయంలో 7.8 తీవ్రతతో దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఈ భారీ భూకంపం వచ్చింది. దీని ప్రభావంతో నలుగురు మరణించారు. 200 మందికిపైగా గాయపడ్డారు. ఫిలిప్పీన్స్ భూకంపాలు రావడం సాధారణమే. అయితే, వాటి తీవ్రత చాలా తక్కువగా ఉంటుంది. కానీ, ఈసారి భూకంపం మాత్రం ఈ యేడాదిలోనే చాలా పెద్దది. ఈ భూకంప కేంద్రం ఫిలిప్పీన్స్, నైరుతి జనరల్ శాంటోస్ నగరానికి దక్షిణాన ఉన్న మిండానో ప్రాంతంలో కేంద్రీకృతమైందని అంతర్జాతీయ మీడియా తెలిపింది. భూకంప ప్రభావంతో సునామీకి కూడా అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భూకంపం తీవ్రతతో చాలా భవనాలు, రహదారులు, వంతెనలు ధ్వంసమయ్యాయి. కొన్ని స్వల్పంగా ధ్వంసమైతే, ఇంకొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. రవాణా, జనజీవనం స్తంభించింది. ఫిలిప్పీన్స్‌తోపాటు ఇండోనేసియా, మలేసియాకు కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆయా దేశాల్లోని తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు వెళ్లాల్సిందిగా ప్రభుత్వాలు సూచించాయి. కూలిన శిథిలాల కింద ఎంతమంది ఉన్నారనే విషయంపై ఇంకా అధికారుల నుంచి ఎలాంటి స్పష్టత లేదు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జనరల్ శాంటోస్ నగరంలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. దీంతో పలు విమానాలు రద్దయ్యాయి. భూకంపం కారణంగా జనరల్ శాంటోస్ నగరంలో స్కూళ్లలోని విద్యార్థులను ఉన్నట్లుండి తరలిస్తున్న క్రమంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. అనేక ప్రాంతాలకు సునామీ హెచ్చరికల నేపథ్యంలో అక్కడి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుల్తాన్ కుదారత్, సారంగాణి వంటి ప్రాంతాల్లో మానిటరింగ్ సెంటర్లలో సునామీ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# మైనర్ బాలికపై సామూహిక లైంగిక దాడి

**కోల్‌కత్తా,జూన్ 8:** నగరంలోని దుర్గాపూర్ సిటీ సెంటర్ పరిధిలో ఎనిమిదో తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలికపై జరిగిన సామూహిక అత్యాచార ఘటనలో పోలీసులు స్పందించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన ఇద్దరు ప్రధాన నిందితులతో పాటు వారికి సహకరించిన ఒక మహిళను, నిబంధనలకు విరుద్ధంగా గదిని కేటాయించిన హోటల్ మేనేజర్‌ను కలిపి మొత్తం నలుగురిని అసంసోల్‌దుర్గాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. రెండురోజులక్రితం మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో బాధితురాలి కుటుంబానికి తెలిసిన సిమ్రాన్ తమాంగ్ అనే మహిళ బాలికను మాయమాటలతో నమ్మించి ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చింది. ఆ తర్వాత నిందితులు బాలికను కారులో ఎక్కించుకుని, అందులోనే బలవంతంగా కూల్ డ్రింక్‌లో మత్తుమందు, మద్యం కలిపి తాగించారు. బాలిక స్పృహ కోల్పోగానే కవిగురు ప్రాంతంలోని ఒక హోటల్‌కు తీసుకెళ్లి రాజ్ మల్లిక్, షేక్ అజారుద్దీన్‌తోపాటు మరికొందరు ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్టు బాధిత బాలిక తండ్రి ఆరోపించారు. ఈ ఘాతుకం తర్వాత రాత్రి 10:30 గంటల సమయంలో నిందితులు బాలికను బైపాస్ రోడ్డు పక్కన పడేసి పారిపోయారు. తీవ్ర అస్వస్థతతో రోడ్డుపై పడి ఉన్న బాలికను ఒక ఈ రిక్షా డ్రైవర్ గుర్తించి, మానవత్వంతో ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చాడు.

## ఇరాన్ నుంచి వచ్చేయండి! - అక్కడి భారతీయులకు కేంద్రం సూచన

**న్యూఢిల్లీ,జూన్ 8:** పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర స్థాయికి చేరడంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు వెంటనే దేశం విడిచి వచ్చేయాలని తన పౌరులకు నేడు మరోసారి సూచించింది. ఈ మేరకు టెహరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాంతంలోని తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ఎలాంటి ప్రయాణాలు చేయవద్దని మా పాత సలహాను పునరుద్ఘాటిస్తున్నాం. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు కూడా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా దేశం విడిచి వెళ్లాలని సూచిస్తున్నామని ఎంబసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఇటీవల ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి.

ఇరాన్‌లోని మహ్‌షహర్ ప్రాంతంలో ఉన్న పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. మరోవైపు, సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని ఐడీఎఫ్ తెలిపింది. ఈ దాడుల నేపథ్యంలోనే భారత్ ఈ ట్రావెల్ అడ్వైజరీని జారీ చేసింది. ఇజ్రాయెల్ గనక దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఇజ్రాయెల్, దాని మద్దతుదారులపై వినాశకరమైన దాడులు తప్పవని ఇరాన్ కమాండర్ అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు.

# నార్వే చెస్ ఛాంపియన్ ప్రజ్ఞానందకు సిఎం విజయ్

## రూ.50 లక్షల నగదు బహుమతి అందచేత



**చెన్నై,జూన్ 8:** నార్వే చెస్ టోర్నమెంట్‌లో చారిత్రక విజయం సాధించిన యువ చెస్ సంచలనం, గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందను తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు రూ. 50 లక్షల నగదు పురస్కారాన్ని అందజేశారు. ప్రజ్ఞానందతో సీఎం విజయ్ కాసేపు సరదాగా చెస్ ఆడి ఆయన్ను ఉత్సాహపరిచారు. ఈ ఆసక్తికర ఘటన అక్కడున్న వారిని ఆకట్టుకుంది. ఓస్లోలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో టైటిల్ గెలిచిన మొట్టమొదటి భారతీయుడిగా ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. టోర్నీలో భాగంగా ఆయన ప్రపంచ నంబర్ 1, సొంతగడ్డ ఆటగాడైన మాగ్నస్ కార్ల్‌సెన్‌పై క్లాసికల్ ఫార్మాట్‌లో రెండుసార్లు గెలిచి అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచ ఛాంపియన్ డి. గుకేశ్‌పై కూడా కీలక విజయం నమోదు చేసి తన సత్తా చాటాడు. అంతర్జాతీయ వేదికపై దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన ప్రజ్ఞానంద మేధస్సును, సంయమనాన్ని సీఎం విజయ్ ప్రత్యేకంగా అభినందించారు. తమిళనాడు క్రీడాభివృద్ధి ప్రాధికార సంస్థ తరఫున రూ. 50 లక్షల చెక్కుతో పాటు జ్ఞాపికను సీఎం విజయ్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు ఆధవ్ అర్జున, క్రీడాభివృద్ధి సంస్థ సభ్య కార్యదర్శి జె. మేఘనాథ రెడ్డి, ప్రజ్ఞానంద తల్లిదండ్రులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జూన్ 1న విడుదలైన ర్యాంకింగ్స్‌లో 16వ స్థానంలో ఉన్న ప్రజ్ఞానంద, నార్వే చెస్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. టోర్నీలో ఆరో రౌండ్ ముగిసేసరికి చివరి స్థానంలో నిలిచి, అనూహ్యంగా పుంజుకున్నాడు. వరుసగా నాలుగు గేమ్‌లలో గెలిచి టైటిల్ రేసులోకి దూసుకొచ్చాడు. చివరి రౌండ్‌లో విన్సెంట్ కీమర్‌పై గెలిచి మొత్తం 18 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 2021లో కార్ల్‌సెన్ తర్వాత ఒకే ఈవెంట్‌లో వరుసగా నాలుగు గేమ్‌లు గెలవడం ఇదే తొలిసారి.

# హార్ముజ్‌ను తెరుస్తాం.. కానీ ఫీజు తప్పదు!

## నిబంధనలు యధాతథంగా అమలు చేస్తామన్న ఇరాన్

**టెహ్రాన్,జూన్ 8:** అంతర్జాతీయంగా ముడిచమురు, సహజ వాయువు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి భవిష్యత్తుపై ఇరాన్ కీలక ప్రకటన చేసింది. కొన్ని నెలలుగా కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా పాక్షికంగా మూతబడిన ఈ జలసంధిని అంతర్జాతీయ నౌకల రాకపోకల కోసం తెరిచే ఉంచుతామని, అయితే కొత్త నిబంధనలు వర్తిస్తాయని ఇరాన్ స్పష్టం చేసింది. రష్యాలోని ఇరాన్ రాయబారి కాజెం జలాలీ సోమవారం రష్యా వార్తాపత్రిక ఇజ్వెస్టియాతో మాట్లాడుతూ ఇరాన్, ఒమన్ దేశాలు సంయుక్తంగా రూపొందించే సరికొత్త ఫ్రేమ్‌వర్క్ ఆధారంగానే ఈ జలసంధిలో రవాణా సాగుతుందని వెల్లడించారు. ఈ కొత్త నిబంధనలలో భాగంగా హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకలపై ట్రాన్సిట్ ఫీజు విధించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సరఫరా అయ్యే చమురులో ఐదో వంతు ఈ సముద్ర మార్గం నుంచే వెళ్తుంది. మార్చి 2026 లో ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్ తీవ్రంగా దెబ్బతింది. ఇప్పుడు దీనిని పూర్తిగా పునరుద్ధరించడానికి సిద్ధమవుతున్నప్పటికీ ఇరాన్, ఒమన్ దేశాలు అక్కడ అందించే రక్షణ, నిఘా, సెర్చ్ అండ్ రెస్క్యూ (సహాయక చర్యల) సేవలకు గానూ ఈ ఫీజులను వసూలు చేయనున్నట్లు రాయబారి పేర్కొన్నారు. ఇరాన్ ప్రతిపాదిస్తున్న ఈ రవాణా రుసుములపై అంతర్జాతీయంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్జాతీయ సముద్ర చట్టాల ప్రకారం హార్మూజ్ జలసంధిలో ఎలాంటి ఆంక్షలు లేకుండా ఉచితంగా నౌకలు ప్రయాణించే హక్కు ఉందని అమెరికా వాదిస్తోంది. ఇరాన్‌కు ఎలాంటి ఫీజులు చెల్లించవద్దని, ఈ వసూళ్ల దందాలో భాగస్వామి కావద్దని ఒమన్‌ను కూడా అమెరికా హెచ్చరించింది. యుద్ధ భయాలు, బీమా ప్రీమియంలు పెరిగిపోవడం, ప్రయాణంలో ఆలస్యం కావడం కంటే ఇరాన్‌కు కొంత ఫీజు చెల్లించి సురక్షితంగా వెళ్లడమే మేలని కొన్ని అంతర్జాతీయ షిప్పింగ్ కంపెనీలు భావిస్తున్నాయి. ఈ ఫీజులు నౌక పరిమాణం, మోసుకెళ్లే సరుకును బట్టి ఒక్కో నౌకకు గరిష్టంగా 2 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 16 కోట్లు) వరకు ఉండే అవకాశం ఉంది. రష్యా వంటి మిత్రదేశాలకు మాత్రం ఇరాన్ ఇప్పటికే ఈ ఫీజుల నుంచి మినహాయింపు ఇచ్చింది. ఏప్రిల్‌లో అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత ఈ సముద్ర మార్గాన్ని శాశ్వతంగా పునరుద్ధరించేందుకు ఇరాన్‌ఒమన్ సంయుక్త కమిటీ చర్చలు జరుపుతోంది. ఈ ప్రకటన గ్లోబల్ మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చినప్పటికీ కొత్తగా విధించే ఫీజుల భారం చివరకు వినియోగదారులపైనే పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా.



# లాస్‌ఏంజిల్స్ మేయర్ రేసులో దూసుకెళ్తున్న నిత్యారామన్

**లాస్ ఏంజిల్స్, జూన్ 8:** అమెరికాలో భారతీయ సంతతి మహిళ నిత్యారామన్.. లాస్‌ఏంజిల్స్ మేయర్ ఎన్నిక రేసులో దూసుకెళ్తున్నారు. నవంబరులో జరిగే ఆ ఎన్నికల గురించి అప్పుడే యుద్ధం మొదలైంది. ఓ మీడియా సంస్థ నివేదిక ప్రకారం.. నిత్యారామన్ ఓటర్లను ఆకర్షిస్తున్నారు. లాస్ ఏంజిల్స్ కౌంటీలో ఉన్న సుమారు 48 వేల ఓట్లలో ఆమె ఆదివారం నాటికి 40 శాతం ఓట్లను గెలుచుకున్నట్లు తెలుస్తోంది. ప్రత్యర్థి ప్రాట్ కన్నా 10 వేల అధిక ఓట్లను ఆమె కైవసం చేసుకున్నట్లు ఓ రిపోర్టు ద్వారా తెలిసింది. కేరన్ బ్రాస్, స్పెన్సర్ ప్రాట్‌పై జూన్ 2న జరిగిన ప్రైమరీలో అత్యధిక ఓట్లను సాధించింది. దీంతో నిత్యారామన్ ఓట్ షేర్‌లో 5 పాయింట్లతో ముందున్నారు. రిపబ్లికన్ పార్టీ తరఫున ప్రాట్ పోటీ చేస్తుండగా, నిత్యారామన్ మాత్రం ప్రోగ్రెసివ్ అభ్యర్థిగా పోటీ పడుతున్నారు.

# అయోధ్యలో కరుడు గట్టిన క్రిమినల్ ఎన్‌కౌంటర్

**అయోధ్య,జూన్ 8:** ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన క్రిమినల్ హతమయ్యాడు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. అయోధ్యలో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో భాను ప్రతాప్ సింగ్ అలియాస్ బబ్లూ హతమయ్యాడు. ఉత్తర ప్రదేశ్ పోలీసులు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) సిబ్బంది కలిసి ఆపరేషన్ నిర్వహించారు. హతుడు భాను ప్రతాప్ సింగ్‌పై అనేక జిల్లాల్లో 40 వరకు కేసులున్నాయి. అతడిపై అనేక చోట్లా రూ2 లక్షల వరకు రివార్డ్ కూడా ఉంది. గోరక్‌పూర్ పరిదిలోని బిక్నిపూర్ గ్రామానికి చెందిన బబ్లూ అనేక నేరాలకు పాల్పడ్డాడు. అతడిపై యూపీలోని అనేక జిల్లాల్లో చాలా కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా అతడు పరారీలో ఉన్నాడు. అతడి గురించి ఇటీవల ఎస్టీఎఫ్ అధికారులకు సమాచారం అందింది.

# బలమైన గాలులకు ఎయిర్‌పోర్టులో దెబ్బతిన్న విమానాలు

**న్యూఢిల్లీ, జూన్ 8:** బలమైన గాలి వానకు ఎయిర్‌పోర్ట్‌లోని గ్రౌండ్ పరికరాలు వేగంగా కదిలాయి. పార్క్ చేసిన విమానాలను అవి ఢీ కొట్టాయి. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియాకు చెందిన మూడు విమానాలు దెబ్బ తిన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ఆదివారం సాయంత్రం బలమైన గాలులతో కూడిన వర్షం కురిసింది. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 2 వద్ద ఉన్న ఎయిర్ ఇండియాకు చెందిన ఇంజినీరింగ్ పరికరం, ఇండిగోకు చెందిన గ్రౌండ్ సపోర్ట్ ల్యాడర్ బలమైన గాలులకు కదిలి ముందుకు దూసుకెళ్లాయి.

## మాజీ సిఎం కుమార్తెపై ఇడి విచారణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్!

## వీణావిజయన్‌పై బిగుస్తున్న రూ.2.78 కోట్ల ఉచ్చు

**తిరువనంతపురం, జూన్ 8:** కేరళ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ వ్యవహారంలో మాజీసీఎం పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు గట్టి షాక్ తగిలింది. ఈ సంస్థపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జరుపుతున్న మనీ లాండరింగ్ దర్యాప్తును సవాల్ చేస్తూ కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ దాఖలు చేసిన అప్పీల్‌ను కేరళ హైకోర్టు కొట్టివేసింది.

ఈడీ దర్యాప్తు యథావిధిగా కొనసాగవచ్చని స్పష్టం చేసింది. వీణా విజయన్‌కు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ అనేది స్కూల్, కాలేజీ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్ తయారు చేసే ఒక చిన్న సంస్థ.

# ఇక కాల్పులు ఆపండి..ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్,జూన్ 8:** ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మరోసారి ఉద్రిక్తతలు తీవ్రమయిన తరుణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో చర్చలు ముగించాలనే తన నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు. ఈ శాంతి ప్రక్రియలో తనదే తుది నిర్ణయమని ట్రంప్ స్పష్టం చేశారు. ఇక్కడ అన్ని నిర్ణయాలు నేనే తీసుకుంటాను. నెతన్యాహు కాదు. భవిష్యత్తులో అమెరికాఇరాన్ మధ్య కుదిరే ఒప్పందాన్ని ఆయన అంగీకరించి తీరాల్సిందే అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇజ్రాయెల్ సరిహద్దులను లక్ష్యంగా చేసుకుని ఆదివారం రాత్రి ఇరాన్ భారీగా బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించిన విషయం తెలిసిందే. అంతకుముందు లెబనాన్ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ ఇజ్రాయెల్ దళాలు బీరుట్ శివార్లలో దాడులు చేశాయి. దీనికి ప్రతికారంగానే ఇరాన్ క్షిపణులతో విరుచుకు పడింది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఇజ్రాయెల్ ఆర్మీ సమర్థించుకుంది. ఇరాన్‌పై ఎదురుదాడి చేయొద్దని నెతన్యాహును ట్రంప్ కోరనున్నట్లు సమాచారం. ఇలాంటి సైనిక చర్యల వల్ల ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ మీరు క్షిపణులు ప్రయోగించారు. ఇక చాలు. ఇప్పుడైనా చర్చలకు వచ్చి ఒప్పందం చేసుకోండి అని పిలుపునిచ్చారు. అలాగే బీరుట్‌పై ఇజ్రాయెల్ చేసిన ముందస్తు దాడులపై కూడా ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకవేళ దౌత్యపరమైన చర్చలు విఫలమైతేపరిణామాలుంటాయని ట్రంప్ హెచ్చరించారు. చర్చలు ఫలించకపోతే ఇరాన్‌పై కమాండో దాడులు చేసే ఆలోచన కూడా ఉందన్నారు. మేం ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాం.ఇరాన్ వినకపోతే వారిపై బాంబులతో విరుచుకుపడతాం అని ఎన్‌బీసీ ట్రంప్ వ్యాఖ్యానించారు.

# ఆగస్టునుంచి కొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ వ్యవస్థ

**న్యూఢిల్లీ,జూన్ 8:** టికెట్ బుకింగ్ విధానంలో గత కొన్ని దశాబ్దాలుగా ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది. ఆగస్టు నుంచి సరికొత్త ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. దాదాపు 1986 నుంచి వాడుకలో ఉన్న పాత సాంకేతిక విధానాన్ని ఈ సరికొత్త వ్యవస్థతో పూర్తిగా మార్చేయనుంది. ఈ సరికొత్త అప్‌గ్రేడ్ వల్ల ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సామర్థ్యం నిమిషాల వ్యవధిలోనే లక్షలాది టికెట్లను ఎలాంటి సర్వర్ సమస్యలు లేకుండా బుక్ చేసుకోవచ్చు. ఈ కొత్త సిస్టమ్‌కు మారే ప్రక్రియపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సాంకేతిక మార్పుల సమయంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగరాదని అధికారులను ఆదేశించారు. రైల్వే శాఖ 2002 సంవత్సరంలో ఇంటర్నెట్ ఆధారిత టికెట్ బుకింగ్‌ను ప్రారంభించింది.

అప్పటి నుంచి కౌంటర్ల కంటే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేవారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న మొత్తం రైల్వే టికెట్లలో దాదాపు 88 శాతం బుకింగ్స్ కేవలం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే జరుగుతున్నాయి. ఈ భారీ డిమాండ్‌కు అనుగుణంగానే పాత వ్యవస్థను అధునాతన సాంకేతికతతో రైల్వే మారుస్తోంది. రైల్వే శాఖ డిజిటల్ విప్లవంలో భాగంగా గతేడాది జులైలో ప్రారంభించిన రైల్ వన్ యాప్ సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం ఏడాది లోపే ఈ యాప్ 3.5 కోట్ల డౌన్‌లోడ్లను దాటేసింది. ఈ ఒక్క యాప్ ద్వారానే టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, రైలు లైవ్ స్టేటస్, ప్లాట్‌ఫామ్ సమాచారం, ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. ప్రస్తుతం ఈ యాప్ ద్వారా రోజూ సుమారు 9.29 లక్షల టికెట్లు బుక్ అవుతున్నాయని రైల్వే శాఖ వెల్లడించింది. కొత్త సిస్టమ్‌తో పాటు ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వెయిటింగ్ లిస్ట్ టూల్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోంది. మనం బుక్ చేసుకున్న వెయిటింగ్ లిస్ట్ టికెట్ కన్ఫర్మ్ అవుతుందా లేదా అనే అవకాశాలను ఈ టూల్ ముందుగానే అంచనా వేస్తుంది. గతంలో 53 శాతంగా ఉన్న ఖచ్చితత్వం ఇప్పుడు ఏకంగా 94 శాతానికి పెరిగింది.

9-6Pg6exHMNWJQE.qxd:9-6Pg6exHMNWJQE.qxd 1/1/02 5:39 AM Page 1





## స్టీరింగ్ రాడ్ విరిగి పొలాల్లోకి ఆర్టీసి బస్సు

● 15 మంది ప్రయాణికులు క్షేమం

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న పంట పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. అయితే బస్సులో ప్రయాణిస్తున్న 15 మంది ప్రయాణికులు ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గన్నవరం డిపోకు చెందిన 220 నంబర్ ఆర్టీసీ బస్సు తెన్నేరు నుంచి గన్నవరం వైపు వెళ్తుండగా, తెన్నేరు-మంతెన మధ్య మార్గంలో ఒక్కసారిగా స్టీరింగ్ రాడ్ విరిగిపోయింది. దీంతో బస్సు నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, తోటి ప్రయాణికులు సహాయక చర్యలు చేపట్టి బస్సులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో బస్సులో సుమారు 15 మంది ప్రయాణికులు ఉన్నప్పటికీ ఎవరికీ గాయాలు కాకపోవడం విశేషం.

## ఎన్ఐఏ కస్టడీకి ఉగ్రవాద సానుభూతిపరులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 8 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కలకలం రేపిన ఉగ్రవాద సానుభూతిపరులను జాతీయ దర్యాప్తు సంస్థ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కస్టడీలోకి తీసుకుంది. కోర్టు అనుమతితో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి తీసుకువచ్చిన ఈ నిందితులను. ఐదు రోజుల పాటు జాంపేట మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎన్ఐఏ అధికారులు విచారించనున్నారు. గత మార్చిలో విజయవాడలో ముగ్గురు పట్టుబడగా, వారిచ్చిన సమాచారంతో దేశవ్యాప్తంగా ఏపీ, తెలంగాణ సహా 8రాష్ట్రాల్లో మొత్తం 13మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరంతా ఐసిస్, అల్‌ఖైదా వంటి ఉగ్రవాద సంస్థల భావజాలానికి ఆకర్షితులైనట్లు అధికారులు గుర్తించారు. దేశంలో ఏమైనా పేలుళ్లకు వీరు కుట్ర పన్నారా? అన్న కోణంలో నిందితుల కాల్ డేటా, సోషల్ మీడియా ఖాతాల ఆధారంగా ప్రత్యేక ప్రశ్నావళి ద్వారా ఎన్ఐఏ అధికారులు ప్రస్తుతం ఆరా తీస్తున్నారు. ఈ విచారణ సందర్భంగా జాంపేటలో అదనపు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

# తోతాపురికి మద్దతు ధర కల్పించాలి

● కేజీకి రూ.15 చెల్లించాలని మామిడి రైతులు డిమాండ్ ● కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా



తోతాపురి మామిడి కేజీకి రూ.15 చెల్లించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న మామిడి రైతు సంఘాల నాయకులు

**చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త:** ఈ మామిడి సీజన్‌లో తోతాపురి మామిడికి కేజీకి రూ.15 చెల్లించాలని మామిడి రైతులు డిమాండ్ చేశారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట పలు రైతు సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మామిడి రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ తోతాపురి మామిడి ధరలు గత వారం రోజులుగా భారీగా పతనం అయ్యాయని, ధరలు పతనం కావడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి సీజన్ ప్రారంభం అయినప్పటికీ జిల్లాలోని పలు గుజ్జు పరిశ్రమలు రైతుల నుండి మామిడిని సేకరించడం లేదని, జిల్లాలో ప్రస్తుతం 2 గుజ్జు పరిశ్రమలు మాత్రమే రైతుల నుండి మామిడిని తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నాయన్నారు. జిల్లాని అన్ని గుజ్జు పరిశ్రమలు రైతుల నుండి మామిడి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని పల్ప్ ఫ్యాక్టరీ ప్రస్తుతం తోతాపురి మామిడి కేజీని రూ.4 నుండి రూ.5కు మాత్రమే కొనుగోలు చేస్తున్నాయని, ఈ మామిడిని ఫ్యాక్టరీలకు విక్రయించడానికి రైతులు రోజుల తరబడి ఫ్యాక్టరీల ఎదుట పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొందని ధ్వజమెత్తారు. 2026 సంవత్సరం మామిడి సీజన్ ప్రారంభం అయినప్పటికీ మామిడి రైతు సంఘాల ప్రతినిధులు, మామిడి రైతులతో చర్చలు నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలోని మామిడి రైతులు, సంఘాల ప్రతినిధులతో చర్యలు ఎనిర్వహించిచి పెట్టుబడి ఖర్చులను నిర్ణయించి ప్రతి ఏడాది వరుస నష్టాలతో కుదేలవుతున్న మామిడి రైతులకు ఈ ఏడాది అయినా తోతాపురి మామిడి పెట్టుబడి ఖర్చు కేజీ రూ.18గా నిర్ణయించి ఈ మేరకు రైతులకు ధర చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని గుజ్జు పరిశ్రమలను ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది తోతాపురి మామిడి కేజీకి ప్రభుత్వం పెట్టుబడి ఖర్చు రూ.7 నిర్ణయించిందని, గత ఏడాది తోతాపురి మామిడి కేజీకి ఈ ప్రభుత్వమే రూ.12 నిర్ణయించి చెల్లించేలా చర్యలు తీసుకుందన్నారు.

ఈ ఏడాది తోతాపురి మామిడికి ప్రభుత్వం నిర్ణయించిన కేజీ రూ.7ను సైతం ఎక్కడా చెల్లించడం లేదని రైతు నాయకులు ఆరోపించారు. ప్రతి గుజ్జు ఫ్యాక్టరీ వద్ద మామిడి ధరల బోర్డును ఏర్పాటు చేయాలని, జిల్లా స్థాయి అధికారులతో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే పలుమార్లు డిమాండ్ చేసినా ఫలితం లేదని సత్వరం ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

జిల్లాలో జూన్ నెల ప్రారంభమైన కొన్ని గుజ్జు పరిశ్రమలు ఇప్పటికీ రైతుల నుండి మామిడి కొనుగోలు చేయడం లేదని కలెక్టర్ సత్వరం అలాంటి ఫ్యాక్టరీలతో చర్చించి మామిడి కొనుగోలుకు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జిల్లాలో ఉపాధి హామీ పథకంను మామిడి పంటకు అనుసంధానం చేస్తే రైతుకు కొంత మేరకు న్యాయం జరుగుతుందని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మామిడి పంటను సైతం బీమా పథకంలో చేర్పించి బీమా వర్తింపుకు చర్యలు తీసుకోవాలని, రైతులకు డిజిటల్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని, మామిడి రైతుకు 50 శాతం సబ్సిడీతో ఎరువులు, పురుగుల మందులు, పనిముట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మామిడి సంఘాల నాయకులు మునీశ్వర్‌రెడ్డి, ఉమాపతి, హేమలత, సంజీవరెడ్డి, బెల్లంకొండ శ్రీనివాసులు, ఉమాపతి నాయుడు, చెంగల్రాయరెడ్డి, త్యాగరాజులురెడ్డి, మోహన్ రెడ్డి, జయదేవయ్య, పెద్ద సంఖ్యలో మామిడి రైతులు పాల్గొన్నారు.

ధర్నా అనంతరం మామిడి సంఘాల నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి తోతాపురి మామిడికి గిట్టుబాటు ధర చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని, ఇతర సమస్యను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మామిడి రైతుల సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని నాయకులకు హామీ ఇచ్చారు.

# కలెక్టరేట్ ఎదుట రైతు ఆత్మహత్యాయత్నం

● తన భూమిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేసినా రెవెన్యూ నిర్లక్ష్యం

**చిత్తూరు, జూన్ 8 ప్రభాతవార్త:** తన భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని, తనకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా తనను అధికారులు నిర్లక్ష్యంగా చూస్తున్నారని క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులతో తనకు న్యాయం జరుగకపోవడం తో మీరే న్యాయం చేయాలని కోరుతూ ఓ రైతు సోమవారం కలెక్టరేట్ ఎదుట శరీరంపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. వి.కోట మండలంకు చెందిన రాఘవేంద్ర అనే రైతు తన భూమిని తన సోదరులు ఆక్రమించు కున్నారని, ఈ విషయంపై విచారించి తనకు న్యాయం చేయాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను కలసి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో క్షేత్రస్థాయి అధికారులతో తనకు న్యాయం జరుగని భావించిన రాఘవేంద్ర సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్‌కు ఈ విషయంగా ఫిర్యాదు చేయడానికి వచ్చారు. రైతు రాఘవేంద్ర తనతో పాటు కిరోసిన్ తీసుకుని కలెక్టరేట్ ఎదుట శరీరంపై తెచ్చుకున్న కిరోసిన్‌ను పోసుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడటంతో అక్కడే విధుల్లో వున్న పోలీసులు సత్వరం స్పందించి రాఘవేంద్ర ఆత్మహత్యాయత్నంను అడ్డుకున్నారు. ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన రాఘవేంద్రను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కలెక్టరేట్ ఎదుట రెవెన్యూ అధికారుల తీరును నిరసిస్తూ రైతు ఆత్మహత్యాయత్నంకు పాల్పడటం కలకలం రేపింది.



# అమరావతిలో రూ.200 కోట్లతో ఆప్కాబ్ ఐకానిక్ భవనం

**విజయవాడ జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిలో రూ.200 కోట్లతో ఆప్కాబ్ ఐకానిక్ భవనం రూపుదిద్దుకుంటోంది. ఇందులో భవన నిర్మాణానికి రూ.87 కోట్లు, ఇంటీరియర్ ఇతర సౌకర్యాలకు రూ.113 కోట్లను వెచ్చించనున్నారు. భవన నిర్మాణం ఇప్పటికే మొదలైంది. ఆప్కాబ్ భవన నిర్మాణానికి లింగాయపాలెంలో 0.495 ఎకరాల స్థలాన్ని సీఆర్‌డీఏ కేటాయించింది. జీ+17 అంతస్తులతో దీన్ని నిర్మిస్తున్నారు. చివరి అంతస్తులో హెలిప్యాడ్ ఉంటుంది. ఆప్కాబ్ పాలనా కార్యాలయం, ఐటీ విభాగాలు, ఛైర్మన్, ఎండీ ఛాంబర్ సహా వివిధ విభాగాలు ఉంటాయి. మొత్తం 2.09 లక్షల చదరపు అడుగుల్లో భవనం నిర్మిస్తారు. ఆప్కాబ్ అనే అక్షరాలు ప్రతిబింబించేలా ప్లాన్ డిజైన్ చేశారు. నిర్మాణ బాధ్యతల్ని ఏపీఐఐసీకి అప్పగించారు. ఐఐటీ హైదరాబాద్‌తో పాటు విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ నుంచి సాంకేతిక సహకారం తీసుకుంటున్నారు.

### ఆర్టీసీ బస్సుల్లో చోరీలకు పాల్పడుతున్న

# ముగ్గురు మహిళా నిందితుల అరెస్టు

● 32 గ్రాముల డైమండ్ గోల్డ్ నెక్లెస్ స్వాధీనం




**పాకాల, జూన్ 8 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పాకాల మండల పరిధిలో ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణికుల బ్యాగులు, హ్యాండ్ బ్యాగుల నుండి బంగారు ఆభరణాలు అపహరిస్తున్న ముఠాలపై జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పాకాల పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తును పాకాల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టి. చిన్న గోవిందు పర్యవేక్షణలో ఎస్ఐ తరుణ్, డబ్ల్యూఎస్ఐ నాగ మంజుల ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం చేపట్టింది. దర్యాప్తులో భాగంగా నిందితుల కదలికలను గుర్తించిన ప్రత్యేక బృందం ఈ నెల 7వ తేదీన సాయంత్రం శంఖంపల్లి ఫ్లైఓవర్ క్రింద ముగ్గురు మహిళా నిందితులను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసింది. అరెస్టు చేయబడిన నిందితులు జి. దివ్య (31), బి. రాధిక (38), బి. మేరీ (33)గా గుర్తించబడ్డారు. వీరంతా చిత్తూరు జిల్లా పరిధికి చెందినవారని పోలీసులు తెలిపారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించడంతో, వారి వద్ద నుండి కేసుకు సంబంధించిన సుమారు 32 గ్రాముల బరువున్న డైమండ్ గోల్డ్ నెక్లెస్ చైన్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆభరణం విలువ సుమారు రూ.3.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. అనంతరం నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు. మహిళా ప్రయాణికులే లక్ష్యం ప్రాథమిక విచారణలో నిందితులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలను లక్ష్యంగా చేసుకొని, రద్దీని ఆసరాగా తీసుకుని వారి బ్యాగుల్లోని విలువైన బంగారు ఆభరణాలను అపహరిస్తూ వచ్చినట్లు వెల్లడైంది. కేసును అత్యంత త్వరితగతిన ఛేదించి, నిందితులను అరెస్టు చేయడంతో పాటు దొంగిలించిన ఆభరణాన్ని రికవరీ చేసిన ఎస్ఐ తరుణ్, డబ్ల్యూఎస్ఐ నాగ మంజుల, ప్రత్యేక పోలీసు బృందాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ అభినందించారు.

# తల్లి ఆశలన్నీ ఆవిరి

● విద్యుత్ తీగ తొక్కిబాలుడు మృతి, వింజమూరులో విషాదం

**వింజమూరు (నెల్లూరు), జూన్ 8 ప్రభాతవార్త:** కన్న కొడుకు ఎదిగొచ్చి ఆసరాగా నిలుస్తాడనుకున్న తల్లి ఆశలు క్షణాల్లో ఆవిరయ్యాయి. వింజమూరు పట్టణంలోని చల్లా వారి వీధిలో సోమవారం చోటుచేసుకున్న విద్యుదాఘాత ఘటన అందరి హృదయాలను ద్రవింపజేసింది. చల్లా వారి వీధిలో నివాసం ఉంటున్న పేర్నేటి రాజా మమత దంపతుల కుమారుడు మహిదర్‌రెడ్డి (13), 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం వారి ఇంటి పక్కనే పాత బిల్డింగును కూల్చివేస్తుండగా కుతూహలంతో హేమంత్ అక్కడికి వెళ్లి చూస్తున్నాడు. ఆ సమయంలో డ్రిల్లింగ్ మిషన్‌కు సరఫరా అవుతున్న కరెంటు తీగ నేలపై ఉంది. చెప్పులు లేకుండా వెళ్లిన హేమంత్ పొరపాటున ఆ తీగను తొక్కడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అమ్మా అంటూ కింద పడిపోయాడు. అక్కడ పనిచేస్తున్న కూలీలు వెంటనే మహిధర్ రెడ్డిని వింజమూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే బాలుడు ప్రాణాలు విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లి మమత గుండెలవిసేలా రోధించింది.

మహిధర్‌రెడ్డి తండ్రి కొన్నేళ్ల క్రితమే ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తల్లి మమత కూలి పనులు చేస్తూ ఇద్దరు బిడ్డలను సాకుతోంది. రెక్కలు ముక్కలు చేసుకుని ఇద్దరినీ చదివిస్తున్నా, పెద్దవాడే నా ఆసరా అనుకున్నా, ఇప్పుడు వాడూ లేకుండా పోయాడు అంటూ ఆ తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే చూపరుల హృదయాలు బరువెక్కాయి. మహిధర్ మృతితో చల్లా వారి వీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఉమా మహేశ్వర తెలిపారు.

## బాలల కథల పోటీలకు ఆహ్వానం

ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఒంగోలు నగరంలోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో 2026 డిసెంబర్ 5, 6 తేదీలలో జరగనున్న నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు బాలలు సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో బాలబాలికల కోసం తెలుగు కథల రచనా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు గజల్ శ్రీనివాస్ ప్రకటించారు. తెలుగు భాషా సాహిత్యాల పట్ల చిన్నారుల్లో ఆసక్తి పెంపొందించడం, సృజనాత్మక రచనా నైపుణ్యాలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలు రెండు విభాగాలలో నిర్వహించబడతాయి. మొదటి విభాగం 6 నుండి 10 సంవత్సరాల లోపు పిల్లలకు, రెండవ విభాగం 11 నుండి 16 సంవత్సరాల లోపు పిల్లలకు ఉద్దేశించారు. కథలు పంపడానికి 31 జూలై చివరి తేదీగా ఉంది. 10 ఆగస్టు 2026. ఫలితాలు విడుదల చేస్తారు. ప్రథమ బహుమతిగా రూ.3,116/ద్వితీయ బహుమతిగా రూ.2,116/ తృతీయ బహుమతి 1,116/ మూడు ప్రోత్సాహక బహుమతులు - రూ.516/ చొప్పున ఇస్తారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రం, పతకం ప్రపంచ తెలుగు మహాసభల వేదికపై అందజేయబడతాయి. సంప్రదించవలసిన ఫోన్ నంబర్: 99497 35253 తెలుగు భాషను ప్రేమించే చిన్నారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా బాలల ప్రపంచ తెలుగు మహా సభల కార్యక్రమాల అంతర్జాతీయ, జాతీయ సమన్వయకర్తలు రాధికా మంగిపూడి, కొల్లి రమావతి కోరారు.

### విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో మృతులకు

## కోటి పరిహారం చెల్లించాలి

● సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ స్టీల్‌ప్లాంట్ ఘోర ప్రమాదంలో మరణించిన 9 మంది కార్మికులకు సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. ఊహించని ఈ ప్రమాదంలో 9 మంది మరణించారు. అనేకమంది తీవ్రంగా గాయపడటం పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మరణించిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. మరణించిన వారి కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసింది. గాయపడిన ప్రతి ఒక్కరికి రూ.50 లక్షలు ప్రకటించాలని, తక్షణం మెరుగైన వైద్య సహాయం అందించాలని కోరింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక పత్రికా ప్రకటనను విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని ప్రయివేటీకరించేందుకు ఉద్దేశపూర్వకంగానే నిరక్ష్యల్ల వహించడం వల్లనే ఈ ప్లాంటు పూర్తిగా దెబ్బతింటున్నదని పేర్కొంది. అందువల్ల ఈ మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపింది. కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి దీనిపై ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వాలని కోరింది. తక్షణమే ఈ ప్రమాద కారణాలపై విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ ప్యాకేజీ ప్రకటిస్తున్నామని, ఆధునికరిస్తున్నామని చేసిన ప్రకటనలు ఆర్భాటానికేనని తేలిపోయిందని పేర్కొంది.

# విద్యుత్ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ సంస్థ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 60 వినతులు అందాయి. ఈ కార్యక్రమం ద్వారా పలువురు వినియోగదారులు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912, 1800 425 155333కు కాల్ చేయడం, వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఎస్‌పిడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్‌డి) కె.గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఏసి) కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళికుమార్, ఎన్.శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, సిహెచ్ రామచంద్రరావు, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు సురేంద్రరావు, చక్రపాణి, జగదీష్, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయి

కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్



**శ్రీకాకుళం, జూన్ 8 ప్రభాతవార్త:** దేశ రాజకీయాలు, రాష్ట్ర రాజకీయాలు భ్రష్టు పట్టిపోయాయని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, బిజెపి పాలనలో రూపాయి విలువ క్షీణించింది. ఆక్వాతో సహా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు ఆగిపోయింది. మోడీ, బిజెపి పాలనలో గొప్ప ఆర్థిక సంక్షోభం దేశంలో నెలకొంది. పివి నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు, బంగారం ఎగుమతులు చేసి, విదేశీ మారకద్రవ్యం తెచ్చాము. ప్రతి ఇంట్లో ఆర్థిక సంక్షోభం మొదలైంది. గ్రామాల్లో ప్రతి ఇంట్లో రూ.200లకు మించి డబ్బు లేదు. ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం ఉన్నది. మోడీ, చంద్రబాబు, జగన్ ముగ్గురు ఫెయిల్ అయ్యారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే నర్సులకు మూడు నెలలుగా జీతాలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదు. ఆరు లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. 8 సంవత్సరాలుగా పీఆర్సీ ప్రకటించలేదు. నాలుగు డిఎలు పెండింగ్‌లో వుంది. ప్రభుత్వ ఉద్యోగులు అప్పుల్లో ఉన్నారు. ఇంటి అద్దెలు కట్టుకోలేకపోతున్నారు. పిల్లలను చదివించలేకపోతున్నారు. మూడు రూపాయల వడ్డీలకు తెచ్చి, కష్టాలు పడుతున్నారు. వారం లోపు పిఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తిరుపతి విమానాశ్రయాన్ని అద్వానీకి అమ్మాలని అనుకుంటున్నారు. తిరుపతి విమానాశ్రయం వైబులిటీ తగ్గించేదానికి, చిన్న విమానాలు ఇస్తున్నారు. ఢిల్లీ, ముంబై వంటి నగరాల నుంచి విమానాలు తిరుపతికి రావడం లేదు. ఒక్క అంతర్జాతీయ విమాన సర్వీస్ కూడా నడపడం లేదు. తిరుపతి విమానాశ్రయం ప్రైవేటీకరణ చేస్తే, చంద్రబాబు, రామ్మోహన్ నాయుడు ఇరువురూ నష్టపోతారని చింతామోహన్ హెచ్చరించారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నాం. వ్యతిరేకిస్తున్నాం అని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి నరసింహామూర్తి, షణ్ముఖరావు, మామిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

## పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు బెదిరింపులు

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయి. ఈ మేరకు పెనమలూరు పోలీసు స్టేషన్‌లో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఫిర్యాదు చేశారు. తన కుటుంబాన్ని చంపేస్తానని మాలంపాటి భాస్కర్‌రెడ్డి బెదిరించాడని ఎమ్మెల్యే ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఫిర్యాదుతో మాలంపాటి భాస్కర్‌రెడ్డిపై కేసు పోలీసులు నమోదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో సిఎం చంద్రబాబు, లోకేశ్‌పై దుష్ప్రచారం చేశారని గతంలోనే భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేసారు. ఈ క్రమంలో మాలంపాటి వివిధ రీతుల్లో బోడే ప్రసాద్‌ను ఆయన కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నది అభియోగం. ఈ అంశంపై కేసును నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ప్రస్తుతం మాలంపాటి భాస్కర్‌రెడ్డి యుకెలో ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాల ద్వారా పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

## మల్లవరపు ప్రకాష్ మృతికి సిఎం చంద్రబాబు సంతాపం

**విజయవాడ, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖకు చెందిన క్రైస్తవ మత బోధకులు, విశ్రాంత ఆర్చ్ బిషప్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్ మృతి పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ మల్లవరపు ప్రకాష్ సమాజానికి చేసిన సేవలు ఎనలేనివని సిఎం వ్యాఖ్యానించారు. కడప, విజయవాడ, విశాఖపట్నంలో బిషప్‌గా సుదీర్ఘకాలం పాటు ఆయన అందించిన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సిఎం పేర్కొన్నారు. ప్రకాష్ కుటుంబ సభ్యులకు, క్రైస్తవ మత పెద్దలకు వారి అనుచరులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**మంత్రి నారా లోకేష్ తీవ్ర సంతాపం:** విశాఖపట్నం విశ్రాంత ఆర్చ్ బిషప్, మోస్ట్ రెవ. డాక్టర్ ప్రకాష్ మల్లవరపు మృతికి ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ తీవ్ర సంతాపం ఎక్స్‌వేదికగా చేసిన పోస్టులో తెలిపారు. పరలోకపు తండ్రి పిలుపు పొంది ఉన్నారు. వారు భౌతికంగా మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. విద్యాధికులైన విశ్రాంత ఆర్చ్ బిషప్ ఆధ్యాత్మిక సేవకు తన జీవితాన్ని అంకితం చేశారు. విజయవాడ బిషప్‌గా, కడప బిషప్‌గా, ఏలూరు డయాసిస్ అపోస్టోలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా, విశాఖపట్నం మెట్రోపాలిటన్ ఆర్చ్ బిషప్‌గా, శ్రీకాకుళం అపోస్టోలిక్ అడ్మినిస్ట్రేటర్‌గా ఎనలేని సేవలు అందించారు. ఆదర్శవంతమైన జీవనశైలి, వినయం, ప్రేమతో పేదల సేవలో తరించిన విశ్రాంత ఆర్చ్ బిషప్ ప్రకాష్ మల్లవరపు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, నివాళి అర్పిస్తున్నానని మంత్రి పేర్కొన్నారు.

### పద్మావతి వర్సిటీ అధ్యాపక నియామకాల

# దరఖాస్తుల గడువు పొడిగింపు

**తిరుపతి, జూన్ 8 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళ విశ్వవిద్యాలయం తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అధ్యాపక నియామకాలకు సంబంధించి దర ఖాస్తు ప్రక్రియకు మరో వారంరోజులు గడువు పొడిగించారు. దరఖాస్తులను పూర్తి చేయడానికి మరింత సమయం కల్పించాలని అభ్యర్థుల నుండి వచ్చిన వినతులను పరిగణనలోకి తీసుకొని, కొనసాగు తున్న ఫ్యాకల్టీ రిక్రూట్‌మెంట్ -2026 ప్రక్రియకు సంబంధించిన గడువులను మరో వారం రోజుల పాటు పొడిగించాలని నిర్ణయిం చారు. దీననుసరించి, ఎపి కామన్ రిక్రూట్ మెంట్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు సమ ర్పణ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపుకు తుది గడువు ను ఈనెల 15వ తేదీ వరకు పొడిగించారు. దరఖాస్తు హార్డ్ కాపీతో పాటు అవసరమైన అన్ని పత్రాలను రిజిస్టర్డ్ పోస్టు / స్పీడ్ పోస్టు / కొరియర్ ద్వారా పంపించడానికి ఉన్న చివరి తేదీ జూన్ 22 వరకు పొడిగించారు. ప్రాథమిక పరిశీలన అనంతరం అర్హులు అనర్హుల జాబితాను ఈనెల 29 వరకు సవరించారు. అలాగే ప్రాథమిక అర్హతలపై అభ్యంతరాలను స్వీకరించడానికి జులై 6వరకు గడువిచ్చారు. తుది అర్హుల జాబితాను జులై 7న ప్రకటిస్తారు. ఇప్పటివరకు కామన్ రిక్రూట్‌మెంట్ పోర్టల్ ద్వారా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయని అభ్యర్థులు ఈనెల 15వతేదీ లోపు తప్పనిసరిగా పూర్తి చేయవలెనని విశ్వవిద్యాలయం కోరింది. దరఖాస్తు హార్డ్ కాపీతో పాటు అవసరమైన అన్ని ధ్రువపత్రాలు అనుబంధ పత్రాలు జూన్ 22వ తేదీ లోపు రిజిస్ట్రార్, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతికి రిజిస్టర్డ్ పోస్టు/ స్పీడ్ పోస్టు / కొరియర్ ద్వారా చేరాలి. ప్రస్తుత నియామక ప్రక్రియకు సంబంధించిన తదుపరి సమాచారం, మార్గదర్శకాలు నవీకరణల కోసం అభ్యర్థులు ఎపి కామన్ రిక్రూట్‌మెంట్ పోర్టల్‌ను క్రమం తప్పకుండా పరిశీలించవలసిందిగా సూచించారు.

9-6Pg7exHMNWJQE.qxd:9-6Pg7exHMNWJQE.qxd 1/1/02 7:04 AM Page 1



# పాత సింగరాయకొండ బావిలో లభ్యమైన మృతదేహం

## హైదరాబాద్ బిటెక్ విద్యార్థి రాహుల్‌గా గుర్తింపు

### ర్యాగింగ్ అనుమానాలు.. రాహుల్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు



మృతుడి స్నేహితులను ప్రశ్నిస్తున్న పోలీస్ అధికారి

**సింగరాయకొండ,జూన్ 8, ప్రభాతవార్త** మండలంలోని పాత సింగరాయకొండ గ్రామంలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి చెందిన పూలతోటలోని వాడుకలో లేని బావిలో ఇటీవల లభ్యమైన గుర్తుతెలియని యువకుడి మృతదేహం కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో అదృశ్యమైన బీటెక్ విద్యార్థి రాహుల్‌గా మృతుడిని కుటుంబ సభ్యులు గుర్తించినప్పటికీ, డీఎన్‌ఏ పరీక్షల అనంతరమే పూర్తి నిర్ధారణకు వచ్చే అవకాశముందని పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన రాహుల్ హైదరాబాద్‌లోని మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మే 27న ఇంటికి వెళ్తున్నానని చెప్పి స్నేహితుడు బైక్ మీద కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు నాలుగు రోజులైన ఇంటికి రాకపోతే అంత గాలించి ఎక్కడ ఆచూకీ కనపడక పోవడంతో మే 31 కాచిగూడ పోలీస్ స్టేషన్ లో తండ్రి రాజేష్ పిర్యాదు చేయడం తో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దీనితో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు రైల్వే స్టేషన్ లో శబరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించినట్లు సీసీటీవీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. ఇదిలా ఉండగా, మే 30న సింగరాయకొండలోని స్వామివారి తోట బావిలో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభించింది. మృతుడి వద్ద ఉన్న ఎర్రటి టీషర్ట్, మెడలోని ఆంజనేయస్వామి లాకెట్ తదితర ఆధారాలను పోలీసులు సోషల్ మీడియా, పత్రికల ద్వారా ప్రచారం చేశారు. ఈ సమాచారం రాహుల్ కుటుంబ సభ్యులకు చేరడంతో వారు సింగరాయకొండకు వచ్చి ఆధారాలను పరిశీలించి మృతుడిని తమ కుమారుడిగా గుర్తించారు. సోమవారం తెలంగాణ, సింగరాయకొండ పోలీసులు కుటుంబ సభ్యులతో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహం లభ్యమైన బావితో పాటు ఖననం చేసిన ప్రదేశాన్ని కూడా వారికి చూపించారు. రాహుల్ తండ్రి అంకం రాజేష్ మాట్లాడుతూ, తన కుమారుడు హాస్టల్ నుంచి అదృశ్యమైన తర్వాత మిస్సింగ్ కేసు నమోదు చేశామని తెలిపారు. వందల కిలోమీటర్ల దూరంలోని సింగరాయకొండకు రాహుల్ ఎలా చేరుకున్నాడనే విషయంపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఇది ఆత్మహత్యా, హత్యా అన్నది తేల్చాలని, కాలేజీలో ర్యాగింగ్‌కు సంబంధించిన అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని పోలీసులను కోరారు. సీఐ శ్రీహరి మాట్లాడుతూ, మే 30న బావిలో గుర్తించిన మృతదేహాన్ని యువనేస్తం ఫౌండేషన్ సభ్యుల సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం, ఫోరెన్సిక్ అనంతరం ఖననం చేసినట్లు తెలిపారు. మృతుడి వద్ద లభించిన ఆధారాల ఆధారంగా ప్రచారం చేయడంతో కుటుంబ సభ్యులు స్పందించారని చెప్పారు. మృతదేహం వద్ద లభించిన టీషర్ట్, లాకెట్ తదితర వస్తువులను కుటుంబ సభ్యులకు చూపించగా, వారు రాహుల్‌గా గుర్తించినట్లు తెలిపారు. అయితే పూర్తి నిర్ధారణ కోసం కుటుంబ సభ్యుల డీఎన్‌ఏ నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.



ఎంపి సానా సతీష్‌కు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్నఆలయ సిబ్బంది

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా యోగాంధ్ర

**ఇంద్రకీలాద్రి, జూన్ 8, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రం లోని ముఖ్య దేవాలయాల్లో ఖాళీగా ఉన్న వేదపారాయణదారులు, అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు, వంట స్వాములు తదితర ధార్మిక పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి, పరిశీలన అనంతరం హాల్ టిక్కెట్లు జారీ చేసి మొదటగా వేదపారాయణదారులుకు పరీక్ష నిర్వహిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ అన్నారు. వేదపారాయణదారుల పోస్ట్ లకు సంబంధించిన మౌఖిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మాడపాటి అతిధి గృహంలో దేవదాయ కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి రాష్ట్రంలో అన్ని ఆలయాలలో ఖాళీగా ఉన్న వైదిక సిబ్బంది పోస్టులు అన్నీ భర్తీ చేయాలని ఆదేశించిన మేరకు వైదిక సిబ్బంది ఖాళీల వివరాలన్ని సేకరించి, భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించగా, ప్రభుత్వం సెంట్రలైజెడ్ ఎ రీ క్ష నిర్వహించి, పూర్తి పారదర్శకత్వంతో ప్రతిభకే పట్టం కట్టే విధంగా నియామకాలు జరుపాలని ఆదేశించిందని రామచంద్ర మోహన్ పేర్కొన్నారు. 342 ధార్మిక పోస్టులకు గానూ రాష్ట్రవ్యాప్తంగా 5వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని, శ్రీకాకుళం నుండి కృష్ణా జిల్లా గల మల్టీజోన్1 వేదపారాయణదారుల అభ్యర్థులకు విజయవాడ మాడపాటి అతిధి గృహంలో వేరే జోన్ కు చెందిన పండితులు అర్హత పరీక్ష జరుపుతుండగా, వేరే జోన్ కు చెందిన ఇద్దరు డిప్యూటీ కమిషనర్లు పర్యవేక్షణ చేస్తున్నారని, గుంటూరు నుండి రాయలసీమ వరకు గల మల్టీ జోన్ 2 అభ్యర్థులకు ఇదే విధంగా సీతానగరంలో పూర్తి పారదర్శకంగా ఈనెల 16 వరకు మౌఖిక పరీక్షలు జరుగుతాయని రామచంద్ర మోహన్ వివరించారు. ఈ మౌఖిక పరీక్షల్లో పారదర్శకత వహించి, ప్రతిభావంతులకే పట్టం కట్టెందుకు పరీక్షల నిర్వహణ అంతా వీడియో లైవ్ రికార్డింగ్ చేస్తున్నామని, వేదపారాయణదారు పోస్టుల భర్తీలో విద్యార్హతలు, వేదార్హతలు, అనుభవం, మౌఖిక పరీక్షలలో ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించి, మెరిట్ జాబితా రూపకల్పన జరుగుతుందని, మూడు ఇంటర్వ్యూ బోర్డులు ఏర్పాటు చేసామని, ఏ అభ్యర్థి ఏ ఇంటర్వ్యూ బోర్డుకు వెళ్తారో ఆఖరు నిమిషం వరకు అభ్యర్థికి తెలియదని కమిషనర్ వెల్లడించారు. వేదపారాయణదారు పోస్టుల ఎంపిక ప్రక్రియ పూర్తయిన అనంతరం అర్చకులు, పరిచారకులు, భజంత్రీలు తదితర పోస్టుల భర్తీని దశలవారీగా పూర్తి చేస్తామని రామచంద్ర మోహన్ పేర్కొన్నారు.

- దుర్గమ్మవారి సేవలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి :

రాజ్యసభ సభ్యులు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ గారు

రెండోసారి రాజ్యసభకు ఎంపికైన ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ సోమవారం దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పండితులు ఆయనకు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు మరియు చిత్రపటాన్ని ఆలయ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్ బహుకరించారు.

- నిత్యాన్నదాన పథకానికి విరాళాలు:

దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తాడేపల్లికి చెందిన ఐ అండ్ పి ఆర్ ఉద్యోగి వేమూరి ప్రసాద్, వెంకటలక్ష్మి దంపతులు వారి పదవీ విరమణ సందర్భంగా పార్టీ అల్లుడు కృష్ణ కుమార్తె సాయి సింధూర పేర్ల మీద నిత్య అన్నదాన పథకమునకు రూ.1.01,116లు మరియు ఎండాడ, విశాఖపట్నం వాస్తవ్యులు కె త్రినాధ రెడ్డి ఝాన్సీ రాణి దంపతులు రూ.1,01,116లు మరియు భీమునిపట్నం విశాఖపట్నం వాస్తవ్యులు ఎం మాల్యాద్రి వెంగమ్మ దంపతులు రూ.1,01,116లువిరాళమును అందించారు. దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

- ఉత్సాహంగా యోగాంధ్ర :

ఇంద్రకీలాద్రిపై ఉత్సాహంగా యోగాంధ్ర కార్యక్రమం రెండవ రోజు సోమవారం కొనసాగింది. గర్రె రాజేష్ రెండవ రోజు శిక్షణలో భాగంగా మానసిక ఒత్తిడిని తగ్గించే ప్రత్యేక ఆసనాలు మరియు శ్వాస ప్రక్రియకు (ప్రాణాయామం) సంబంధించిన విధివిధానాలను ప్రాక్టికల్‌గా వివరించారు. జూన్ 21వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం ఇంద్రకీలాద్రిపై ఈ ఉచిత యోగా శిక్షణ నిరంతరాయంగా కొనసాగుతుందని, భక్తులు, విజయవాడ నగర వాసులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇఓ తెలిపారు.

# బీహార్ రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణమే సహాయ చర్యలు

## : మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**నెల్లూరు, జూన్ 8, ప్రభాతవార్త - వైద్యం** బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా యాత్రికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని, బాధితులకు సత్వర సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరు సంతపేటలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గయా నుంచి వారణాసికి వెళ్తున్న యాత్రికుల బస్సు ఔరంగాబాద్ సమీపంలో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రయాణిస్తున్నారని, ఉదయం 5 గంటల సమయంలో సమాచారం అందిందని చెప్పారు. బస్సులో మొత్తం 45 మంది ప్రయాణిస్తున్నారని, వారిలో ఇద్దరు డ్రైవర్లు, ఒక వంటమనిషి, 42 మంది యాత్రికులు ఉన్నట్లు తెలిపారు. ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, 15 మంది గాయపడ్డారని వెల్లడించారు. మృతి చెందిన వారిలో టూర్ అటెండెంట్, వంటమనిషి, ఒక మహిళా యాత్రికురాలు ఉన్నారని చెప్పారు. సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కార్యాలయం, ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చి సహాయక చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘటనపై వెంటనే స్పందించి బాధితులకు అత్యవసర సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు. గయా నుంచి నెల్లూరు జిల్లాకు రోడ్డు మార్గంలో రావడానికి 38 గంటలకు పైగా సమయం పడుతుందని, ఈ నేపథ్యంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల మృతదేహాలను సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో గయా నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తీసుకువస్తామని మంత్రి తెలిపారు. అక్కడి నుంచి జిల్లా అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక వాహనాల ద్వారా వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో గాయపడిన 15 మంది యాత్రికులకు గయాలోని మెడికల్ కాలేజీలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. క్షతగాత్రులను కూడా ప్రత్యేక విమానంలో చెన్నైకి తీసుకువచ్చి, అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా అధికారుల సహకారంతో నెల్లూరు జిల్లాకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి బీహార్ అధికారులతో సమన్వయం కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. ఢిల్లీలోని ఆంధ్రభవన్ కమిషనర్ ఆధ్యా శ్రీకాంత్ బీహార్ ప్రభుత్వ అధికారులతో, సీఎంవో అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నారని చెప్పారు. బీహార్‌లో పనిచేస్తున్న సీనియర్ తెలుగు ఐఏఎస్ అధికారి డా. రాజేందర్ కుమార్, ఐపీఎస్ అధికారి వివేక్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని మంత్రి వెల్లడించారు ఈ ప్రమాదంలో మొత్తం ముగ్గురు భక్తులు మృతి



చెందడం అత్యంత బాధాకరమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని సంగం, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరు నుంచి ఈనెల 1న ప్రైవేట్ బస్సు లో గయా, వారణాసి యాత్రకు వెళ్లిన భక్తులు ప్రమాదానికి గురికావడం తీవ్ర విచారం కలిగించిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారికి అవసరమైన వైద్య సహాయం అందేలా అధికారులు నిరంతరం చర్యలు చేపడుతున్నారని తెలిపారు.



# మనం శత్రువులం కాదు..మిత్రులం.!

## భారత్‌కు చైనా స్నేహహస్తం

**బీజింగ్,జూన్ 8:** భారత్ పట్ల చైనా తన వైఖరిని మార్చుకుంటోంది. ఇప్పుడు మనం మిత్రులం అంటూ స్నేహహస్తం అందిస్తోంది. భారత్, చైనాలు ప్రత్యర్థులు లేదా వ్యతిరేక శక్తులు కాదని, ఒకరి అభివృద్ధికి మరొకరు ముప్పుగా కాకుండా అవకాశాలుగా నిలిచే సహాయకారి భాగస్వాములు అని చైనా చెప్పింది. సోమవారం చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, చైనాలతో రష్యాకు ఉన్న సంబంధాలను ప్రస్తావిస్తూ ఇటీవల పుతిన్ చేసిన వ్యాఖ్యల తర్వాత డ్రాగన్ కంట్రీ నుంచి ఈ కామెంట్స్ వచ్చాయి. భారత్, చైనాలు సహకార భాగస్వాములు అభివర్ణించిన లిన్ జియాన్, ప్రస్తుతం రెండు దేశాల సరిహద్దుల్లో సాధారణ స్థితి ఉందని చెప్పారు. ఇరు దేశాల మధ్య సమాచార మార్గాలు సజావుగా ఉన్నట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య సానుకూల సంబంధాలు రెండు దేశాలకే కాకుండా మొత్తం ఆ ప్రాంతానికి చాలా ముఖ్యమైనవి అని అన్నారు. ఇరు పక్షాల సంబంధాలు వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో చూడాలని ఆయన తెలిపారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని చైనా చెప్పింది. రష్యా, భారత్, చైనా సంబంధాల గురించి మాట్లాడుతూ మూడు వర్ధమాన దేశాలని, ఈ దేశాల మైత్రి ప్రపంచ శాంతి, స్థిరత్వానికి ప్రయోజనకరమని అన్నారు. దీనికి ముందు రష్యా అధ్యక్షుడు భారత్‌చైనా సంబంధాల గురించి మాట్లాడుతూ రెండు దేశాల మధ్య సంబంధాలు చాలా సున్నితమైనవిగా,

బహుపాక్షికమైనవిగా అభివర్ణించారు. రెండు దేశాల మధ్య మూడో పక్షం జోక్యం చేసుకోవడం తగదని ఆయన అన్నారు. రష్యాకు రెండు దేశాలు మిత్రలే అని చెప్పారు. సరిహద్దు వివాదం వంటి సున్నితమైన అంశాలతో సహా పరస్పర ఆసక్తి ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించడానికి మోడీ, జిన్ పింగ్ కృషి చేస్తున్నట్లు చెప్పారు.

# అక్రమంగా తెల్లరాయి రవాణా

## - గ్రామస్తుల ఫిర్యాదుతో లారీ సీజ్ చేసిన పోలీసులు

**వింజమూరు (నెల్లూరు), జూన్ 8, ప్రభాతవార్త :** వింజమూరు మండల పరిధిలోని జనార్ధనపురంలో అక్రమంగా తీసిన తెల్లరాయి తరలిస్తున్న లారీని స్థానిక గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తెల్లరాయిని తరలిస్తున్నారని ఆరోపిస్తూ గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న వింజమూరు ఎస్ఐ ఉమామహేశ్వరరావు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని లోడుతో ఉన్న లారీని డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న లారీని వింజమూరులోని అగ్నిమాపక కేంద్రం ఆవరణలో భద్రపరిచారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. గతంలో కూడా జనార్ధనపురం నుంచి అనధికారికంగా తెల్లరాయిని తరలించేందుకు ప్రయత్నించారని గ్రామస్తులు తెలిపారు. అప్పట్లో పోలీసు అధికారులు స్పందించి, గనుల శాఖ అనుమతి లేకుండా రాయిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో అతడు తరలింపు ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

అయితే ఇటీవల గ్రామస్తుల కళ్లుగప్పి ఒక లోడు తెల్లరాయిని అక్రమంగా తరలించాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. మిగిలిన మరో లోడు రాయిని సోమవారం తరలించేందుకు యత్నించగా అప్రమత్తమైన గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అక్రమ తెల్లరాయి తవ్వకాలు పై గనుల శాఖ అధికారులకు సమాచారం అందించమన్నారు. సహజ వనరులను

ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

# ఢిల్లీలో తగ్గిపోతున్న పచ్చదనం

## కాలుష్యంతో ప్రమాదాలు - హైకోర్టు అసహనం

**న్యూఢిల్లీ,జూన్ 8:** దేశ రాజధాని నగరం ఢిల్లీలో పచ్చని ప్రదేశాలు వేగంగా తగ్గిపోతున్నాయని ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా న్యూ ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ పరిధిలో మిగిలి ఉన్న కొద్దిపాటి గ్రీన్ స్పేస్‌లను కూడా స్వాధీనం చేసుకుంటే, భవిష్యత్తులో ప్రజలు ఊపిరాడక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. ఢిల్లీలోని జిమ్ఖానా క్లబ్, పోలో గ్రౌండ్ సహా పలు ఆస్తులను కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అంశంపై దాఖలైన పిటిషన్‌ను విచారిస్తున్న సందర్భంగా ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. పోలో అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా, ఇప్పటికే ఢిల్లీలో పచ్చదనం గణనీయంగా తగ్గిపోతున్న పరిస్థితిని కోర్టు ప్రస్తావించింది. ముఖ్యంగా ఎన్‌డీఎంసీ పరిధిలో ఉన్న కొద్దిపాటి పచ్చని ప్రదేశాలు నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించే ఊపిరితిత్తుల్లా పనిచేస్తున్నాయని పేర్కొంది. అలాంటి ప్రాంతాలను కూడా ఇతర అవసరాల కోసం వినియోగిస్తే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి కోర్టు కీలక ప్రశ్నలు సంధించింది. స్వాధీనం చేసుకోబోయే భూములపై ఎత్తైన భవనాలు లేదా ఇతర భారీ నిర్మాణాలు చేపట్టే ఆలోచన ఉందా అని ప్రశ్నించింది. పచ్చని ప్రదేశాలు తగ్గిపోతే నగరంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, ప్రజల జీవన ప్రమాణాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని కోర్టు పేర్కొంది. ఎన్‌డీఎంసీ పరిధిలో ప్రజలు ఊపిరి పీల్చుకునేందుకు మిగిలి ఉన్న కొద్దిపాటి స్థలాలు కూడా కనుమరుగైతే, భవిష్యత్తులో అందరం ఊపిరాడక ఇబ్బంది పడాల్సి వస్తుంది. దేవుడే అందర్నీ కాపాడాలంటూ ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది.

# 10 నుంచి భవన నిర్మాణ కార్మికుల బంద్

- సెంట్రింగ్ కాంట్రాక్టర్ల అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి
- భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ
- మద్దతు తెలిపిన హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్



ధర్నానుద్దేసించి ప్రసంగిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ధర్నాచౌక్, జూన్ 8, ప్రభాతవార్త:** ఈనెల 10 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు బంద్ పాటిస్తున్నట్లు భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం నేతలు స్పష్టం చేశారు. సోమవారం సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, తాపీ మేస్త్రీలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ సభ పేరుతో ధర్నా నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సూర వెంకటయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు సాయికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మురుగు యాదగిరి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చొక్కాపురం శ్రీరాములు, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఆదిరాల రవికుమార్ పాల్గొని తమ తాపీ మేస్త్రీల సమస్యలపై ప్రసంగించారు. ధర్నాకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండి, తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. కార్మిక శాఖ నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాలు కార్మికులందరికీ అందాలని తెలిపారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ మాట్లాడుతూ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, తాపీ మేస్త్రీలు అన్నదమ్ముల వంటి వారని, రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖామంత్రి వీరి మధ్య రాజీ కుదర్చాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులంతా ర్యాలీగా వెళ్లి అన్ని పోలీస్‌స్టేషన్లలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. తాపీ మేస్త్రీలపై సెంట్రింగ్ కాంట్రాక్టర్లు చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, భేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరారు. కార్మిక సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన సంక్షేమ బోర్డు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, తాపీ మేస్త్రీల ధరలు పెరగాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించి, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షం పోరాటాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంకు తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి భవన నిర్మాణ కార్మికులు వేలాదిగా తరలి వచ్చారు.

# కొత్త అణ్వాయుధ వ్యవస్థలు పెంచుకుంటున్న భారత్ పాక్‌దేశాలు

## స్టాక్‌హోం కేంద్రంగా ఉన్న సిప్రీ సర్వే నివేదికలో ప్రస్తావన

**న్యూఢిల్లీ, జూన్ 8:** భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు అంతర్జాతీయ సర్వేసంస్థలు చెపుతున్నాయి. బాలిస్టిక్ క్షిపణులకు వార్‌హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ ఇన్స్‌టిట్యూట్ సిప్రీ తన నివేదికలో ప్రస్తావించింది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాలసంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతో పాటు వార్‌హెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యవూహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వద్ద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత ఏడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండేవని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది. భారత్ తన యుద్ధ విమానాలు, నేల నుంచి ప్రయోగించే మిస్సైళ్లు, అణ్వాయుధ సామర్థం కలిగిన జలాంతర్గామిలకు న్యూక్లియర్ వెపన్స్‌ను అమర్చినట్లు కూడా ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా అదనపు మిస్సైళ్ల కోసం మరికొన్ని వార్‌హెడ్స్‌ను కూడా తయారు చేస్తున్నట్లు సిప్రి తన రిపోర్టులో చెప్పింది. ఆ వార్‌హెడ్స్ ఉన్న క్షిపణులను కంటైనర్లకు తరలిస్తున్నట్లు రిపోర్టులో చెప్పారు. సిప్రీ అంచనాల ప్రకారం ఈ ఏడాది జనవరి నాటికే స్వల్ప సంఖ్యలో ఉన్న వార్‌హెడ్స్‌ను ఇండియా తన జలాంతర్గాములకు తరలించినట్లు తెలుస్తోంది. చైనాపై ఫోకస్‌తో ఇండియాన సుదీర్ఘశ్రేణి ఆయుధ వ్యవస్థలను తయారు చేసుకుంటున్నట్లు రిపోర్టులో తెలిపారు. దీంతో పాటు పాకిస్థాన్‌తో ఉన్న శత్రుత్వాన్ని దృష్టిలో పెట్టుకుని కూడా ఇండియా తన ప్లానింగ్ చేస్తున్నట్లు సిప్రి నివేదికలో ఉటంకించింది. ఇక పాకిస్థాన్ అణ్వాయుధాల రిపోర్టును సిప్రి తెలియచేసింది. ఈ ఏడాది నాటికి పాకిస్థాన్ వద్ద 170 వార్‌హెడ్స్ ఉన్నట్లు రిపోర్టులో వెల్లడించారు. ల్యాండ్, ఎయిర్ సామర్థంలో బాగానే ఉన్నా సముద్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నది. రాబోయే దశాబ్దంలో తన అణ్వస్త్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకోనున్నదని రిపోర్టులో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నాటికి ప్రపంచవ్యాప్తంగా 12,187 అణ్వాయుధాలు ఉన్నట్లు సిప్రీ వెల్లడించింది. మిలిటరీ వద్ద 9745 ఆయుధాలు ఉన్నాయని తేల్చింది. ఇక 4012 మాత్రం క్షిపణులు, ఎయిర్‌క్రాఫ్ట్ లో నిక్షిప్తంచేసారు. రష్యా, అమెరికా దేశాలు సుమారు 2200 ఆయుధాలను హై అలర్ట్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. భారత్, చైనా దేశాలు కూడా హై ఆపరేషనల్ అలర్ట్‌లో వార్‌హెడ్స్‌ను పెట్టినట్లు తెలుస్తోంది. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, యూఎస్ దేశాల వద్ద ఎంఐఆర్వీ టెక్నాలజీ ఆయుధాలు ఉన్నాయి. ఇక ఇండియా, పాక్, ఉత్తర కొరియా ఆ టెక్నాలజీ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఎంఐఆర్వీ టెక్నాలజీ అత్యంత శక్తివంతమైందని భావిస్తున్నారు. ఇండియా కూడా ఇటీవల అగ్ని5 మధ్యంతర క్షిపణి ద్వారా ఎంఐఆర్వీ టెక్నాలజీని పరీక్షించింది. మరోవైపు పాక్ మీడియం రేంజ్ క్షిపణులను డెవలప్ చేస్తున్నది.

# నిరుద్యోగ సమస్యలపైనే యువజన సమ్మేళనం

## 16, 17 తేదీల్లో కొత్తపేట బీజేఆర్ భవన్‌లో నిర్వహణ - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై జాన్‌వెస్లీ ధ్వజం

**చిక్కడపల్లి జూన్ 8 (ప్రభాతవార్త ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విఫల విధివిధానాలు, నిరుద్యోగ సమస్యలపై చర్చించి యువతను చైతన్యపర్చేందుకు ఈ నెల 16, 17 తేదీల్లో నగరంలోని కొత్తపేటలోని బీజేఆర్ భవన్‌లో యువజన సమ్మేళనం నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రకటించారు. సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాజ్యసభ సభ్యులు ఏ.ఏ.రహీం హాజరవుతారని తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ చేస్తామన్న కేంద్ర హామీ ఏమైందని జాన్‌వెస్లీ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 60 లక్షలు, ఒక్క రైల్వే శాఖలోనే 10 లక్షల ఖాళీలున్నా భర్తీ చేయడం లేదని, పైగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ఉన్న ఉద్యోగాలను ఊడబీకుతున్నారని మండిపడ్డారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు లేకపోవడం వల్ల దళితులు, ఆదివాసీలు, బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇక రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాల భర్తీ చేస్తామన్న హామీని బుట్టదాఖలు చేసిందని విమర్శించారు.

09-06pg10.qxd:09-06pg10.qxd 1/1/02 6:18 AM Page 1






# మూడు రోజుల్లోనే ఖేల్ ఖతమ్

## ఇన్నింగ్స్ 300 రన్స్‌తో ఘన విజయం *ఏకైక టెస్ట్ సిరీస్ భారత్ కైవసం

## స్పిన్‌కు అఫ్ఘానిస్థాన్ విలవిల*డెబ్యూ టెస్ట్‌లోనే మానవ్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్

### 93 యేళ్లలో ఇదే ఫస్ట్

ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో నెగ్గిన గిల్ సేన అరుదైన ఘనతను ఖాతాలో వేసుకుంది. 93 ఏళ్ల కిందట మొదలైన భారత టెస్ట్ ప్రయాణంలో.. న్యూ చండీగర్ లోని ముల్లన్‌పూర్‌లో సాధించిన ఈ విజయం సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. భారత్ చరిత్రలోనే ఇదే అత్యంత అతి పెద్ద విజయం. ఆఫ్ఘనిస్థాన్‌ను ఫాలోఆన్ ఆడించి మరీ ఇన్నింగ్స్ 300 పరుగుల తేడాతో ఓడించి టీమిండియా ఈ నయా రికార్డును సెట్ చేసింది.

**టెస్ట్ క్రికెట్‌లో భారత్ టాప్-5 విజయాలు**

**2026:** ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 300 రన్స్ విజయం
**2018:** వెస్టిండీస్‌పై ఇన్నింగ్స్ 272 రన్స్ గెలుపు
**2018:** ఆఫ్ఘనిస్థాన్‌పై ఇన్నింగ్స్ 262 రన్స్ విజయం
**2007:** బంగ్లాదేశ్‌పై ఇన్నింగ్స్ 239 రన్స్ గెలుపు
**2017:** శ్రీలంకపై ఇన్నింగ్స్ 239 రన్స్ విజయం

**న్యూచండీఘర్, జూన్ 8:** ముల్లన్‌పూర్ స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్ట్‌లో టీమిండియా అదరగొట్టింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో చెలరేగుతూ క్రికెట్ కూనను దెబ్బ తీసింది. ఏకంగా ఇన్నింగ్స్ 300పరుగుల తేడాతో ఘన విజయం అందుకుని చరిత్ర సృష్టించింది. టెస్ట్‌ల్లో భారత్‌కిదే అత్యంత భారీ విజయం. భారత్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 152 పరుగులకు ఆలౌటై ఫాలోఆన్ ఆడింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ మరింత ఘోరంగా 112 పరుగులకే కుప్పకూలింది. ఈ ఏకైక టెస్ట్ మ్యాచ్ మూడు రోజుల్లోనే ముగిసింది. ఏకైక టెస్ట్ సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంది.

**మానవ్ స్పిన్ ఉచ్చుకు ఆఫ్ఘనిస్థాన్ విలవిల**

ఓవర్‌నైట్ స్కోరు అయిదు వికెట్ల నష్టానికి 113 పరుగులతో మూడో రోజు ఆటను కొనసాగించిన ఆఫ్ఘనిస్థాన్.. భారత బౌలర్ల ముందు క్రీజ్‌లో నిలవలేకపోయారు. టాప్ ఆర్డర్ లాగే మిడిల్ ఆర్డర్, లోయర్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ చేతులెత్తేవారు. లంచ్‌కు ముందే ఆఫ్ఘన్ తొలి ఇన్నింగ్స్‌లో 152 రన్స్‌కు ఆలౌటైంది. అజ్మతుల్లా ఓమర్‌జాయ్‌ను ఆరంభంలోనే డకౌట్‌గా ప్రసిద్ధ్ కృష్ణ పెవిలియన్‌కు పంపాడు. డెబ్యూ బౌలర్ మానవ్ సుతార్ చక్కని స్పిన్‌తో షరఫుద్దీన్(11) ను ఔట్ చేశాడు. ఇక 43 పరుగులతో బ్యాటింగ్ కొనసాగించిన రహత్ షా(135 బంతు ల్లో 60) అర్ధసెంచరీ పూర్తిచేశాడు. చివరకు అతన్ని మానవ్ సుతార్ క్లీన్ బౌల్డ్ చేశాడు. అదే ఊపులో సలీమ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని ఎల్బీగా ఔట్ చేశాడు. రహ్మాద్‌ను వాష్టింగ్టన్ సుందర్ అవుట్ చేయడంతో ఆఫ్ఘన్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. భారత స్పిన్నర్ సుతార్ తొలి ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసుకుని సత్తా చాటాడు. ప్రసిధ్ కృష్ణ మూడు వికెట్లు పడగొట్టాడు.

**ఫాలోఆన్‌లోనే చతికిల**

తొలి ఇన్నింగ్స్‌లో 412 పరుగులు వెనకబడ్డ ఆఫ్ఘనిస్తాన్‌ను టీమిండియా ఫాలోఆన్ ఆడించింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనీలు మరీ దారుణంగా చేతులెత్తేశారు. తొలి వికెట్ కు 42 పరుగులు జోడించాక పతకం మొదలైంది. మహ్మద్ సిరాజ్... ఓపెనర్ మాలిక్(8)ను ఔట్ చేసి ఆఫ్ఘన్ వికెట్ల పతనానికి నాంది పలికాడు. ముగింపు బాధ్యత స్పిన్నర్లు వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్ తీసుకున్నారు. వీరి స్పిన్ బంతులను ఆడలేక ఆఫ్ఘన్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓపెనర్ అటల్ (42), గుర్బాజ్ (24) మాత్రమే కాస్త క్రీజ్‌లో నిలిచారు. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత స్పిన్నర్లు సత్తా చాటారు. ఆఫ్ఘనిస్తాన్ రెండో ఇన్నింగ్స్‌ను కేవలం 35.3 ఓవర్లలో 112 రన్స్ చేసి ఆలౌట్ చేశారు. మూడో రోజు ఆటలో వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. రెండో ఇన్నింగ్స్‌లో సుందర్ 4, కుల్దీప్ మూడు వికెట్లు తీసుకున్నారు. మూడోరోజుఆటలో ఏకంగా 14వికెట్లు పడ్డాయి. డెబ్యూ టెస్ట్‌లోనే ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచి మానవ్ సుతార్ అరుదైన ఘనత అందుకున్నాడు.

**స్కోర్ బోర్డు**

**భారత్ తొలి ఇన్నింగ్స్: 564/8** (శుభ్‌మన్ గిల్ 126, కేఎల్ రాహుల్ 100); **ఆఫ్ఘనిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 152 ఆలౌట్(58.4 ఓవర్లలో)** (రహమత్ షా 60, మానవ్ సుథార్ 6/33); **ఆఫ్ఘని స్థాన్ రెండో ఇన్నింగ్స్(ఫాలోఆన్): 112 ఆలౌట్(35.5 ఓవర్లలో)** (అటల్ 42, వాషింగ్టన్ సుందర్ 4/36, కుల్‌దీప్ 3/30)

**ఫలితం:** భారత్ ఇన్నింగ్స్ 300రన్స్ విజయం

## భారత్, ఇంగ్లండ్ సిరీస్ వేళల్లో మార్పు

**లీడ్స్:** భారత్‌తో జరుగబోయే 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ వేళల్లో ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు మార్పులు చేసింది. బ్రాడ్‌కాస్టర్లతో చర్చల అనంతరం మ్యాచ్‌లను సాయంత్రం 5.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటలకు) ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం వెనుక ప్రధాన కారణం భారత ప్రేక్షకులే. భారత్‌లో క్రికెట్‌కు ఉన్న విపరీతమైన ఆదరణ దృష్ట్యా, మ్యాచ్‌లు మరింత ఎక్కువ మంది వీక్షి ంచేలా టైమింగ్ ను మార్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో బ్రిటన్‌కు చెందిన స్కై స్పోర్ట్స్, భారత్‌కు చెందిన సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లతో నిదితీ సంప్రదింపులు జరిపింది. కాగా, జూలై 1 నుంచి 19 వరకు భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటనుంది. ఈ పర్యటనలో 5 టీ20లు, 3 వన్డేలు జరగనున్నాయి. టీ20 సిరీస్ కోసం భారత జట్టును తాజాగా ప్రకటించారు. శ్రేయస్ అ య్యర్ సారథ్యంలో భారత జట్టు ఈ సిరీస్‌కు సిద్ధమవుతోంది. 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ తొలిసారి సీనియర్ జట్టులో చోటు దక్కించుకోవడంతో ఈ పర్యటనపై మరింత ఆసక్తి నెలకొంది.

## విండీస్‌పై వామప్ మ్యాచ్‌లో టీమిండియా మహిళల విక్టరీ

**కార్డిఫ్, జూన్ 8:** మహిళల టీ20 ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లో టీమిండియా అదరగొట్టింది. వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 26 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత విమెన్ టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 179పరుగులు చేయగా.. విండీస్ 20 ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 153రన్స్‌కే పరిమితమైంది. భారత ఇన్నింగ్స్‌లో భారతి ఫుల్మాలి (56 నాటౌట్) అర్ధ సెంచరీతో రాణించగా.. షఫాలీ వర్మ (29), స్మృతి మంధన (39), యస్తికా భాటియా (36) ఓ మోస్తరు స్కోర్లతో పర్వాలేదనిపించారు. మిగతా ప్లేయర్లు జెమీమా రోడ్రిగ్స్ (7), రిచా ఘోష్ డకౌట్, రాధా యాదవ్ (1), శ్రేయాంక పాటిల్ (2), క్రాంతి గౌడ్ (4)నిరాశ పరిచారు. విండీస్ బౌలర్లలో అఫీ ఫ్లెచర్ 4 వికెట్లతో సత్తా చాటగా.. కరిష్మ రామ్హరాక్, ఆలియా అలెన్, డియాండ్రా డొట్టిన్ తలో వికెట్ తీశారు.

అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనలో ఓపెనర్లు డొట్టిన్ (49), షెర్మైన్ క్యాంప్‌బెల్ (25) శుభారంభం అందిచారు. అయితే రాణించిన శ్రేయాంక పాటిల్ నాలుగు వికెట్లు, రాధా యాదవ్ మూడు వికెట్లు తీసి కట్టడిచేశారు. దీంతో విండీస్‌కు ఓటమి తప్పలేదు. భారత్ జూన్ 10న ఇంగ్లండ్‌తో మరో వార్మప్ మ్యాచ్ ఆడనుంది.

## హెచ్‌సిఎ అధ్యక్షుడికి తెలంగాణ హైకోర్టు షాక్

**హైదరాబాద్, జూన్ 8(ప్రభాతవార్త క్రీడా ప్రతినిధి:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎన్నిక చెల్లదని తెలంగాణ హైకోర్టు షాకింగ్ తీర్పు ఇచ్చింది. అతడిని వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలని, స్పెషల్ ఏజీఎం నిర్వహించి కొత్త అధ్యక్షుడిని వెంటనే ఎన్నికోవాలని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. 2023 అక్టోబర్ 20న జరిగిన హెచ్‌సీఏ ఎన్నికల్లో అమర్‌నాథ్ ఒకే ఒక్క ఓటు తేడాతో జగన్ మోహన్ రావు చేతిలో ఓడిపోయారు. అయితే, జగన్‌మోహన్.. శ్రీ చక్ర క్లబ్ పేరుతో సమర్పించిన పత్రాలు నకిలీవని బీసీసీఐ అంబుడ్స్‌మన్‌కు అమర్‌నాథ్ ఫిర్యాదు చేశారు. అదేవిధంగా 2018లోనే అంబుడ్స్‌మన్ జస్టిస్ ఎల్.నరసింహా రెడ్డి.. గౌలీపురా పేరును శ్రీ చక్ర సీసీగా మార్చడం చట్టవిరుద్ధమని తీర్పునిచ్చారని కాబట్టి ఆ క్లబ్ ఉనికిలో లేదని అమర్‌నాథ్ వాదించారు. దీంతో హెచ్‌సీఏ కార్యకలాపాలు ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఓడిన అమర్‌నాథ్‌ను అధ్యక్షుడిగా ప్రకటిస్తూ జస్టిస్ కైత్ ప్రకటించారు. అయితే, తాజాగా అమర్‌నాథ్ ఎన్నిక చెల్లదంటూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. కేసులో ఇరు పక్షాల వాదనలను విన్న ధర్మాసనం ఆయన ఎన్నిక చెల్లదని తీర్పును వెలువరించింది.



## ఎర్రమట్టి చాంపియన్‌గా జ్వెరెవ్

## తొలి జర్మనీ ప్లేయర్‌గా ఘనత

**పారిస్:** ఎర్రమట్టి కోర్టులో కొత్త ఛాంపియన్ వచ్చాడు. రొలాండ్ గారోస్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌లో ఇటలీ ఆటగాడు ఫ్లావియో కొబోలీతో హోరాహోరీగా అయిదు సెట్లపోరులో మూడో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్6-1, 4-6, 6-4, 6-7, 6-1 తేడాతో నెగ్గి పురుషుల సింగిల్స్ టైటిల్ అందుకున్నాడు. ఈ మ్యాచ్ 4 గంటల 16 నిమిషాలపాటు సాగింది. కొబోలి గట్టిపోటీనివ్వడంతో జ్వెరెవ్ గెలుపు కోసం చెమటోడ్చాడు. నాలుగుసార్లు ఫైనల్‌కు దూసుకొచ్చిన జ్వెరెవ్‌కు ఇదే తొలిగ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్ టైటిల్. చివరి సెట్‌లో పాయింట్ సాధించి గెలుపొందడంతో జ్వెరెవ్.. రొలాండ్ గారోస్‌లో ఒక్కసారిగా తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. మట్టి నేలపై పడుకొని ఇన్నాళ్లు పడిన కష్టానికి కన్నీళ్లు కార్చాడు.

ఈ భావోద్వేగం వెనకాల చాలా కథే ఉంది. సుదీర్ఘకాలంగా వెంటాడుతున్న అనారోగ్య సమస్యపై 29 ఏళ్ల జ్వెరెవ్ నెగ్గాడు. నాలుగేళ్ల పసిప్రాయంలోనే టైప్ 1 డయాబెటిస్ బారిన పడిన జ్వెరెవ్.. 25 ఏళ్లుగా ఎన్నో కఠిన సవాళ్లు ఎదుర్కొన్నాడు. ఎంతోమంది నిరుత్సాహపరిచినా వెరవకుండా తల్లి దండ్రుల సాయంతో కఠోర పరిశ్రమ చేశాడు. అతడు ఎప్పుడు కోర్టులో అడుగుపెట్టినా.. ఇద్దరితో పోరాటం చేయాల్సి వచ్చేది. ఒకటి ప్రత్యర్థి కాగా, మరొకటి తన శరీరంతో. ఎందుకంటే గంటల తరబడి సాగే సుదీర్ఘ ర్యాలీల్లో ఆటగాళ్లు తీవ్రంగా అలసిపోవడం సహజం. అలాంటిది తను మధుమేహ బాధితుడు. ఆట మధ్యలో షుగర్ లెవెల్స్ పడిపోకుండా జాగ్రత్త వహించాలి. లేదంటే ఆరోగ్యం సహకరించక మ్యాచ్ మధ్యలోనే ఇంటికి వెళ్లే పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో ఏ ఆటగాడైనా అంతర్జాతీయ స్థాయిలో టెన్నిస్‌లో రాణించాలంటే అంత సులువు కాదు. అయినా ఏనాడు వెనక్కితగ్గని జ్వెరెవ్.. తన అత్యున్నత ఆటతో అదరగొట్టాడు. తన సమస్యను సమాజంతో పంచుకుంటే ఎవరేమనుకుంటారో అని తొలుత భావించిన జ్వెరెవ్.. చాన్నాళ్లపాటు ఈ విషయాన్ని గోప్యంగానే ఉంచాడు. అయితే తనలాంటి వాళ్లు చాలామంది ఉన్నారనే విషయం తెలుసుకున్న అతడు.. టైప్ 1 మధుమేహంతో బాధపడుతున్న చిన్నారులకు అవగాహన కల్పించడానికి హెల్త్‌కేర్ టెక్నాలజీలో గుర్తింపు పొందిన మెడ్‌ట్రోనిక్‌తో జట్టు కట్టాడు. ఈ సమస్యతో నిరాశలో కూరుకుపోయిన వారికి ఓ దిక్సూచిగా నిలిచేందుకు, వారిలో సంకల్ప బలం పెంచేందుకు ముందుకువచ్చాడు. తన సోదరుడితో కలిసి 2022లో అలెగ్జాండర్ జ్వెరెవ్ ఫౌండేషన్‌ను సైతం స్థాపించాడు. టైప్ 1 డయాబెటిస్‌తో బాధపడుతున్న చిన్నారులకు ఇన్సులిన్ ఇంజక్షన్లు, ఇతర మందులు అందిస్తున్నాడు.

ఇక ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ మ్యాచ్ మధ్యలో జ్వెరెవ్ విరామం తీసుకుని ఇన్సులిన్ ఇంజెక్షన్ తీసుకున్న వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతోంది. టెన్నిస్‌లో తీవ్రపోటీ ఉన్నప్పటికీ ఏనాడు తన సమస్యను సాకుగా చూపి వెనక్కితగ్గని జ్వెరెవ్ ఎందరికో ఆదర్శంగా నిలిచాడు.




## ఎఐ రంగంలోకి రిలయన్స్ ఇన్‌ఫ్రా

**ముంబయి, జూన్ 8:** పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (ఆర్ఇన్ఫ్రా) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇతర కొత్త టెక్నాలజీల రంగంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. తన వ్యాపార కార్యకలాపాల్లో టెక్నాలజీ ఆధారిత సేవలను భాగం చేసే వ్యూహంలో భాగంగా ఈ అడుగు వేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ మేరకు తమ అనుబంధ సంస్థల ద్వారా ఈ కొత్త వ్యాపారంలోకి ప్రవేశిస్తున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్‌లో రిలయన్స్ ఇన్ఫ్రా పేర్కొంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏఐ, సంబంధిత టెక్నాలజీ విభాగాల్లో పాలుపంచుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. రిలయన్స్ ఏఐ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ అపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఏఐ వన్ ప్రైవేట్ లిమిటెడ్ అని కొత్త పేర్లతో ఈసంస్థలు వస్తున్నాయి. రిలయన్స్ ఇన్ఫ్రా ఏఐ రంగ ప్రవేశ ప్రకటన మార్కెట్లో తక్షణమే సానుకూల ప్రభావం చూపింది. బీఎస్ఈలో కంపెనీ షేరు 5 శాతం పెరిగి రూ.86.17 వద్ద ఎగువ సర్క్యూట్‌ను తాకింది. గత ఏడాది కాలంలో సుమారు 80 శాతం నష్టపోయినప్పటికీ, గత నెల రోజుల్లో 20 శాతానికి పైగా లాభపడింది. ఆరు నెలల్లో 40 శాతం పతనం కాగా, గత ఐదేళ్లలో మాత్రం 3 శాతానికి పైగా లాభాలను అందించింది. కంపెనీ ఆర్థిక ఫలితాలను పరిశీలిస్తే, 2026 మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ. 918 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కార్యకలాపాల ద్వారా రూ. 4,001 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ రూ. 2,900 కోట్ల లాభాన్ని, రూ. 20,440 కోట్ల రాబడులను నమోదు చేసింది.

### పశ్చిమాసియా వార్ ఉద్రిక్తతలతో..

## ఈక్విటీ సూచీలకు నష్టాలు



**ముంబయి, జూన్ 8:** దేశీయ ఈక్విటీసూచీలు వారం ప్రారంభంలో నష్టాలు చవిచూసాయి. ఆసియా మార్కెట్లలో భారీ ఎత్తున అమ్మకాలు కొనసాగడం, ముడిచమురు దరలు పెరుగుతుండటం, పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు చోటు చేసుకోవడంతో మార్కెట్ల సూచీలు దెబ్బతిన్నాయి. అలాగే ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు పెంచుతుందన్న వార్తలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను మార్చింది. మెటల్, ఆటోమొబైల్ స్టాక్స్ ఎక్కువ దెబ్బతీసాయి. హెల్త్‌కేర్‌స్టాక్స్‌లో కూడా భారీ అమ్మకాలు కొనసాగాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 719.08 పాయింట్లు క్షీణించి 73,524.26 పాయింట్ల వద్ద ట్రేడింగ్ నిలిపివేస్తే నిఫ్టీ 50 సూచీ 243.70 పాయింట్లు క్షీణించి 23,123 పాయింట్ల వద్ద ముగించింది. వరుసగా రెండు సెషన్లలోను సెన్సెక్స్ 1.13శాతం, నిఫ్టీ 1.38శాతం చొప్పున క్షీణించాయి. రిలయన్స్ 2.18శాతం, ఎల్అండ్‌టి 2.09 శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.21శాతం చొప్పున నిఫ్టీలో ఎక్కువ నష్టం చవిచూసాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్ సూచీ 1.70శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.88శాతం చొప్పున దిగజారాయి.


మార్కెట్ల పరంగా 1181 షేర్లు పెరిగితే 3192 షేర్లు క్షీణించాయి. 180 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి 95.74గా కొనసాగింది. అంత కుముందురోజు 95.18కంటే స్వల్పంగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్ ధరలు ఆగస్టు 6వ తేదీనాటి సెటిల్‌మెంట్లు 1.33శాతం క్షీణించి రూ.1,53,529కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఆగస్టు సెటిల్‌మెంట్ ధరలు3.92డాలర్లు పెరిగి 97.01కి చేరాయి. యూరోప్, ఆసియా షేర్లు కూడా దిగువ స్థాయిలో ట్రేడింగ్‌జరగడంతో ఈ ప్రభావం భారత్ మార్కెట్లపై చూపించింది. వివిధ కంపెనీల పరంగా చూస్తే ఇఎంఎస్ 10.35శాతం పెరిగింది. హెచ్‌జి ఇన్‌ఫ్రా ఇంజినీరింగ్ 2.84శాతం, జీ ఎంటరటైన్‌మెంట్ 1.05శాతం డౌన్ అయ్యాయి. క్యాపిట్ బ్రూవ రీస్ డిస్టిలరీస్ 4.96శాతం, లీ ట్రావెన్యూస్ టెక్నాలజీ ఇక్సిగో 2.49శాతం క్షీణించాయి.

సిగ్మా అడ్వాన్సుడ్ సిస్టమ్స్ 4.39శాతం, ఆదాని పోర్టులు సెజ్ 1.05శాతం, వారి రెన్యువబుల్ టెక్నాలజీస్ 2.36శాతం, లూపిన్ 0.58శాతంచొప్పున క్షీణించాయి.



## గ్లోబల్ తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్

**న్యూయార్క్, జూన్ 8:** టెస్లా, స్పేస్ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా నిలిచే అవకాశం ఉంది. ఒక ట్రిలియన్ డాలర్ల సంపదను కలిగిన మొట్టమొదటి వ్యక్తిగా మస్క్ రికార్డు సృష్టించబోతున్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా ఉన్న మస్క్ సంపదలో అధిక భాగం టెస్లా కంపెనీ షేర్ల రూపంలో ఉంది. దీని విలువ సుమారు 273 బిలియన్ డాలర్లు. మరో సంస్థ స్పేస్ఎక్స్ త్వరలో స్టాక్ మార్కెట్‌లో అడుగుపెడితే (ఐపీఓ), ఆయన సంపదకు అదనంగా మరో 841 బిలియన్ డాలర్లు జతయ్యే అవకాశం ఉంది. అప్పుడు ఆయన నికర సంపద 1 ట్రిలియన్ డాలర్ల మార్కును సులభంగా దాటుతుంది. ఒక ట్రిలియన్ డాలర్లంటే భారత కరెన్సీలో సుమారు 95 లక్షల కోట్ల రూపాయలు. ఈ సంపద విలువ ప్రపంచంలోని చాలా దేశాల వార్షిక ఆర్థిక వ్యవస్థల (జీడీపీ) కంటే ఎక్కువ కావడం గమనార్హం. తైవాన్ ( 977 బిలియన్లు), ఐర్లాండ్ ( 779 బిలియన్లు), స్వీడన్ ( 760 బిలియన్లు), సింగపూర్ (660 బిలియన్లు) వంటి అభివృద్ధి చెందిన దేశాల జీడీపీ కంటే కూడా మస్క్ సంపదే ఎక్కువగా ఉంటుంది. ప్రపంచ ఆర్థిక కేంద్రమైన మాన్‌హట్టన్ వార్షిక ఆర్థిక ఉత్పత్తి (1 ట్రిలియన్)తో ఇది సమానంగా ఉంది. మస్క్ తోటి టెక్ బిలియనీర్లతో పోల్చినప్పుడు ఈ సంపద స్థాయి తెలుస్తోంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్, ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్, గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్ వంటి పలువురు అగ్రశ్రేణి కుబేరులందరి మొత్తం సంపద కలిపితే సుమారు1.09 ట్రిలియన్లు ఉంటుంది. వీరందరి సంపద కేవలం మస్క్ ఒక్కడి సంపద కంటే కొంచెమే ఎక్కువ. అమెరికాలోని ప్రధాన నగరమైన హ్యూస్టన్‌లోని నివాస, వాణిజ్య ఆస్తులన్నింటి మొత్తం విలువ (879 బిలియన్లు) కంటే కూడా మస్క్ సంపద ఎక్కువ.




### భారత్ డీమ్యాట్ రంగంలో 77శాతం ఖాతాలు నిర్వీర్యం

## అసలు ఖాతాలు ఐదు కోట్లే

**న్యూఢిల్లీ:** భారతదేశంలో రిటైల్ ఇన్వెస్టింగ్ విప్లవం భారీగా విస్తరించినట్లు కనిపిస్తున్నప్పటికీ, డీమ్యాట్ ఖాతాల వాస్తవ వినియోగం తక్కువగానే ఉంది. గత ఏడాది డిసెంబర్ నాటికి దేశంలో డీమ్యాట్ ఖాతాల సంఖ్య 21.6 కోట్లకు చేరగా, వాటిలో కేవలం 5 కోట్ల ఖాతాలే పనిచేస్తున్నట్లు తేలింది. మిగిలిన 16.6 కోట్ల ఖాతాలు నిర్వీర్యంగా లేదా క్రియాశీలత లేకుండా ఉన్నట్లు తెలుస్తోంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2026 ఆర్థిక సంవత్సరంలో యాక్టివ్ ఇన్వెస్టర్ల సంఖ్య 7శాతం తగ్గి 4.58 కోట్లకు చేరింది. 2025లో ఈ సంఖ్య 4.92 కోట్లుగా ఉండగా, ఏడాదిలోనే దాదాపు 35 లక్షల యాక్టివ్ ఖాతాలు తగ్గిపోయాయి. ఈ తగ్గుదలలో 70 శాతం కంటే ఎక్కువ భాగం జీరోధా, ఏంజెల్ వన్, అప్స్టాక్స్ వంటి ప్రముఖ డిస్కౌంట్ బ్రోకర్ల ఖాతాదారుల నుంచే నమోదైంది. మార్కెట్ నిపుణులు దీనికి మూడు ప్రధాన కారణాలను గుర్తిస్తున్నారు. బుల్ మార్కెట్ సమయంలో అనేక మంది పెట్టుబడిదారులు కేవలం ఐపీఓలలో పాల్గొనడానికి మాత్రమే డీమ్యాట్ ఖాతాలు తెరిచారు. షేర్ల కేటాయింపు రాకపోవడం లేదా లిస్టింగ్ అనంతరం వెంటనే విక్రయించడం వల్ల ఆ ఖాతాలను తరువాత ఉపయోగించలేదు.

డిజిటల్ బ్రోకరేజ్ సేవలు, పేపర్‌లెస్ ప్రక్రియల కారణంగా ఒకే వ్యక్తి అనేక బ్రోకర్ల వద్ద డీమ్యాట్ ఖాతాలు తెరవడం సులభమైంది. వాటిలో ఒక ఖాతాను మాత్రమే వినియోగిస్తూ మిగిలిన ఖాతాలను నిర్వీర్యంగా వదిలేస్తున్నారు. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఎఫ్అండ్‌వో విభాగంలో ఎక్కువ మంది రిటైల్ ట్రేడర్లు నష్టాలను ఎదుర్కొంటున్నట్లు నియంత్రణ సంస్థల అధ్యయనాలు వెల్లడించాయి. న ప్రైవేట్ వెల్త్ వ్యవస్థాపకుడు హిమాన్షు పాండ్యా మాట్లాడుతూ, ఖాతాల సంఖ్య పెరగడం మాత్రమే నిజమైన మార్కెట్ భాగస్వామ్యానికి సూచిక కాదన్నారు.

దూకుడుగా ఖాతాలు తెరవడం ద్వారా మార్కెట్లో స్థిరమైన పెట్టుబడిదారులు పెరగరని ఆయన అభిప్రాయపడ్డారు. మనీలాండరింగ్, మోసపూరిత లావాదేవీలకు ఇటువంటి ఖాతాలు ఉపయోగపడే అవకాశం ఉందని హెచ్చరించారు. 21.6 కోట్ల డీమ్యాట్ ఖాతాల సంఖ్య కనిపిస్తున్నప్పటికీ, బహుళ ఖాతాల కారణంగా దేశంలో నిజమైన ప్రత్యేక పెట్టుబడిదారుల సంఖ్య 12 నుంచి 13 కోట్ల మధ్య మాత్రమే ఉండొచ్చనిఅంచనా. రిటైల్ పెట్టుబడిదారుల భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కనిపిస్తున్నప్పటికీ, యాక్టివ్ ఖాతాల తగ్గుదల భారత పెట్టుబడి సంస్కృతిలో ఉన్న వాస్తవ పరిస్థితిని బయటపెడుతోందని నిపుణులు పేర్కొంటున్నారు.

## వాటాల విక్రయానికి ఎన్ఎల్‌సీ ఓఎఫ్ఎస్?




**న్యూఢిల్లీ, జూన్ 8:** ప్రభుత్వరంగంలోని నైవేలి లిగ్నయిట్ కార్పొరేషన్ ఆఫర్‌ఫర్‌సేల్ ప్రకటించింది. మూడుశాతం ఈక్విటీ వాటాలను విక్రయించనున్నట్లు తెలిపింది. ఇన్వెస్టర్లు ప్రభుత్వరంగంలోని ఒక నవరత్న కంపెనీ షేర్లు కొనుగోలుకు ఇపుడు మంచి తరుణం వచ్చింది. ప్రభుత్వ పరిధిలోని పెట్టుబడుల ఉపసంహరణ పథకం పరిధిలో ఈ ఓఎఫ్ఎస్ ఉంటుందని కంపెనీ ప్రకటించింది. ఓఎఫ్ఎస్ ఇష్యూధర రూ.303గా ప్రకటించింది. నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు మంగళవారంనుంచే ప్రారంభిస్తారు. రిటైల్ ఇన్వెస్టర్లకు ఈనెల పదోతేదీనుంచి బిడ్లు తెరుస్తారు. ఇష్యూధర ప్రస్తుత మార్కెట్‌ధరకంటే 10శాతం డిస్కౌంట్‌కు లభిస్తున్నది. రెండుశాతం అధీకృత మూలధనంలో వాటాగా ఈ షేర్‌సేల్ ఉంటుంది. అదనంగా ఒకటిశాతం వాటా గ్రీన్‌షూ ఆప్షన్‌కింద అందుబాటులో ఉంచుతుంది. పవర్‌బిజినెస్‌లను పెంచుకోడం, సామర్థ్యం విస్తరణ వంటివదటికి ఈనిధులు వినియోగిస్తారు. ఇటీవలికాలంలో ఎన్ఎల్‌సీ మంచి పనితీరుచూపించింది. స్థిరంగా రిటర్నులు వస్తున్నాయి. వాటాదారులకు క్రమం తప్పకుండా డివిడెండ్లు ప్రకటిస్తోంది. ఇన్వెస్టర్ల స్పందనను ట్రేడర్లు నిశితంగా గమనిస్తున్నారు.

## రెండునెలల్లో 15% పెరిగిన ఎగుమతులు



**ముంబయి, జూన్ 8:** భారత వాణిజ్య ఎగుమతులు ఏప్రిల్ మేనెలల్లో 15శాతం పెరిగినట్లు కేంద్ర వాణిజ్య శాఖ ప్రకటించింది. అదనంగా పెట్రోలియమేతర ఉత్పత్తుల ఎగుమతులు పటిష్టమైన వృద్ధిని నమోదుచేసాయి. 10నుంచి 11శాతం ఎగుమతులు పెరిగినట్లు కేంద్రం వెల్లడించింది. పశ్చిమాసియా సంక్షోభం పెరుగుతున్నప్పటికీ వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నప్పటికీ భారత్‌నుంచి ఎగుమతులు మాత్రం పటిష్టంగా ఉన్నట్లు కేంద్రం ప్రకటించింది. 2027 ఆర్థికసంవత్సరం ప్రారంభంనుంచే పటిష్టంగా ఉన్నాయి. ఏటికేడాది 13.6శాతం వృద్ధిననమోదుచేస్తూ ఏప్రిల్ 2026లో 80.8 బిలియన్ డాలర్లు విలువైన ఎగుమతులు జరిగాయి. వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్‌మాట్లాడుతూ ప్రాంతీయ సవాళ్లు ఎన్ని ఎదురయినా ఎగుమతులకు విఘాతం కలగలేదని, విభిన్న మార్కెట్లకు ఎగుమతులుచేయడంవల్ల పటిష్టమైన వృద్ధిని సాధించామన్నారు. ఉత్పత్తుల ఎగుమతులు ఏప్రిల్‌లో 43.56 బిలియన్ డాలర్లకు చేరాయి. గత ఏడాది ఇదేనెలలో 38.28 బిలియన్ డాలర్లవరకూ మాత్రమే ఉన్నాయి. సేవలరంగ ఎగుమతులు 32.8 బిలియన్ డాలర్లనుంచి 37.2 బిలియన్ డాలర్లకు పెరిగాయి. దిగుమతులు కూడా పెరిగాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps